సాహితి
గత వారం రోజుల్లో విశేషాలు

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల
ముఖ్యమైన పరిణామాలు

సామాజిక, ఆర్థిక, రాజకీయ
పుస్తక సమీక్షలు

ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో
ఒక పూర్తి పేజీ



తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తిరుపతి : fb.com/vaartha Digital

Published from Tirupathi, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

20-6-2026 శనివారం సంపుటి: 32 సంచిక: 140 పేజీలు: 10+4 వెల: 6.50


అమెరికా, ఇరాన్ చర్చలకు బ్రేక్

చీలిక దిశగా శరద్‌పవార్ ఎన్సీపి

5లో

# డిజిటల్ ఆర్థిక నేరాల కట్టడికి చర్యలు



శుక్రవారం రాష్ట్ర వార్షిక రుణ ప్రణాళికను విడుదల చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు. చిత్రంలో బ్యాంకర్లు, అధికారులు

**ప్రత్యేక ఎస్వోపీ రూపొందించాలని బ్యాంకులను కోరిన సిఎం చంద్రబాబు**

రుణాల మంజూరులో ఎంఎస్ఎంఇ రంగానికి ప్రాధాన్యత

**విద్యారుణాలకు అదనంగా 4% రాయితీ**

**రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ సమావేశంలో సిఎం**

2026-27 వార్షిక రుణ ప్రణాళిక విడుదల చేసిన సిఎం

**విజయవాడ,జూన్ 19, ప్రభాతవార్త ప్రతినిధి:** డిజిటల్ ఆర్థిక నేరాల నియంత్రణ దిశగా బ్యాంకులు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బ్యాంకర్లకు దిశానిర్దేశం చేశారు. డిజిటల్ అరెస్టులు, ఇతర సైబర్ నేరా లకు అడ్డుకట్ట వేసేందుకు ఓ ప్రత్యేక ఎస్వోపీని రూపొందించాలని సూచించారు. సచివాలయంలో 235 రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ సమావేశానికి ముఖ్యమంత్రి హాజరయ్యారు. 2026- 27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వార్షిక రుణ ప్రణాళికను విడుదల చేశారు. ఈ ఆర్థిక సంవత్సరంలో వివిధ రంగాలకు రూ.8.10 లక్షల కోట్ల మేర రుణాలను మంజూరు చేయాలని నిర్ణయించారు. వ్యవసాయం సహా ప్రాధాన్యతా రంగాలకు రూ.5.4 లక్షల కోట్లు, ఇతర రంగాలకు రూ.2.70 లక్షల కోట్లను ఇవ్వాలని ప్రణాళిక చేశారు. ప్రత్యేకించి వ్యవసాయ రంగానికి రూ.3.60లక్షల కోట్లు, పంట రుణాల కింద రూ.2లక్షల కోట్లు ఇవ్వాలని బ్యాంకులు నిర్ణయించాయి. వ్యవసాయ యాంత్రీకరణ రూ.10,693కోట్ల మేర ఆర్థిక సహకారం అందించాలని రుణప్రణాళికలో పేర్కొన్నాయి. ఎంఎస్ఎంఈ రంగానికి రూ.1.55 లక్షల కోట్లు, మైక్రో ఎంటర్ ప్రైజెస్ కోసం రూ.70వేలకోట్లు, గృహ నిర్మాణానికి రూ.11,500కోట్లు, విద్యారుణాలకు రూ.2,500కోట్లు కేటాయిస్తున్నట్టు రుణ ప్రణాళికలో వెల్లడించాయి. 2026-27 వార్షిక రుణ ప్రణాళికపై బ్యాంకర్లతో సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ ఎంఎస్ఎంఈలకు ప్రభుత్వం అధిక >>2

## రాజధానిలో బ్యాంక్ స్ట్రీట్

**విజయవాడ, జూన్ 19,ప్రభాతవార్తప్రతినిధి:** అమరావతి రాజధానిలో బ్యాంక్ స్ట్రీట్ నిర్మాణ పనులు వేగంగా పూర్తయ్యేలా చూడాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సీఆర్డీఏ అధికారులను ఆదేశించారు. బ్యాంకుల ప్రధాన కార్యాలయాల నిర్మాణానికి అవసరమైన అనుమతుల విషయంలో జాప్యం చేయవద్దని స్పష్టం చేశారు. సీఎం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన సీఆర్డీఏ అథారిటీ సమావేశం జరిగింది. రాజధాని ప్రాంతంలోని ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో వివిధ బ్యాంకుల ప్రధాన కార్యాలయాల నిర్మాణాల అంశంపై చర్చించారు. బ్యాంకు కార్యాల యాల నిర్మాణాలకు సీఆర్డీఏ వైపు నుంచి పూర్తి సహకారాన్ని అందించాలని ముఖ్యమంత్రి సూచించారు. బ్యాంక్ స్ట్రీట్‌లో >>2



## నీట్ రీ ఎగ్జామ్‌కు 'సుప్రీం' పచ్చజెండా

- పరీక్ష నిలిపివేయాలని దాఖలైన పిటిషన్లు కొట్టివేత
- ఎన్‌టిఎ ఆధికారిక వాట్సప్ ఏర్పాటు
- టెలిగ్రాం పిటిషన్‌కు తిరస్కృతి

**హైదరాబాద్, ప్రభాతవార్త, జూన్ 19:** వైద్య విద్యా కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే నీట్ రీ ఎగ్జామ్‌కు లైన్ క్లియర్ అయ్యింది. నీట్ రీ ఎగ్జామ్‌ను నిలిపివేయాలంటూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీం కోర్టు కొట్టివేసింది. ఈ నెల 21న జరగబోయే రీ ఎగ్జామ్ యథాతథంగా కొనసాగుతుందని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. నీట్ రీ ఎగ్జామ్ నిలిపివేయాలంటూ కొందరు విద్యార్థులు సుప్రీం కోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ జరిపిన న్యాయస్థానం అందుకు నిరాకరించింది. పిటిషన్లను అత్యవ సరంగా విచారణ జరపాలంటూ అభ్యర్థుల తరఫు న్యాయవాది కోరగా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం దాన్ని తోసిపుచ్చింది. నీట్‌కు సంబంధించిన అన్నీ పిటిషన్లు జస్టిస్ పీఎస్ నరసింహ ధర్మాసనం ముందుకు వెళ్లాయని వీటిని కూడా ఆ ధర్మాసనమే విచారిస్తుందని స్పష్టం చేశారు. విద్యార్థులు వేసిన పిటిషన్లలో అత్యవసర పరిస్థితి లేదని ఆయన తెల్చి~ప్పారు. పేపర్ లీకేజీ, అడ్మిట్ కార్డుల డౌన్‌లోడ్‌లో సమస్యలు ఉన్నాయన్న పిటిషన్లను ఈ మేరకు సుప్రీంకోర్టు కొట్టివేసింది. విద్యార్థులు, నీట్ యుజి అభ్యర్థులు దాఖలు చేసిన ఒక ప్రత్యేక పిటిషన్‌పై తక్షణమే విచారణ చేపట్టాలని న్యాయవాది అదీల్ అహ్మద్ కోరారు. అభ్యర్థుల విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకుని జూన్ 21న పరీక్ష నిర్వహించే సాధ్యాసాధ్యాలను పునఃపరిశీలించాలని ఈ మేరకు కేంద్రాన్ని ఆదేశిం చాలని పిటిషన్‌లో పేర్కొన్నారు. మానసిక క్షోభ, తీవ్ర ఆందోళన, పరీక్ష రద్దు కావడం వల్ల తలెత్తిన అనిశ్చితి, >>2

## సిఐ నాగరాజుపై హత్యకేసు నమోదు

### సాయికృష్ణ మిస్సింగ్ కేసు

**విజయవాడ క్రైం,జూన్ 19,ప్రభాతవార్త:** రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన గాదె సాయి కృష్ణ మిస్సింగ్‌కేసులో సాయికృష్ణ తల్లి విజయ లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సిఐ నాగరాజుపై హత్య కేసు నమోదు చేశారు. వాటితో పాటు అక్రమ నిర్బంధం,నిర్బంధించిన వ్యక్తి ఆచూకీని కుటుంబ సభ్యులకు తెలియకుండా దాచిపెట్టడం తదితర సెక్షన్ల క్రింద కేసులు నమోదు చేశారు. కేసు విచారణాధికారిగా నియమితులైన దిశ పోలీస్‌స్టేషన్ ఎసిపి దైవప్రసాద్ నేతృత్వంలో దర్యాప్తు బృందం శుక్రవారం సాయికృష్ణ నివాసానికి చేరుకొని విజయలక్ష్మి తదితరుల వాంగ్మూలాలను నమోదు చేశారు. ఆయనతో పాటు మరో ఇద్దరు సిఐలు,ఇ ద్దరు ఎస్ఐలు కూడ సాయికృష్ణ బంధువుల విచారణలో పాల్గొన్నారు. విజయలక్ష్మి నుండి సాయికృష్ణఅదృశ్యమైన పరిస్థితులు,చివరిసారిగా ఎప్పుడు కనిపించాడు, గతంలో జరిగిన పరిణామాల >>2



కోల్‌కతాలో జరిగిన సదస్సులో ప్రసంగిస్తున్న మంత్రి నారా లోకేష్

## 3'ఎస్'ల మంత్రంతో రాష్ట్రం మున్ముందుకు

సంస్కరణల అమలులో దేశంలోనే ముందంజ

**అభివృద్ధిలో భాగస్వాములవ్వాలని పెట్టుబడిదారులకు మంత్రి లోకేష్ ఆహ్వానం**

**విజయవాడ,జూన్ 19,ప్రభాతవార్తప్రతినిధి:** బలమైన రాష్ట్రాలే శక్తివంతమై దేశాన్ని నిర్మించగలవని, రాష్ట్రాల మధ్య ఆరోగ్యకరమైన పోటీతోనే దేశాభివృద్ధి సాధ్యమని ఏపీ ఐటీ, విద్యాశాఖ మంత్రి >>2



భూమి పూజ చేస్తున్న డి.సిఎం పవన్

## అరణ్యారామం ఆరంభం

**విజయవాడ, జూన్ 19, ప్రభాత వార ప్రతినిధి:** మానవ, వన్యప్రాణి సంఘర్షణ నియంత్రణ దిశలో ఏపీ >>2




# డిజిటల్ ఆర్థిక నేరాల కట్టడికి చర్యలు

>> ప్రాధాన్యత ఇస్తోంది. ఈ రంగానికి బ్యాం కులు విరివిగా రుణాలు మంజూరు చేసి ప్రోత్స హించాలన్నారు. కేంద్రం కూడా ఆటోపైలట్ మోడ్‌లో రుణాలు ఇవ్వాలని చెబుతోంది. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా స్టార్టప్‌లు, ఆవిష్కరణలు వస్తున్నాయి. అర్హులైన వారికి రుణాలు ఇవ్వటంలో బ్యాంకులు ముందుకు రావాలి. దేశానికి ప్రత్యేక యూనికార్న్ సంస్థలు అవసరం అవుతాయి. వయబిలిటీ సస్టెయినబిలిటీ అనేది వ్యాపార సంస్థలకు అత్యంత కీలకం. బ్యాంకులకు పూర్తి సహకారం అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. రుణ వితరణ, ఎన్పీఏలపై బ్యాం కర్లు అధికారులతో ఓ కమిటీ ఏర్పాటు చేయాలి. కేంద్ర ప్రాయోజిత పథకాలను పూర్తి స్థాయిలో వినియోగించుకుంటాం. వన్ ఫ్యామిలీ వన్ ఎంట్రప్రెన్యూర్ కార్యక్రమం ద్వారా పెద్ద ఎత్తున వ్యాపార వేత్తలను తయారు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. అక్వా రంగానికి కూడా బ్యాంకులు ప్రోత్సాహకం ఇవ్వాలి. వీటి ద్వారా సంపద సృష్టించేందుకు అస్కారం ఉంటుంది. సబ్సీడీపై 200 మెకనైజ్డ్ బోట్ల కొనుగోలుకు సంబంధించి కూడా బ్యాంకులకు ప్రతిపాదనలు ఇచ్చాం. డిజిటల్ ఆర్థిక నేరాల్లో బాధితులు సొమ్ము కోల్పోకుండా బ్యాంకులు తక్షణం స్పందించాలి. నేరస్తులను పట్టుకోవటం ఆలస్యం అవుతోంది. బ్యాంకులు సెంట్రల్ ట్రాన్సాక్షన్ మోనిటరింగ్ సెల్స్‌ను ఏర్పాటు చేసి ఫైనాన్షియల్ ఫ్రాడ్స్‌ను నియంత్రించాలి. డిజిటల్ అరెస్టు పేరిట చదువుకున్నవారు కూడా పెద్ద మొత్తంలో నగదు కోల్పోతున్నారు. ఏపీలో గడచిన మూడు నెలల్లో పెద్ద ఎత్తున ప్రజలు ఈ డిజిటల్ ఫ్రాడ్ లో నగదు కోల్పోయారు. ఈ నేరాలను విశ్లేషించి తగిన ఎస్వోపీని చేపట్టాలి. ఈ నేరాలపై ప్రజలను చైతన్య పరిచేలా పెద్ద ఎత్తున కార్యక్రమాలు చేపట్టాలి. "అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

**విద్యా రుణాల వడ్డీపై 4 శాతం అదనంగా రాయితీ..**

విద్య రుణాలపై వడ్డీలో 4 శాతం రాయితీ ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉంది. పీఎం విద్యానిధి స్కీమ్ కు అనుబంధంగా ఈ కార్యక్రమం చేపట్టాలని ఆలోచన చేస్తున్నాం. దేశ, విదేశాల్లో ఉన్నత విద్య అభ్యసించే విద్యార్థులకు వెసులుబాటు కల్పించేలా ఈ నిర్ణయం తీసుకున్నాం. పునరుత్పాదక ఇంధనానికి కూడా రుణ మంజూరీ బాగా పెంచాల్సిన అవసరం ఉంది. పీఎం సూర్యఘర్ కింద 10 లక్షల కుటుంబాలకు పథకాన్ని అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. పీఎం విశ్వకర్మ లాంటి కేంద్ర పథకాలకు బ్యాంకులు పూర్తిగా సహకారాన్ని అందించాలి. బ్యాంకర్లు ప్రభుత్వ విభాగాల మధ్య మెరుగైన సమన్వయం ఉండాలి. ప్రైవేటు బ్యాంకులు కూడా స్టాండప్ ఇండియా లాంటి పథకాలను అమలు చేసేలా లబ్ధిదారులకు రుణాలు మంజూరు చేయాలి. బ్యాంకులు సామాజిక బాధ్యతగా లబ్ధిదారులను ఆదుకోవాల్సిందే. డైరీ, ఆక్వా కల్చర్, కోల్డ్ చైన్ లాంటి వివిధ రంగాలు వృద్ధి చెందేలా రాష్ట్ర స్థూల ఉత్పత్తి సాధనలో బ్యాంకర్లు సహకారం అందించాలి. జిల్లా కలెక్టర్లు కూడా స్థానిక అవకాశాలను లబ్ధిదారులు అందిపుచ్చుకునేలా బ్యాంకర్లతో మాట్లాడాలి. ఎస్సీ,ఎస్టీ, బీసీ లాంటి వెనుకబడిన వర్గాల లబ్ధిదారులకు పూర్తి ఆర్థిక చేయూత ఇవ్వాలి. బ్యాంకులకు లాభాపేక్ష మాత్రమే కాదు సామాజిక బాధ్యత, సమాజం పట్ల కమిట్‌మెంట్ ఉండాలి. హౌసింగ్ లబ్ధిదారులకు కూడా రుణాలు మంజూరులో జాప్యం చేయవద్దు." అని సీఎం స్పష్టం చేశారు.

**బ్యాంక్ స్ట్రీట్ లో ఐకానిక్ బ్యాంకు భవనాలు..**

అమరావతి రాజధానిలో భూములు తీసుకున్న బ్యాంకులు ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ లో ఉన్న బ్యాంక్స్ స్ట్రీట్ లో త్వరితగతిన నిర్మాణాలు పూర్తి చేయాలి. ప్రతీ బ్యాంకూ తమకు ఓ ఐకానిక్ భవనం ఉండేలా చూసుకోవాలి. రిజర్వు బ్యాంక్ కూడా ఏపీలో తమ కార్యకలాపాలను మరింత విస్తృతం చేయాలి. ఎంఎస్ఎంఈలకు రుణ సహకారం అందిస్తే పెద్ద ఎత్తున ఉపాధి, ఉద్యోగ అవకాశాలు బాగా పెరుగుతాయి. మహిళలు, యువతకు డైరీ, అక్వా రంగాల్లో సంపదకు ఆస్కారం ఉంటుంది. ఈ ఏడాది 15 శాతం వృద్ధిరేటు సాధించేలా ప్రయత్నాలు చేస్తున్నాం. దానికి అనుగుణంగా ఆయా రంగాలకు బ్యాంకులు ఆర్థిక ఊతం ఇవ్వాలి." అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. సమావేశంలో యూనియన్ బ్యాంకు సీఎండీ, సీఈఓ ఆశీష్ పాండేతో కలిసి 202627 ఆర్థిక సంవత్సరానికి ఏపీ వార్షిక రుణ ప్రణాళికలను ముఖ్యమంత్రి విడుదల చేశారు. ఈ సమావేశానికి సీఎస్‌సాయి ప్రసాద్, కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ డైరెక్టర్ నీలమ్ అగ్రవాల్, ఆర్బీఐ రీజినల్ డైరెక్టర్ ఏఓ బషీర్, నాబార్డు జీఎం కేవీఎస్‌ప్రసాద్, నేషనల్ ఎస్టీ కమిషన్ సునీల్ కుమార్ బాబు తో పాటు వివిధశాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు.



శుక్రవారం సిఎం చంద్రబాబునాయుడుని కలిసి గాదె విజయలక్ష్మి, ఇతర కుటుంబసభ్యులు

## నిష్పక్షపాతంగా దర్యాప్తు: సిఎం చంద్రబాబు

**విజయవాడ,జూన్ 19,ప్రభాతవార్తప్రతినిధి:** సాయికృష్ణ అదృశ్యం ఘటనలో దోషులెవ్వరైనా విడిచిపెట్టమని, అతని కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని సీఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేసారు. ఇప్పటికే సాయికృష్ణను తీసుకుని వెళ్ళిన పోలీసులపై క్రమ శిక్షణ చర్యలు తీసుకున్నామని స్పష్టం చేసారు. విజయవాడ కృష్ణలంకకు చెందిన గాదె సాయి కృష్ణ తల్లి విజయలక్ష్మి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును సీఎం క్యాంపు కార్యాలయంలో కలిశారు. తన కుమారుడి అదృశ్యం ఘటనపై విచారణ జరిపి న్యాయం చేయాలని ముఖ్యమంత్రిని కోరారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఆమెకు ధైర్యం చెప్పారు. ఘటనపై నిష్పక్షపాతంగా దర్యాప్తు జరిపిస్తామని హామీ ఇచ్చారు. విజయలక్ష్మితో మాట్లాడి మొత్తం ఘటనపై వివరాలు తెలుసుకున్నారు. తన కుటుంబానికి న్యాయం చేస్తామని ముఖ్యమంత్రి హామీ ఇవ్వడంపై విజయలక్ష్మి సంతృప్తి వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రిని కలిసిన తర్వాత తమకు న్యాయంజరుగుతుందనే విశ్వాసాన్ని ఆమె వ్యక్తం చేశారు. సమగ్ర విచారణ జరిపి నిందితులకు శిక్ష పడేలా చూస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారని గాదె విజయలక్ష్మి తెలిపారు.

## పది అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదల

**విజయవాడ,జూన్ 19, ప్రభాతవార్తప్రతినిధి:** పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదలయ్యాయి. మంత్రి నారా లోకేశ్ ఎక్స్ వేదికగా ఈ ఫలితాలను విడుదల చేశారు. పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాల్లో 82.39శాతం ఉత్తీర్ణత సాధించారు. ఫలితాల్లో 78,261 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. మే 25 నుంచి జూన్ 4 మధ్య జరిగిన ఈ పరీక్షలకు దాదాపు 90వేల మంది విద్యార్థులు హాజరయ్యారు. ఫలితాలను వాట్సప్ నెంబర్ 955230009 ద్వారా తెలుసుకోవచ్చు. విజయానికి కారణమైన తల్లిదండ్రులు, పాఠశాల సిబ్బందికి మంత్రి లోకేశ్ అభినందనలు తెలిపారు. విద్యార్థులందరూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

## భారత్ రోజ్‌గార్ యోజన నిధులు విడుదల

**విజయవాడ,జూన్ 10,ప్రభాతవార్తప్రతినిధి:** పీఎం వికసిత్ భారత్ రోజ్‌గార్ యోజన కింద కేంద్రం నిధులు విడుదల చేసింది. ప్రధాని మోదీ లబ్ధిదారులకు రూ.2,400 కోట్ల ఇన్సెంటివ్‌లను డీబీటీ ద్వారా పంపిణీ చేశారు. దేశవ్యాప్తంగా 15 లక్షలమందికి పైగా లబ్ధిదారుల ఉపాధికి మద్దతు కల్పిస్తూ, తొలిసారి ఉద్యోగాల్లో చేరేవారికి గరిష్ఠంగా రూ.15 వేల వరకు ప్రోత్సాహకం అందించారు. కొత్త ఉద్యోగాలు ఇచ్చేవారికి ఉద్యోగిపై నెలకు రూ.3 వేల చొప్పున మద్దతు అందించారు. ఉపాధిరంగంలో విప్లవాత్మక మార్పులకు రూ.99,446 కోట్ల బడ్జెట్ కేటాయించారు. రెండేళ్లలో దేశంలో 3.5 కోట్లకు పైగా కొత్త ఉద్యోగాలు తేవాలనేది లక్ష్యమని, కొత్తగా ఉద్యోగాల్లోకి వచ్చే 1.92 కోట్ల మంది యువతకు నేరుగా లబ్ధి పొందుతారని కేంద్రం పేర్కొంది. ఆగస్టు 2025 నుంచి జులై 2027 మధ్య సృష్టించే కొత్త ఉద్యోగాలకు పథకం వర్తిస్తుంది. తయారీరంగంలో ఉద్యోగాలు కల్పించే యజమానులకు 4 ఏళ్ల పాటు, ఇతర రంగాల్లో ఉద్యోగాలు కల్పించే వారికి రెండేళ్లపాటు ఇన్సెంటివ్ ఇవ్వనున్నారు. దేశవ్యా ప్తంగా 200 ప్రాంతాల్లో ఏకకాలంలో ప్రాంతీయ కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

## భూసమీకరణ రైతులకు ప్రత్యేక క్యూఆర్ కోడ్

**విజయవాడ,జూన్ 19,ప్రభాతవార్తప్రతినిధి:** భూసమీకరణ రైతులకు సీఆర్‌డీఏ ప్రత్యేక క్యూఆర్ కోడ్ విడుదల చేసింది. దీని ద్వారా రైతులు సులభంగా వివరాలు తెలుసుకునే అవకాశం కల్పించింది. క్యూఆర్ కోడ్‌ను ఫోన్ ద్వారా స్కాన్ చేసి వివరాలు తెలుసుకోవచ్చు. ఆఫీసుల చుట్టూ తిరిగే అవసరం లేకుండా ఇంటి నుంచే సమాచారం తెలుసుకునే సదుపాయం కల్పించారు. రైతుల కౌలు చెల్లింపు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తామని సీఆర్‌డీఏ తెలిపింది.

## జ్ఞానేశ్వరి కుటుంబాన్ని పరామర్శించిన సూర్యనారాయణ రాజు

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి,జూన్19,ప్రభాతవార్త:** కాకినాడ జిల్లా తుని మండలం సిహెచ్ అగ్రహారం గ్రామంలో అదృశ్యమైన చిన్నారి జ్ఞానేశ్వరి కుటుంబాన్ని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ సూర్యనారాయణ రాజు శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన చిన్నారి కుటుంబ సభ్యులతో చిన్నారి అదృశ్యమైన తీరును అడిగి తెలుసుకున్నారు. పాప ఆచూకీ కోసం పోలీసు బృందాలు చేపడుతున్న గాలింపు చర్యలపై ఆరా తీశారు.కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామన్నారు. పాప క్షేమంగా తిరిగి రావాలని ఆకాంక్షించారు.

## రాజధానిలో బ్యాంక్ స్ట్రీట్

>> కార్యాలయాలు ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చిన 13 బ్యాంకుల్లో 11 సంస్థలు తమ కార్యాలయాల నిర్మాణ బాధ్యతలను సీపీడబ్ల్యూడీకు అప్పగించారని అధికారులు సీఎంకు వివరించారు. పూర్తి సమన్వయంతో త్వరితగతిన ఈ నిర్మాణాలు పూర్తి అయ్యేలా చూడాలని సీఆర్డీఏ అధికారులకు దిశానిర్దేశం చేశారు. రాజధానిలో డిజిటల్ మౌలిక సదుపాయాల కల్పన విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఫోన్, కేబుల్, ఇంటర్నెట్ కనెక్టివిటీలకు సంబంధించి ఎక్కడా ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. రాజధాని అమరావతి నగరంలో పీపీపీ విధానంలో డిజిటల్ మౌలిక వసతులను ఏర్పాటు చేసేలా చూడాలని ఆదేశించారు. అమరావతిని నివాసయోగ్యమైన నగరంగా తీర్చిదిద్దడమే కాకుండా. నివాస వ్యయం తగ్గించేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. పైప్డ్ గ్యాస్ కనెక్షన్ తో పాటు , ఇండక్షన్ స్టవ్‌ల వినియోగాన్ని ప్రోత్సహించాలని, డిస్ట్రిక్ట్ కూలింగ్ వంటి వ్యవ స్థలను అందుబాటులోకి తీసుకురావాలని సీఎం చెప్పారు. రాజధాని ప్రాంతంలో సుందరీకరణకు ప్రాధాన్యం ఇవ్వాలని సీఎం సూచించారు. ప్రకాశం బ్యారేజీకి ఎగువన వైకుంఠపురం వరకు ఏడాది పొడవునా నీళ్లు ఉండేలా చూడాలని ముఖ్యమంత్రి చెప్పారు. పర్యాటక అభివృద్ధికి జల క్రీడలు, స్విమ్మింగ్ తదితర కార్యకలాపాలకు పెద్ద ఎత్తున అవకాశం ఉందని సీఎం అభిప్రాయపడ్డారు. అథారిటీ సమావేశంలో కృష్ణా కరకట్ట నిర్మాణ పనులు, ఉండవల్లి గ్రామంలో ఎల్పీఎస్ లే అవుట్ల అభివృద్ధి, పార్కింగ్ కాంప్లెక్స్ నిర్మాణం, జ్యుడిషియల్ అకాడెమీ నిర్మాణం, పౌల్ట్రీ ఫారంలస్ట్రక్చర్లకు చెల్లించాల్సిన పరిహారం వంటి అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో మంత్రి నారాయణ వర్చువల్‌గా పాల్గొన్నారు. సమావేశంలో మున్సిపల్, సీఆర్డీఏ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## నీట్ రీ ఎగ్జామ్‌కు 'సుప్రీం' పచ్చజెండా

>> తగినంత సన్నద్ధత సమయం లేకపోవడం, పరీక్ష సమగ్రతపై అనుమానాలు, ఇతర పరీక్షలతో తేదీలు ఒకేలా ఉండటం, నిర్వహణాపరమైన ఇబ్బందులు, మానసిక ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావాలు వంటి అంశాల నేపథ్యంలో ఈ విజ్ఞప్తులు వస్తున్నాయని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ నెల 21న నీట్ రీ ఎగ్జామ్ నిర్వహిస్తున్న నేపథ్యంలో పరీక్షకు హాజరయ్యే విద్యా ర్థులు ఎలాంటి అపోహలకు గురికాకుండా ఉండాలనే ఉద్దేశంతో నీట్ పరీక్షను నిర్వహిస్తున్న నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టిఏ) ప్రత్యేకంగా వాట్సాప్ సేవలను ప్రారంభించింది. అధికారిక వాట్సాప్ సేవలను ప్రారంభించిన ఎన్‌టిఏ తప్పుడు ఎస్ఎంఎస్‌లు, ఈ-మెయిల్స్‌ను నమ్మొద్దని స్పష్టం చేసింది. 7827980287 నంబరుతో ఎన్‌టిఏ అధికారి వాట్సాప్‌ను ప్రారంభించింది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ పేరుతో ఉండే ఈ ఖాతాకు బ్లూ టిక్ ఉంటుందని, అభ్యర్థుల పరీక్షా కేంద్రాలకు సంబంధించిన వివరాలతోపాటు పరీక్షకు సంబంధించిన అన్ని అప్‌డేట్స్ ఈ నంబర్ నుంచే వస్తాయని ఎన్‌టిఏ స్పష్టం చేసింది. బ్లూటిక్ లేకుండా ఇదే పేరుతో వచ్చే సమాచారాన్ని నమ్మవద్దని అభ్యర్థులకు ఎన్‌టిఏ సూచించింది. వాట్సాప్ నోటిఫికేషన్లతో పాటు అభ్యర్థులు తమ అడ్మిట్ కార్డులను డౌన్‌లోడ్ చేసుకోవాలని రిమైండర్ ఎస్ఎంఎస్, ఈ-మెయిల్‌లను కూడా పంపుతున్నట్టు తెలిపింది. అధికారిక ఎస్ఎంఎస్‌లు ఎన్ఐసిపిఐఇపిఅనే సెండర్ ఐడీ నుంచి, ఈ మెయిల్‌లు నోరిప్లయ్.నీట్.ఎన్‌టిఏ-ఎన్ఐసి.ఇన్ నుంచి మాత్రమే వస్తాయని తెలిపింది.

**డ్రెస్ కోడ్ నిబంధనలు..** నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టిఏ) నీట్ విద్యార్థులకు పలు సూచనలు చేసింది. డ్రెస్‌కోడ్‌లో భాగంగా .. అభ్యర్థులు సాధారణ, లేత రంగు దుస్తులు మాత్రమే ధరించాల్సి ఉంటుందని ఎన్‌టిఏ తెలిపింది. పెద్ద పెద్ద బటన్లు, ఎంబ్రాయిడరీ, పాకెట్స్ ఎక్కువగా ఉన్న దుస్తులకు అనుమతి లేదు. ఫుల్ హ్యాండ్స్ చొక్కాలు కాకుండా హాఫ్ స్లీవ్స్ దుస్తులు మాత్రమేధరించాల్సి ఉంటుంది. పరీక్షా కేంద్రానికి షూస్ వేసుకుని రాకూ డదు. కేవలం తక్కువ హీల్స్ ఉన్న శాండల్స్, స్లిప్పర్స్ మాత్రమే అనుమతిస్తారు. పరీక్షా హాలులోకి అడ్మిట్ కార్డ్, ప్రభుత్వం ఇష్యూ చేసిన ఏదైనా గుర్తింపు కార్డు, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోగ్రాఫ్‌లతో పాటు ట్రాన్స్‌పరెంట్ వాటర్ బాటిళ్లను మాత్రమే లోపలికి అనుమతిస్తారు. ఇక ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్లు, మొబైల్ ఫోన్లు, బ్లూటూత్ డివైజ్‌లు, స్మార్ట్ వాచీలు, క్యాలిక్యులేటర్లు, పర్సులు, బెల్టులు, ఎలాంటి బంగారు, వెండి ఆభరణాలను ఎగ్జామ్ సెంటర్‌లోకి అనుమతించరు. మే 3న నిర్వహించిన నీట్ పరీక్ష అడ్మిట్ కార్డులు కాకుండా, రీఎగ్జామ్ కోసం విడుదల చేసిన కొత్త హాల్‌టికెట్లను తప్పనిసరిగా డౌన్‌లోడ్ చేసుకోవాలని ఎన్‌టిఏ ప్రకటించింది.

**టెలిగ్రామ్ పిటిషన్‌ను కొట్టివేసిన ఢిల్లీ హైకోర్టు**

మెసేజింగ్ యాప్ టెలిగ్రామ్‌పై కేంద్రం ఆంక్షలు విధించడాన్ని ఢిల్లీ హైకోర్టు సమర్థించింది. కేంద్రం ఆంక్షలను సవాలు చేస్తూ టెలిగ్రామ్ వేసిన పిటిషన్‌ను విచారణకు తిరస్కరించింది. నీట్ రీ ఎగ్జామ్ నేపథ్యంలో టెలిగ్రామ్ యాప్‌పై కేంద్ర ప్రభుత్వం విధించిన తాత్కాలిక నిషేధాన్ని ఢిల్లీ న్యాయస్థానం సమర్థించింది. కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ టెలిగ్రామ్ యాప్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ తేజస్ కారియా ఈ మేరకు తీర్పు వెలువరించారు. నిషేధం విధించటం తీవ్రమైన చర్యేమీ కాదని స్పష్టం చేశారు. ఇందులో ఎలాంటి అసమానతలు కన్పించలేదని, కేంద్రం తీసుకున్న చర్య చాలా చిన్నదన్నారు. టెలిగ్రామ్ సేవలను పూర్తిగా నిలిపివేయాలని ఆదేశించే అధికారం కేంద్రానికి ఉందని న్యాయమూర్తి స్పష్టం చేశారు.

**మరణించిన విద్యార్థుల కుటుంబాలకు రూ. కోటి నష్టపరిహారం ఇవ్వాలి: ప్రధానికి కాక్రోచ్ పార్టీ అధ్యక్షుడి లేఖ**

నీట్ పరీక్షల్లో గందరగోళం కారణంగా విద్యార్థుల బలవన్మరణంపై కాక్రోచ్ జనతా పార్టీ(సిజెపి) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ఆందోళన వ్యక్తం చేశారు. పరీక్షల గందరగోళం కారణంగా బలవన్మరణానికి పాల్పడిన విద్యార్థుల కుటుంబాలకు రూ.1 కోటి చొప్పున పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ప్రధాని మోదీకి లేఖ రాశారు. తమ జీవిత కాలపు సొమ్మును ధారపోసి చదివించిన పిల్లలనే కోల్పోయిన ఆ కుటుంబాలు పూర్తిగా నిరుపేదలుగా మిగిలిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను తొలగించాలన్న తమ సంస్థ డిమాండ్‌ను దీప్కే పునరుద్ఘాటించారు.


## 3'ఎస్'ల మంత్రంతో రాష్ట్రం ముందుకు

>> నారా లోకేశ్ అన్నారు. స్పీడ్, స్టెబిలిటీ, సర్వీస్ అనే మూడు ప్రధాన సూత్రాలను ప్రత్యేకతలుగా చేసుకుని ఆంధ్రప్రదేశ్ ముందుకు సాగుతోందని, ఈ అభివృద్ధి ప్రయాణంలో పారిశ్రామికవేత్తలు భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. కోల్‌కతాలోని ఐటీసీ సోనార్ హోటల్‌లో ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ (ఐసీసీ) నిర్వహించిన ప్లీనరీ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జ్యోతి ప్రజ్వలన అనంతరం ఆయన మాట్లాడుతూ ఏపీలో పెట్టుబడులకు గల అవకాశాలు అనే అంశంపై జరిగిన ఈ సదస్సులో లోకేశ్ తన ప్రసంగంతో పెట్టుబడిదారులను ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ, "ఈ రోజు బెంగాల్ ఏది ఆలోచిస్తుందో, రేపు భారత్ అదే ఆలోచిస్తుందని చిన్నప్పటి నుంచి వింటూ పెరిగాను. భారతదేశ మేధో, సాంస్కృతిక, ఆర్థిక ప్రయాణానికి కోల్‌కతాయే రాజధానిగా నేను భావిస్తాను. బలమైన బెంగాల్ అంటే బలమైన భారతదేశం అని నేను గట్టిగా నమ్ముతున్నాను" అని అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం స్థిరత్వంతో ముందుకు సాగుతోందని, ఆయన అమలు చేస్తున్న సంస్కరణలను అందిపుచ్చుకోవడంలో ఆంధ్రప్రదేశ్ ముందు వరుసలో ఉందని లోకేశ్ స్పష్టం చేశారు. దేశానికి వస్తున్న మొత్తం పెట్టుబడులలో 25 శాతం ఏపీకే వస్తున్నాయని గుర్తుచేశారు. పెట్టుబడుల ఆకర్షణలో ఏపీ విజయానికి మూడు ఎస్‌లే (ఎస్ఎస్ఎస్) కారణమని వివరించారు. మొదటిది స్పీడ్ (వేగం) అని, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ దశను దాటి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌అమలు చేస్తున్నామని తెలిపారు. 13 నెలల్లోనే గూగుల్ వంటి అతిపెద్ద విదేశీ పెట్టుబడిని సాధించడం, ఒకే జూమ్ కాల్‌తో ఆర్సెలార్ మిట్టల్ ప్రాజెక్టును ఖరారు చేయడం, పుట్టపర్తిలో 37 రోజుల్లో 600 ఎకరాలు సేకరించి శంకుస్థాపన చేయడం తమ వేగానికి నిదర్శనమన్నారు. రెండోది స్టెబిలిటీ (స్థిరత్వం) అని, విధానాల్లో స్థిరత్వాన్ని కొనసాగిస్తూ పారిశ్రామికవేత్తలకు భరోసా కల్పిస్తున్నామని చెప్పారు. మూడోది సర్వీస్ (సేవ) అని, ప్రభుత్వాలను నియంత్రణ సంస్థలుగా కాకుండా సేవలందించే భాగస్వాములుగా తాము భావిస్తామన్నారు. "కస్టమర్ ఈజ్ గాడ్ అనే మార్వాడీల స్ఫూర్తితో మీకు సేవ చేసేందుకు మేం సిద్ధంగా ఉన్నాం. మీరు మా కస్టమర్లు" అని పారిశ్రామికవేత్తలను ఉద్దేశించి అన్నారు. 2047 నాటికి ఏపీని 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పెట్టుకున్నామని లోకేశ్ తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఉన్న ట్రాక్ రికార్డు, ఆయన దార్శనికతతో ఇది సాధ్యమవుతుందన్నారు. మనమంతా కలిసి పనిచేసి, బలమైన రాష్ట్రాల ద్వారా బలమైన భారతదేశాన్ని నిర్మిద్దాం" అని లోకేశ్ తన ప్రసంగాన్ని ముగించారు.

రాయలసీమలో ఇంటిగ్రేటెడ్ సోలార్ హబ్ ఏర్పాటుచేయండి..

**.విక్రమ్ సోలార్ సిఈఓ అరుణ్ మిట్టల్, ఎండి జ్ఞానేష్ చౌదరిని కోరిన మంత్రి లోకేష్.**

**కోల్ కత్తా:** విక్రమ్ సోలార్ చైర్మన్ ఎండి జ్ఞానేష్ చౌదరి, సిఇఓ అరుణ్ మిట్టల్ తో విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ కోల్ కతాలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ... ఆంధ్రప్రదేశ్ ను గ్లోబల్ గ్రీన్ ఎనర్జీ హబ్‌గా మార్చాలన్న లక్ష్యంతో ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీని ప్రకటించాం. రాబోయే ఐదేళ్లలో పునరుత్పాదక ఇంధన (రెన్యువబుల్ ఎనర్జీ) రంగంలో దాదాపు 78.5 గిగావాట్ల భారీ సామర్థ్యాన్ని సాధించడానికి ప్రణాళికలు రూపొందించాం. పునరుత్పాదక ఇంధన రంగంలో రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించడం, 7.5 లక్షల ఉద్యోగాలను సృష్టించడం తమ ధ్యేయమని చెప్పారు. రిలయన్స్ ఏర్పాటుచేయబోయే 5వేల మెగావాట్ల సౌర విద్యుత్ ప్రాజెక్ట్, శీతినిలి యొక్క 600 మెగావాట్ల ప్లాంట్ వంటి ప్రాజెక్టులు ఈ ప్రాంతంలో సౌర విద్యుత్ సామర్థ్యానికి నిదర్శనం. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పునరుత్పాదక ఇంధన రంగానికి అందిస్తున్న ప్రోత్సాహకాలను ఉపయోగించుకొని విక్రమ్ సోలార్ లిమిటెడ్ పవర్‌హైవ్ స్టోరేజ్ విస్తరణతో పాటుగా ఇంటిగ్రేటెడ్ సోలార్ హబ్ ఏర్పాటు చేయాల్సిందిగా మంత్రి లోకేష్ విజ్ఞప్తి చేశారు.




శుక్రవారం చెక్కులను విడుదల చేస్తున్న కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు, తదితరులు

## 'సూపర్ సిక్స్' అమలుతో ప్రజల్లో పెరిగిన నమ్మకం

### శ్రీకాకుళంలో ఘనంగా 'రెండేళ్ల నమ్మకం అభివృద్ధి, సంక్షేమం' జిల్లా స్థాయి సభలో కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

**శ్రీకాకుళం, జూన్ 19 ప్రభాతవార్త:** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్ల కాలంలో సూపర్ సిక్స్ హామీలు విజయవంతంగా అమలు చేశామని, మిగిలిన సంక్షేమ కార్యక్రమాలను కూడా దశలవారీగా పూర్తి చేస్తామని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు స్పష్టం చేశారు. స్థానిక ఎన్టీఆర్ మున్సిపల్ హైస్కూల్ మైదానంలో శుక్రవారం నిర్వహించిన జిల్లా స్థాయి 'రెండేళ్ల నమ్మకం-అభివృద్ధి, సంక్షేమం' భారీ బహిరంగ సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వంపై ప్రజలు ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ ప్రగతి పథంలో ముందుకు సాగుతున్నామన్నారు. జిల్లాకు మణికిరీటమైన మూలపేట అంతర్జాతీయ పోర్టు పనులు శరవేగంగా జరుగుతున్నాయని, పలాస ప్రాంతంలో విమానాశ్రయం ఏర్పాటుకు పక్కా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని చెప్పారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ప్రగతి నివేదికను సమర్పిస్తూ జిల్లాలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అధికారిక గణాంకాలను వివరించారు. పాతపట్నం శాసనసభ్యులు మామిడి గోవిందరావు మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని వంశధార ప్రాజెక్టును త్వరలోనే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమక్షంలో జాతికి అంకితం చేయనున్నట్లు ప్రకటించారు.


ప్రభు త్వ విప్ బెందాళం అశోక్, ఎచ్చెర్ల శాసనసభ్యులు నడుకుదిటి ఈశ్వరరావు, నరసన్నపేట శాసనసభ్యులు బగ్గు రమణమూర్తి, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు కూటమి ప్రభుత్వ విజయాలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, డీసీసీబీ చైర్మన్ శివ్వాల సూర్య నారాయణ, డీసీఎంఎస్ చైర్మన్ చౌదరి అవినాష్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు మొదలవలస రమేష్, జనసేన జిల్లా అధ్యక్షుడు పీసిని చంద్రమోహన్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సిరిపురపు తేజేశ్వరరావు, పలు కార్పొరేషన్ల డైరెక్టర్లు, పలువురు లబ్ధిదారులు, పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

## సిఐ నాగరాజుపై హత్యకేసు నమోదు

>> గురించి ఆమె నుండి వాంగ్మూలాన్ని నమోదు చేసినట్లు సమాచారం.దర్యాప్తు అధికారులు సాయికృష్ణ కుటుంబ సభ్యుల వాంగ్మూలాలతో పాటు పోలీస్ రికార్డులు,సిసి టివి ఫుటేజిలు, కాల్‌డేటా,సంబంధిత అధికారుల వాంగ్మూలాలు, ఇతర సాంకేతిక అధికారాలను సేకరిస్తున్నారు. ఇప్పటికే సిఐ నాగరాజును ప్రభుత్వం సస్పెండ్ చేయడంతోపాటు దర్యాప్తు కోసం ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసిన విషయం విదితమే.

## అరణ్యారామం ఆరంభం

>> ప్రభుత్వం కీలక సంస్కరణలను తీసుకుని వస్తుందని అటవీశాఖను నియంత్రిస్తున్న ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పష్టం చేసారు. గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం బ్రహ్మానందపురం అటవీ శాఖ ప్రాంతంలో "అరణ్యారామం" అనే పేరిట నిర్మించనున్న భవనానికి ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు రూ.27 కోట్లతో నిర్మించనున్న ఈ భవనంలో మానవ, వన్యప్రాణి సంఘర్షణ నివారణ కేంద్రం, ఫారెస్ట్ ఫైర్ కమాండ్ కంట్రోల్ సెంటర్, స్టేట్ టైగర్ మానిటరింగ్ సెంటర్ ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. వీటితో పాటు చిత్తూరు, పార్వతీపురం మన్యం జిల్లాల్లోకి సరిహద్దు రాష్ట్రాల నుంచి వస్తున్న ఏనుగుల రాకపోకలను మానిటరింగ్ చేసే కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు. వీటికోసం రెండు హెక్టార్లలో భవనం నిర్మించనున్నారు.భూమి పూజ అనంతరం పవన్ కల్యాణ్ ఎయిమ్స్‌కు వెళ్లే మార్గంలో మొక్కలు నాటారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలను నాటడమే కాదు,వాటిని పెంచడం కీలకమన్నారు.



శుక్రవారం కోలకతాలో కాళీమాతకు నమస్కరిస్తున్న మంత్రి లోకేష్

## కాళీమాతను దర్శించిన మంత్రి లోకేష్

విజయవాడ,జూన్ 19,ప్రభాతవార్తప్రతినిధి:విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ కోల్‌కతాలోని కాళీమాత ఆలయాన్ని సందర్శించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు లోకేష్‌కు స్వాగతం పలికారు. కాళీమాతను దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. శక్తి స్వరూపిణి కోల్‌కతా కాళీమాతను దర్శించుకోవడం చాలా ఆనందంగా ఉందని లోకేష్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ అన్నిరంగాల్లో అగ్రగామిగా ఉండాలని, ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, ఆనందమయ జీవితం ప్రసాదించాలని కాళీమాతను వేడుకున్నానన్నారు.

**కోల్‌కతాలో పెట్టుబడుల వేట:** ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ (।దిది) ప్లీనరీ సెషన్ లో పాల్గొ నేందుకు మంత్రి లోకేష్ శుక్రవారం కోల్ కతా వెళ్లారు. ఆ కార్యక్రమంలో తమ ప్రసంగం పూర్తయిన వెంటనే పెట్టుబడుల వేట ప్రారంభించారు. 17 మంది పారిశ్రామికవేత్తలను కలిసి తమ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాల్సిందిగా ఆహ్వానించారు. రాష్ట్రంలో పెట్టుబడులకు గల అవకా శాలు, అనుకూలతలను గురించి చెబుతూ లోకేష్ చేస్తున్న అభ్యర్థన పెట్టుబడిదారులను ఆకర్షిస్తోంది.

### వారం - వర్జ్యం

20-06-2026, శనివారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
నిజ జ్యేష్ఠమాసం, ఉత్తరాయణం
గ్రీష్మ ఋతువు, శుక్లపక్షం, మృగశిర కార్తె
షష్టి మ.3.53
మఖ ఉ.9.29
వర్జ్యం : సా.5.30-రా.7.07
దు.తె.5.33-ఉ.7.15
రాహుకాలం - ఉ.9.00-10.30

### వార్తాఫలం

**మేషం:** కుటుంబ పురోభివృద్ధి బాగుంటుంది. విదేశీయాన వ్యవహారాలు సానుకూలమవుతాయి. వస్త్రలాభం.

**వృషభం:** ఆర్థిక విషయంలో ఒడిదుడుకులు తొలగుతాయి. ఋణాలు తీరి మనసుకు ప్రశాంతత ఏర్పడుతుంది.

**మిథునం:** సంతాన విద్యావిషయంలో బాధ్యతాయుతంగా మసలుతారు. ఊహించని పరిణామాలు కలతలు సృష్టిస్తాయి.

**కర్కాటకం:** ఉద్యోగంలో మార్పులు వెనువెంటనే ఫలితాలు ఇవ్వకపోయినా భవిష్యత్తులో కలిసి వస్తుంది.

**సింహం:** మీ పని మీరే చేసుకోండి. కారణం లేని చికాకులు ఉంటాయి. అయినా చెప్పుకోదగిన ఇబ్బందులు పడరు.

**కన్య :** ఒకరికి అప్పు ఇవ్వడం, మీరు మరొకరి వద్ద అప్పు చేయడం రెండూ వద్దు. వ్యాపారాలు సానుకూలంగా ఉంటాయి.

**తుల :** వస్తుభద్రత పట్ల విశేషమైన జాగ్రత్తలు తీసుకోవడం చెప్పదగినది. వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయి.బంధువుల కలయిక.

**వృశ్చికం:** నాణ్యత లేని వస్తువులు మీకు అంటగట్టే ప్రయత్నాలు జరుగుతాయి. స్పెక్యులేషన్ లాభించదు.కొత్త పరిచయాలు.

**ధనుస్సు:** ఒకరికి మీరు సహాయం చేయడమే తప్ప మీకు ఇతరులు సహకరించక పోవడం కొంత ఇబ్బంది కలిగిస్తుంది.

**మకరం :** ముఖ్యమైన కార్యక్రమాలలో ఆటంకాలు ఎదురైనా అధిగమిస్తారు. ఆరోగ్యం పట్ల మెలకువ అవసరం.

**కుంభం:** ఆస్తి వ్యవహారాలు మీకు అనుకూలంగా మారే అవకాశాలు సూచిస్తున్నాయి. సంగీతరంగాల వారికి విదేశీయానం.

**మీనం:** భవిష్యత్తు బంగారు బాటగా కనబడుతుంది. స్త్రీ సంతాన విషయమై విశేషంగా శ్రమించి సత్ఫలితాలు సాధిస్తారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# రైతులకు శుభవార్త

## నేడు ఖాతాల్లోకి అన్నదాత, సుఖీభవ నిధులు




**విజయవాడ, జూన్ 19 ప్రభాతవార్త ప్రతినిధి:** అన్నదాత సుఖీభవ- పీఎం కిసాన్ పథకం కింద 2026-27 సంవత్సరానికి సంబంధించిన తొలివిడత సాయాన్ని ప్రభుత్వం శనివారం విడుదల చేయనుంది. రైతులకు పెట్టుబడి భారం తగ్గించి, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వంఈ పథకాన్ని అమలు చేస్తోంది. పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలం లింగంగుంట్ల గ్రామం నుంచి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నదాత సుఖీభవ నిధులను విడుదల చేయనున్నారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా 46,85,838 రైతు కుటుంబాలకు లబ్ది చేకూరనుంది. వీరిలో 46,69,817 మంది భూ యజమాని రైతులు కాగా 1,16,021 మంది టవీ మక్కుల చట్టం కింద సాగు చేస్తోన్న రోఎఫ్ఆర్ రైతు కుటుంబాలు ఉన్నాయి రూ.3,125.47 కోట్లను రేపు రైతుల ఖాతాల్లో జమ చేయనున్నారు. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం వాటా రూ.2,342.92 కోట్లు కాగా కేంద్ర ప్రభుత్వ వాటా రూ.782.55 కోట్లుగా ఉంది. గతేడాది ఈ పథకానికి రూ.8,985.41 కోట్లు ప్రభుత్వం పంపిణీ చేసింది. ఇందులో రాష్ట్ర ప్రభుత్వ వాటా రూ.6560.18 కోట్లు కాగా , కేంద్ర ప్రభుత్వ వాటా రూ.2425.23 కోట్లు. సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా అమలవుతోన్న ఈ పథకంతో అర్హత కలిగిన ప్రతి రైతు కుటుంబానికి ఏడాదికి రూ.20 వేల ఆర్థిక సహాయం అందిస్తోంది. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం రూ.14 వేలు, కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ పథకం కింద రూ.6వేలు సమకూరుస్తోంది. ఈ మొత్తాన్ని మూడు విడతల్లో రైతులకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు జమ చేస్తున్నారు. ఈ ఏడాది తొలి విడతలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం రూ.5 వేలు ,పీఎం కిసాన్ కింద కేంద్రం రూ.2 వేలు కలిపి ఒక్కో రైతు ఖాతాలో రూ.7వేలు జమ చేయనున్నాయి.

**నేడు పల్నాడుకు సీఎం:** అన్నదాత సుఖీభ పీఎం కిసాన్ కార్యక్రమంలో పాల్గొనేందుకు సీఎం చంద్రబాబు శనివారం పల్నాడు జిల్లా చిలకలూరిపేటలో పర్యటించనున్నారు. రేపు ఉదయం 11.55 గంటలకు అమరావతి నుంచి బయలుదేరి మధ్యాహ్నం 12.15 గంటలకు చిలకలూరిపేట మండలం లింగంగుంట్ల గ్రామానికి చేరుకుంటారు. మధ్యాహ్నం 12.30 గంటలకు లింగంగుంట్ల గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి సౌకర్యాలు పరిశీలిస్తారు. అనంతరం 12.50 గంటల నుంచి 1.20 గంటల వరకు రైతులతో ముఖాముఖి అవుతారు. 2.15 గంటల నుంచి 3.45 గంటలకు ప్రజావేదిక సభలో ప్రసంగిస్తారు. సాయంత్రం 6 గంటలకు లింగంగుంట్ల నుంచి బయలుదేరి రాత్రి 6.20 గంటలకు క్యాంప్ కార్యాలయానికి చేరుకుంటారు.

# ఎసిబికి పట్టుబడ్డ జివిఎంసి ట్యాక్స్ కలెక్టర్



**విశాఖపట్నం, జూన్ 19 ప్రభాతవార్త:** మృతి చెందిన వ్యక్తి లీగల్ సర్టిఫికెట్ జారీ చేసేందుకు గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) పశ్చిమ జోన్ కార్యాలయంలో ట్యాక్స్ కలెక్టర్ మురుగుటు శ్రీను అనే ఉద్యోగి లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టు కున్నారు. ఫిర్యాదుదారుడి అత్తకు సంబంధించిన లీగల్ సర్టిఫికెట్లతో పాటు పెన్షన్ ఇతర బిల్లుల మంజూరు ప్రక్రియను వేగవంతం చేయడానికి రూ.30 వేల లంచం డిమాండ్ చేసి స్వీకరిస్తుండగా శుక్రవారం ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఏసీబీ డిఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం, పెందుర్తి మండలం శారదానగర్‌కు చెందిన కారకాన ప్రసన్న కుమార్ తన అత్త వెన్ను చిన్నతల్లి పెన్షన్, ఇతర ప్రయోజనాల బిల్లుల మంజూరు కోసం జీవీఎంసీ పశ్చిమ జోన్ కార్యాలయాన్ని సంప్రదించారు. ఈ ప్రక్రియను పూర్తి చేయాలంటే రూ.30 వేల ఇవ్వాలని ట్యాక్స్ కలెక్టర్ మురుగుటు శ్రీను డిమాండ్ చేసాడు. దీనితో బాధితుడు ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశారు.

శుక్రవారం మధ్యాహ్నం ఏసీబీ అధికారులు జీవీఎంసీ పశ్చిమ జోన్ కార్యాలయంలోనే లంచం తీసుకుంటుండగా రెడ్ హ్యాండ్‌గా మురుగుటు శ్రీనును పట్టుకున్నారు. లంచంగా స్వీకరించిన నగదును స్వాధీనం చేసుకున్నారు. మురుగుటు శ్రీను 2006లో కారుణ్య నియామకంతో పీహెచ్ వర్కర్‌గా ఉద్యోగంలో చేరి, అనంతరం పదోన్నతి పొంది 2024 ఫిబ్రవరి 1న ట్యాక్స్ కలెక్టర్‌గా నియమితులయ్యారు. ప్రస్తుతం 2026 జనవరి నుంచి జీవీఎంసీ పశ్చిమ జోన్‌లో ట్యాక్స్ కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. అవినీతి సొమ్ముతో దొరికిన నిందితుడిని అరెస్టు చేసి విశాఖ ప్రత్యేక ఎస్పీఈ అండ్ ఏసీబీ కోర్టు న్యాయమూర్తి ఎదుట హాజరు పరచనున్నట్లు ఏసీబీ డిఎస్పీ తెలిపారు.

# అంగన్వాడీ కేంద్రాలకు ఇండక్షన్ స్టవ్‌లు

- వేస్ట్ టూ ఎనర్జీ ప్లాంట్ల నిర్మాణంపై దృష్టి
- స్వచ్ఛాంధ్ర పనుల్లో జాప్యం వద్దు
- స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్రపై సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వెల్లడి



**విజయవాడ, జూన్ 19 ప్రభాతవార్త ప్రతినిధి:** కాలుష్యం తగ్గించడం, స్వచ్ఛతను పెంచడం, వ్యర్థాలను సద్వినియోగం చేసుకుని సర్క్యులర్ ఎకానమీ దిశగా అడుగులు వేయడం అనే అంశాలు నిరంతర ప్రక్రియగా ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెల్లడించారు. శుక్రవారం క్యాంప్ కార్యాలయంలో స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్రలో భాగంగా చేపట్టే వివిధ కార్యక్రమాలు, పనులపై సీఎం సమీక్షించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కాలుష్యాన్ని తగ్గించేందుకు.. స్వచ్ఛత పాటించేందుకు పెద్ద పీట వేసిందన్నారు. ప్రతీ నెల మూడో శనివారం స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారుప్రజల్లో స్వచ్ఛతపై అవగాహన పెంచుతున్నామన్నారు. నెట్ జీరో, సర్క్యులర్ ఎకానమీ వంటి అంశాలపై దృష్టి సారించామని, దీంట్లో భాగంగా ప్రభుత్వ కార్యాలయాలు, హాస్టళ్లు, స్కూళ్లు, అంగన్ వాడీ వంటి కేంద్రాల్లో ఈ అంశాలకు పెద్ద పీట వేస్తున్నామని సీఎం చెప్పారు. కాలుష్యం తగ్గించడంతోపాటు ఖర్చులను కూడా తగ్గించుకునేలా అన్ని అంగన్ వాడీ కేంద్రాల్లో ఇండక్షన్ స్టవ్ లు ఇస్తున్నామని... ఇప్పటికే మొదటి దశలో పట్టణ ప్రాంతాల్లో 11,400 ఇండక్షన్ స్టవ్ లను పంపిణీ చేశామని సీఎం చెప్పారు.ఈ నెలాఖరులోగా మిగిలిన 44,346 అంగన్వాడీ కేంద్రాలకు పంపిణీ ప్రక్రియను పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు. ఇండక్షన్ స్టవ్స్ వల్ల నెలకు రూ. 247 మేర ఆదా అవుతోందని సీఎం చెప్పారు. వేస్ట్ టూ ఎనర్జీ ప్లాంట్ల నిర్మాణం విషయంలో త్వరితగతిన చర్యలు చేపట్టాలని సీఎం ఆదేశించారు. రాష్ట్రంలో ప్రస్తుతం నిర్వహణలో ఉన్న విశాఖ, గుంటూరు ప్లాంట్ల పనితీరుపై సీఎం ఆరా తీశారు. కడప, కర్నూలు జిల్లాల్లో వేస్ట్ టూ ఎనర్జీ ప్లాంట్లకు శనివారం శంకుస్థాపనకు ఏర్పాట్లు చేసినట్టు అధికారులు వెల్లడించారు. తిరుపతి, నెల్లూరు, కాకినాడ విజయవాడలలోని వేస్ట్ టూ ఎనర్జీ ప్లాంట్ల నిర్మాణ ప్రారంభ ప్రక్రియ వివిధ దశల్లో ఉందని తెలిపారు. పట్టణ ప్రాంతాల్లో ఈఆటోలు, కాంపాక్టర్స్, స్వీపింగ్ మిషన్లను పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని సీఎం ఆదేశించారు. వచ్చే నెలాఖరులోగా ఇఆటోలను, అక్టోబర్ నెలాఖరులోగా కాంపాక్టర్లను, స్వీపింగ్ మిషన్లను అందుబాటులోకి తీసుకురావాలని అన్నారు. మిద్దె తోటల విధానాన్ని ప్రొత్సహించాలని సీఎం అధికారులకు సూచించారు. గోబర్దన్ ప్లాంట్లు.. ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ యూనిట్ల వంటి వాటి నిర్వహణను సమర్థవంతంగా చేపట్టాలని స్పష్టం చేశారు. లెగసీ వేస్ట్ తొలగింపులో లక్ష్యాలకు అనుగుణంగా పని చేయాలని నిర్దేశించారు. రాష్ట్రంలో ఇప్పటికే 33 సివరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ల పనులు ప్రారంభమయ్యాయని.. మరో 148 ఎస్టీపీల పనులు ప్రారంభించనున్నట్టు అధికారులు తెలిపారు. ఈ ఏడాది ఆగస్టు, అక్టోబరు మాసాల్లో ఎస్టీపీ ప్లాంట్లను అందుబాటులోకి తేవాలని సీఎం నిర్దేశించారు. మేజిక్ డ్రెయిన్లను లక్ష్యానికి అనుగుణంగా పూర్తి చేయాలని సూచించారు. ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమంలో భాగంగా రాజమహేంద్రవరం, కాకినాడ, విజయనగరం, అనంతపురం, పిడుగురాళ్ళ, వినుకొండ, మచిలీపట్నంలలో పనులు ముమ్మరంగా జరిగాయని అధికారులు సీఎంకు తెలియచేశారు. ఈ సమావేశంలో మంత్రి నారాయణ వర్చువల్‌గా పాల్గొన్నారు. పురపాలక శాఖ, ఇతర శాఖల ఉన్నతాధికారులు సమావేశానికి హాజరయ్యారు.

# రాష్ట్రంలో తొలి క్వాంటం ఇంక్యుబేటర్ ఏర్పాటు

**గన్నవరం(కృష్ణా), జూన్ 19 ప్రభాతవార్త:** స్టార్టప్‌సంస్థలు అంతర్జాతీయస్థాయి పరిశోధనలకు వీలుకల్పించే క్వాంటం ఇంక్యుబేటర్‌ను మన రాష్ట్రంలో తొలిసారి గన్నవరం మేధా టవర్స్‌లో ఏర్పాటు చేసారు. చండీఘడ్ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేసిన క్వాంటం ఇంక్యుబేటర్‌ను ఆంధ్రప్రదేశ్ టెక్నాలజీ సర్వీసెస్ చైర్మన్ మన్నవ మోహనకృష్ణ శుక్రవారం ఉదయం ప్రారంభించారు. ఈసందర్భంగా మోహనకృష్ణ మాట్లాడుతూ అమరావతిని క్వాంటం వ్యాలీగా హబ్‌గా అభివృద్ధి చేస్తున్నామని ఇందులో భాగంగా క్వాంటం ఇంక్యుబేటర్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆశయాల మేరకు క్వాంటం వ్యాలీ పనులు శరవేగంగా జరుగుతున్నాయని వివరించారు. ఇక్కడ ఏర్పాటు చేసిన ఇంక్యుబేటర్ ద్వారా డీప్క్ స్టార్టప్‌లకు సహకారం అందుతుందన్నారు. క్వాంటం టెక్నాలజీ, కృత్రిమమేధ, అడ్వాన్స్‌డ్ సెమికండక్టర్‌లు, రోబోటిక్స్, స్పేస్‌టెక్నాలజీ, వంటి కీలకమైన సాంకేతికతలపై పనిచేసే స్టార్టప్‌లకు ఈఇంక్యుబేటర్ ఉపయోగపడుతుందన్నారు. డీపెక్ స్టార్టప్‌లకు అంతర్జాతీయ స్థాయి పరిశోధనలు, ఆవిష్కరణలకు వీలుగా ఏకోసిస్టమ్ పనిచేస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో అమరావతి క్వాంటం మిషన్ డైరెక్టర్ సివి. శ్రీధర్, ఆర్టీఐహెచ్ సీఈఓ ధాత్రిరెడ్డి, చండీఘడ్ విశ్వవిద్యాలయం ప్రతినిధులు పాల్గొన్నారు.

# మలేసియాలో మంత్రి నారాయణ పర్యటన

**విజయవాడ, జూన్ 19 ప్రభాతవార్త ప్రతినిధి:** మలేషియాలో మంత్రి నారాయణ పర్యటన రెండో రోజు కొనసాగుతోంది. మలేషియాలో ఘన వ్యర్థాల నిర్వహణ, తక్కువ ధరలో ఇళ్ల నిర్మాణం వంటి ప్రాజెక్టుల్లో అమలు చేస్తున్న అత్యుత్తమ పద్ధతులను మంత్రి అధ్యయనం చేస్తున్నారు. సెలాంగోర్ రాష్ట్రంలోని బుకిత్ తగర్ ఎన్విరో పార్క్‌ను మంత్రి నారాయణ సందర్శించారు. మలేషియాలో అతిపెద్ద శానిటరీ ల్యాండ్ ఫీలింగ్ ప్రాంతంగా బుకిత్ తగర్ పేరొందింది. ఘన వ్యర్థాలను పర్యావరణానికి హాని లేకుండా శాస్త్రీయ పద్ధతిలో పూడ్చిపెట్టే విధానాన్ని మంత్రి అధ్యయనం చేశారు. భూమి, నీరు కలుషితం కాకుండా వ్యర్థాల నిర్వహణ ఏ విధంగా చేస్తున్నారో మంత్రికి అధికారులు వివరించారు.

# రెండేళ్ల కూటమి పాలనలో 'రెవెన్యూ'లో విప్లవాత్మక సంస్కరణలు

## రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖల మంత్రి అనగాని సత్యప్రసాద్



**సచివాలయం, జూన్ 19 ప్రభాతవార్త:** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్ళు పూర్తయిన సందర్భంగా రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖల పనితీరుపై మంత్రి అనగాని సత్యప్రసాద్ సమగ్ర వివరాలు వెల్లడించారు. ప్రజలకు భూ హక్కుల భరోసా కల్పించడం, రెవెన్యూ వ్యవస్థలో పారదర్శకత తీసుకురావడం, సాంకేతికతను వినియోగించి సేవలను సులభతరం చేయడం వంటి అంశాల్లో ప్రభుత్వం విశేష పురోగతి సాధించిందని ఆయన తెలిపారు. భూమి అనేది ప్రతి కుటుంబానికి అత్యంత విలువైన ఆస్తి అని, అందుకే రెవెన్యూ శాఖను అత్యంత ప్రాధాన్యత ప్రభుత్వం ముందుకు తీసుకెళ్తోందని మంత్రి చెప్పారు. ప్రతి నెల 9వ తేదిన గ్రామాల్లో ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొని పరిష్కరించే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రత్యేకంగా సమీక్షలు నిర్వహిస్తూ శాఖ పనితీరును పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. ఎన్నికల హామీ మేరకు ల్యాండ్ టైటిలింగ్ యాక్టును అధికారంలోనికి వచ్చిన వెంటనే రద్దు చేసినట్లు మంత్రి గుర్తు చేశారు. ప్రజల భూ హక్కులకు ముప్పు కలిగించే అవకాశాలు ఉన్నందున ఆ చట్టాన్ని తొలగించామని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో రీ-సర్వే ప్రక్రియలో జరిగిన లోపాలను సరిదిద్దేందుకు రీ-సర్వే 2.0కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు.

రాష్ట్ర వ్యాప్తంగా 4,331గ్రామాల్లో రీ-సర్వే ప్రక్రియను తిరిగి నిర్వహించామని, భూ యజమానుల నుంచి కేవైసీ తీసుకొని వారి అంగీకారంతోనే కొత్త పట్టాదార్ పాస్‌బుక్స్ జారీ చేస్తున్నామని వెల్లడించారు.ఇప్పటివరకు 28లక్షల కొత్త పాస్‌బుక్స్ పంపిణీ చేశామని చెప్పారు.కొత్తపాస్‌బుక్స్‌లో ఫోటో, ఖాతానంబర్ క్యూఆర్ కోడ్ సహా 12 భద్రతా లక్షణాలు పొందుపరిచామని వివరించారు. గ్రామ సేవక భూముల సమస్యను పరిష్కరిస్తూ 1.33లక్షల ఎకరాలను విడుదల చేశామని, 33వేల శరతుగల పట్టాల సమస్యను కూడా పరిష్కరించామని తెలిపారు. మరో 1.90లక్షల ఎకరాల చుక్కల భూముల విడుదల ప్రక్రియ తుది దశకు చేరుకుందని చెప్పారు.

పర్యాటక రంగానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని, సూర్యలంక బీచ్ అభివృద్ధికి రూ.100కోట్లతో పనులు చేపడుతున్నామని మంత్రి చెప్పారు. టూరిజం అభివృద్ధి కోసం 476ఎకరాల భూమిని కేటాయించినట్లు తెలిపారు. పరిశ్రమల అభివృద్ధి కోసం 12,042 ఎకరాల భూమిన అందుబాటులోనికి తీసుకొచ్చామని వెల్లడించారు. రాష్ట్రంలో భూ హక్కుల పరిరక్షణ, పారదర్శక పరిపాలన, సాంకేతిక ఆధారిత సేవలు, పెట్టుబడుల ఆకర్షణ, ఉపాధి కల్పన వంటి అంశాల్లో కూటమి ప్రభుత్వం రెండేళ్ళలో గణనీయమైన ఫలితాలు సాధించిందని మంత్రి అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకునేలా మరిన్ని సంస్కరణలు తీసుకొస్తామని ఆయన స్పష్టంచేశారు.

# ఇంద్రకీలాద్రిపై ఇఓ విస్తృత తనిఖీలు



**ఇంద్రకీలాద్రి, జూన్ 19 ప్రభాతవార్త:** శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో ఆలయ ఈఓ వికె సీనా నాయక్ శుక్రవారం ఇంజనీరింగ్, అడ్మినిస్ట్రేటివ్, భద్రతా సిబ్బందితో కలిసి విస్తృత తనిఖీలు నిర్వహించారు. భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలు, శానిటేషన్, భద్రతా ప్రమాణాలపై ఆయన అధికారులకు దిశానిర్దేశం చేశారు. దుర్గా ఘాట్ నుండి తనిఖీలు ప్రారంభించిన ఈఓ, అక్కడ భక్తుల కోసం పరిశుభ్రత (శానిటేషన్)కు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు.

**మహిళలకు బట్టలు మార్చుకునే గదులు:** భక్తుల సౌకర్యార్థం ఘాట్ వద్ద తక్షణమే డ్రెస్ చేంజింగ్ రూములను (బట్టలు మార్చుకునే గదులు) ఏర్పాటు చేయాలని ఆదేశించారు. దుర్గా ఘాట్ వద్దే ఏర్పాటు చేసిన మన మిత్ర వాట్సాప్ టికెట్ బుకింగ్‌ను పరిశీలించారు. కేశఖండన శాలలో సిబ్బంది హాజరు పట్టికను, భక్తుల ఫిర్యాదుల రిజిస్టర్‌ను ఈఓ క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అక్కడ ఉన్న బాత్‌రూమ్‌ల పరిశుభ్రతను కూడా పరిశీలించారు. ఈఓ భక్తులతో ముచ్చటించగా భక్తులు పూర్తి సంతృప్తిని తెలిపారు. కనకదుర్గ నగర్ ప్రాంతం, ప్రసాదం కౌంటర్లను ఇఓ తనిఖీ చేశారు. హాకర్ల (అమ్మకందారుల) రద్దీని, భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. భక్తుల నడకకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూడాలని భద్రతా సిబ్బందిని ఆదేశించారు. పాత మెట్ల మార్గం గుండా పైకి నడిచిన ఈఓ, అక్కడ భక్తులు మెట్లకు చేసే పూజా కార్యక్రమాలను, మెట్ల మార్గంలో ఉన్న ఏర్పాట్లను వీక్షించారు. ఘాట్ రోడ్డు మార్గంలో నడిచే భక్తులు విశ్రాంతి తీసుకోవడం కోసం కొత్తగా ఏర్పాటు చేసిన సుమారు 800 ఇనుప కుర్చిలను ఆయన తనిఖీ చేశారు. ప్రధాన ఆలయంలో క్యూ లైన్లలో భక్తులకు నిరంతరాయంగా అందుతున్న త్రాగునీటి సౌకర్యాన్ని స్వయంగా పర్యవేక్షించి, ఎక్కడా ఎండ దెబ్బకు భక్తులు ఇబ్బంది పడకుండా చూడాలని ఆదేశించారు.

ఈ తనిఖీల్లో ఇఇ రమాదేవి, డీఈఈలు రవీంద్ర, అశోక్, ఏఈ మస్తాన్, ఏఈఓ తిరుమలేశ్వర రావు మరియు ఇతర ఉన్నతాధికారులు ఉన్నారు.

**విస్తరణకు క్షేత్రస్థాయి పరిశీలన:** దుర్గమ్మ ఆలయ విస్తరణకోసం నిర్దేశించిన ప్రాంతాల్లో పలు ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులతో పాటు ఇఓ, చైర్మన్‌లు పరిశీలించారు. చట్ట ప్రకారంగానే నిర్వాసితులకు తగిన నష్ట పరిహారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్అండ్‌బి అధికారులు, రెవెన్యూ అదికారులు పాల్గొన్నారు.

**నేడు శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర కల్యాణం:** దుర్గమ్మవారి ఆలయంలో జ్యేష్ఠమాస శుద్ధ షష్ఠి సందర్భంగా శనివారం కళావేదిక నందు ఉదయం గం.9లకు నిర్వహిస్తామని ఇఓ వికె శీనా నాయక్ తెలిపారు.

**అన్నదాన విరాళం:** దుర్గమ్మవారి ఆలయంలో జరుగుతున్న నిత్యాన్నదాన పథకానికి గుంటూరు జిల్లా ఉప్పలపాడుకు చెందిన పరుచూరి సాయి, స్నేహ వారి కుటుంబీకులతో కలిసి రు.1,00,001విరాళాన్ని చైర్మన్ బొర్రా రాధాకృష్ణకి సమర్పించారు. కార్యక్రమంలో డిప్యూటీఈవో కిషోర్ కుమార్ పాల్గొన్నారు. దాతలకు దుర్గమ్మవారి దర్శన ఏర్పాట్లు చేసిన అనంతరం వారికి దుర్గమ్మవారి చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రం అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.



# ఐపిఎస్ అధికారి విశాల్ గున్ని సస్పెన్షన్ పొడిగింపు

**విజయవాడ, జూన్ 19 ప్రభాతవార్త ప్రతినిధి:** ఐపిఎస్ అధికారి విశాల్ గున్ని సస్పెన్షన్ సెప్టెంబర్ 4 వరకు పొడిగించారు. ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ఓ కేసులో విశాల్ గున్నిపై ఆరోపణలున్నాయి. అభియోగాలు ఎదుర్కొంటూ సస్పెండైన సంగతి తెలిసిందే. ఈకేసులో 2024 సెప్టెంబర్ నుంచి విశాల్ గున్ని సస్పెన్షన్‌లో ఉన్నారు.

# రైతుకు అండగా కూటమి ప్రభుత్వం

- రెండు రోజుల్లో సబ్సిడీ వేరుసెనగ విత్తనాలు పంపిణీ
- జిల్లా ఇన్‌ఛార్జీ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

**చిత్తూరు, జూన్ 19 ప్రభాతవార్త:** రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం అన్ని విషయాల్లో రైతులకు అండగా నిలిచి వారి సమస్యలను పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర రవాణా శాఖ, జిల్లా ఇన్‌ఛార్జీ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. చిత్తూరులో శుక్రవారం జరిగిన 'రెండేళ్ళ నమ్మకం-అభివృద్ధి, సంక్షేమం' కార్యక్రమం అనంతరం జిల్లా ఇన్‌ఛార్జీ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో రైతులకు అవసరమైన విత్తనాలను సకాలంలో పంపిణీ చేయడంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి కేంద్రీకరించిందన్నారు. కూటమి ప్రభుత్వం భవిష్యత్తులో ఎదురయ్యే పరిస్థితులను ముందుగానే అంచనా వేసి వాటిని అధిగమించేలా పని చేస్తోందన్నారు. సిఎం నారా చంద్రబాబునాయుడు రైతు సంక్షేమానికి అనునిత్యం ప్రాధాన్యత ఇస్తున్నారని, ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో జిల్లాలో వేరుసెనగ విత్తనాల పంపిణీ అంశంను ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుందని, రైతుల ప్రయోజనాలను దృష్టిలో వుంచుకుని వారికి అవసరమైన వేరుసెనగ విత్తనాలను అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఖరీఫ్ సీజన్‌లో వేరుసెగన పంట సాగు చేసే రైతులందరికీ ప్రణాళికాబద్ధంగా విత్తనాల పంపిణీకి చర్యలు తీసుకుంటామన్నారు. రెండు మూడు రోజుల్లో సంబంధిత శాఖల అధికారులు సమన్వయం చేసుకుని విత్తనాల సరఫరా ప్రక్రియను జిల్లాలో వేగవతం చేయడానికి చర్యలు తీసుకుంటారన్నారు.



# తిరుపతిలో వైభవంగా మహాలక్ష్మీ దీప పూజ

**తిరుమల, జూన్ 19 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆధ్యాత్మిక నగరం తిరుపతిలోని రామచంద్ర పుష్కరిణి శుక్రవారం సాయంత్రం గోవింద నామస్మరణతో మారుమోగింది. సకల సంపదలకు అధిష్ఠాన దేవత అయిన మహాలక్ష్మీ మ్మదేవిని ఆరాధించే పవిత్రమైన మహాలక్ష్మీ మ్మ దీప పూజ కార్యక్రమం శుక్రవారం తిరుపతిలో భక్తిశ్రద్ధలతో జరిగింది. ఈ సందర్భంగా టిటిడి జెఇఓ డాక్టర్ శరత్ మాట్లాడుతూ ప్రజలందరూ సుఖసంతోషాలు, ఐశ్వర్యాలతో జీవించాలని సంకల్పించి టిటిడి అనేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. ఎస్వీబిసి ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందిస్తోందని చెప్పారు. ఇకపై ప్రతి నెల రెండో శుక్రవారం వివిధ ప్రాంతాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. టిటిడి బోర్డు సభ్యుడు భాను ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ దీపం వెలిగే చోట శుభం, ఐశ్వర్యం నెలకొంటాయని అన్నారు. భక్తుల భాగస్వామ్యంతో టిటిడి నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం విశేష ఆదరణ పొందుతోందన్నారు. బోర్డు సభ్యురాలు పనబాక లక్ష్మీ మ్మ, హిందూ ధర్మ ప్రచార పరిషత్ కార్యదర్శి డాక్టర్ మేడసాని మోహన్ మాట్లాడుతూ దీపం జ్ఞానానికి, శుభానికి, ఐశ్వర్యానికి ప్రతీక అని చెప్పారు. మహాలక్ష్మీ మ్మ దీప పూజ ద్వారా కుటుంబాల్లో సుఖశాంతులు, సమృద్ధి నెలకొనాలని ఆకాంక్షి ంచారు. అనంతరం అర్చకులు శాస్త్రోక్తంగా విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, దీపలక్ష్మీ మ్మ ఆరాధన, అష్టోత్తర శతనామార్చన నిర్వహించారు. వేద మంత్రోచ్చారణలు, లక్ష్మీ మ్మ స్తోత్ర పారాయణాలు, వేలాది దీపాల వెలుగులతో ఆధ్యాత్మిక వాతావరణం అలరించింది. ఈ సందర్భంగా అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు ఆలపించిన భక్తి సంకీర్తనలు భక్తులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమం చివరగా

# కాపుల సమస్యల పరిష్కారానికి కృషి: సుబ్బారాయుడు

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, జూన్ 19 ప్రభాతవార్త:** కాపు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని కాపు కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు అన్నారు. అంబేద్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం మండలం గోపాలపురంలో టీడీపీ సీనియర్ నాయకుడు, కాపు ఉద్యమ నేత ఆకుల రామకృష్ణను శుక్రవారం సుబ్బారాయుడు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కాపు జేఏసీ నాయకులతో ఆయన ఆత్మీయ సమావేశం నిర్వహించారు. కాపు కార్పొరేషన్ ద్వారా కాపు, తెలగ, బలిజ వర్గాలకు అందాల్సిన రుణాలు, కాపు రిజర్వేషన్లు, రాష్ట్రవ్యాప్తంగా కాపు సామాజిక వర్గం ఎదుర్కొంటున్న సమస్యల పై చర్చించారు. అనంతరం సుబ్బారాయుడు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలో కి రావడంలో కాపు, తెలగ, బలిజ వర్గాల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కాపు కార్పొరేషన్ రుణాల మంజూరుకు సానుకూలంగా ఉన్నారని తెలిపారు. గత ప్రభుత్వ పాలనలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దెబ్బతిన్నప్పటికీ, ప్రస్తుతం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రాన్ని గాడిలో పెట్టే దిశగా చర్యలు తీసుకుంటున్నారని అన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసే దిశగా ముందుకు సాగుతోందని, అదే క్రమంలో కాపు కార్పొరేషన్ రుణాల పంపిణీలో జరిగిన ఆలస్యాన్ని త్వరలో అధిగమించి లబ్ధిదారులకు రుణాలు అందజేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని కాపు సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరుతూ ఆకుల రామకృష్ణ, జేఏసీ నాయకులతో కలిసి సుబ్బారాయుడికి వినతిపత్రం అందజేశారు.కాగా ఓపక్క లంచ్ బేటీ ల పేరుతో వైఎస్సార్ సీపీ చేపట్టిన సందర్భంలో అదికార కూటమి తరపున అదీ జనసేన నేత కాపు కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి కాపు సామాజిక వర్గానికి ఏదో చేయబోతున్నట్లు బయటకొచ్చారు. అదికూడా ఈసమయంలో అంటే వైసిపి వ్యూహానికి ప్రత్యమ్నాయంగా కూటమి చెక్ పెట్టేందుకు శ్రీకారం చుట్టిందని భావిస్తున్నారు.దీంతో కొత్తపల్లి పర్యటన కు ప్రాధాన్యత సంతరించుకుంది.


PROCEEDINGS OF THE DISTRICT COLLECTOR, TIRUPATI

GOVERNMENT OF ANDHRA PRADESH

FORM No. VI(A)

(under section 11 (1) of the Act, 30 of 2013 read with sub Rule (1) of Rule 19)

PRELIMINARY NOTIFICATION

Roc.G3/e-80932 /2026, Dt: 17-06-2026

Whereas it appears to the District Collector, Tirupathi District that lands specified in the schedule below are needed for a public purpose i.e.,for Development of Dugarajapatnam Port & Shipbuilding & repair facilities notice to that effect is hereby given to all to whom it may concern in accordance with the provisions of Section-11(1) of the Right to Fair Compensation and Transparency in Land Acquisition, Rehabilitation and Resettlement Act, 2013 (Central Act.No.30 of 2013)

There are no displaced families in this land acquisition.

Now, therefore in exercise of the power conferred under section-12 Act, the District Collector, Tirupathi hereby, designates the Revenue Divisional Officer, Sullurupeta & his staff and workmen to exercise the powers conferred under the above said section.

Under section 11 (4) of the Act, no person shall make any transaction or cause any transaction of land i.e., Sale/ purchase etc., or create any encumbrances on such from the date of this notification without the prior approval of the District Collector.

Objections to the acquisition, if any, may be filed by the person(s) interested within 60 (sixty) days from the date of publication of this Notification as provided under section -15 of the Act before the District Collector, Tirupathi/ Revenue Divisional Officer & Land Acquisition Officer, Sullurupeta.

SCHEDULE:

District : Tirupati Mandal : Vakadu Village: Pamanji

| Sl. No. | Survey No. | Total Extent (in Acs) | Extent under Acquisition on (in Acs) | Name & Address of the person interested | Boundaries North | Boundaries South | Boundaries East | Boundaries West | Details of Trees, structures etc., if any |
|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 112 | 3.78 | 3.78 | Gramakantam | 122 | 113 | 122 | 111 | Cyclone |
| 2 | 113-1 | 0.82 | 0.82 | Houses (Govt Layout) | 112 | 113-2 | 121 | 114 | Shelter & Houses-6 |
| 3 | 113-2A | 1.13 | 1.13 | Houses (Govt Layout) | 113-1 | 113-2B | 126 | 113, 115 | Houses-32 |

Sd/- S. Venkateswar, (IAS) Collector and District Magistrate Tirupati District.

వార్త


మనిషి అన్నవాడు ముందు ఆత్మాభిమానం కలిగి ఉండాలి. ఆత్మాభిమానం లేనివాడు అసలు మనిషిగా ఎదగలేడు.

- న- పాస్కల్

# సంతకాలైపోయాయి..ఇక.!

ప్రస్తుతానికైతే యుద్ధం ముగిసినట్లే. కానీ పశ్చిమాసియా మరోసారి రక్తసిక్తమయ్యే పరిస్థితులు వస్తే మూల్యం ఎవరు చెల్లించుకోవాలో నిర్దిష్ట పరిష్కారాలు దొరక్కుండా అయిందంటే అయిందనుకోవడం తాజా యుద్ధ విరమణకే చెల్లింది. చింత చచ్చినా పులుపు చావదంటారు. శరీరంలో చేవ చచ్చినా,చచ్చి చెడి రాజీ కోసం ఇరాన్ కాళ్లావేళ్లా పడి బతుకు జీవుడా!అని శాంతి ఒప్పందంతో బయటపడినా, శ్వేతసౌధాధిపతి డోనాల్డ్ ట్రంప్ 'పరిస్థితి అలాగే ఉంది' 'అతడనేక యుద్ధములనారితేరిన వాడన్న' రీతిలో 'యుద్ధము- శాంతి' అనగానే ఉవ్విళ్లూరే ఆయన తాజాగా కింద పడ్డా తానే గెలిచానంటున్నాడు. జరిగిందేదో జరిగింది. అయిపోయిందేదో అయిపోయింది. అని సరిపెట్టుకునే వాడు కాదాయన. ఇరాన్‌పై తాను మెత్తపడ్డానని అనుకునే వారు 'ఫూల్స్' అని సరిపెట్టేసుకున్నారు. దాంతో ఆయన అహం తీరినట్లుంది. ఎవరేమన్నా, ఎవరేమనుకున్నా సంతకాల తతంగం పూర్తయిపోయింది. ప్రపంచవ్యాప్తంగా ఇరాన్ అమెరికాల మధ్య శాంతి ఒప్పందంపై హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. పశ్చిమాసియా సంక్షోభం నుంచి బయటపడేందుకు మార్గం సుగమమయినందుకు ఎల్లెడలా ప్రజలు సంతోషపడ్తున్నారు. కనుచూపు మేరలో పరిస్థితులు చక్కబడి నిత్యావసర వస్తువులపై పడిన అధిక రవాణా భారం తగ్గుతుందని ఆశిస్తున్నారు. అందుకు వడివడిగా ప్రభుత్వాలు అడుగులు వేస్తున్నాయనే చెప్పాలి. ఇరాన్ ఓడరేవులపై నౌకాదళ దిగ్బంధాన్ని అమెరికా తొలగించింది. అమెరికాతో ఇరాన్ సంక్షిప్త స్థాయిలో తాత్కాలిక అవగాహన ఒప్పందమే కుదుర్చుకుంది. హర్మూజ్ జలసంధి గుండా ప్రయాణించే అంతర్జాతీయ వాణిజ్య నౌకలకు రానున్న 60 రోజుల పాటు రవాణా రుసుములుండవు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌తో శాంతి ఒప్పందంపై సంతకం చేసిన స్వల్ప వ్యవధిలోనే మూడు సౌదీ అరేబియా ట్యాంకర్లు, నౌకలు హర్మూజ్ జలసంధిని దాటాయన్న సమాచారం స్వాగతించదగినదే.మధ్యప్రాచ్య గల్ఫ్‌లో నిలిచిన నౌకలు గమ్యం చేరితే 85 మిలియన్ బ్యారెళ్లకు పైగా చమురు ప్రపంచ దేశాలకు అందనుంది. ఇరాన్ చమురుపై అమెరికా ఆంక్షలు ఎత్తివేతతో చమురు సరఫరా మెరుగుపడి వాటి ధరలు తగ్గుముఖం పడతాయి. యుద్ధ సమయంలో వివిధ సందర్భాల్లో, వివిధ దేశాల్లో, వివిధ ప్రధాన సంస్థలు విధించిన ఆంక్షలన్నీ ఒక్కటొక్కటిగా ఎత్తివేస్తున్నారు. కువైట్ పెట్రోలియం కార్పొరేషన్ తమ ఆయిల్ ఫీల్డ్‌లను ఉత్పత్తికి సిద్ధం చేస్తోంది. హర్మూజ్‌పై ఇరాన్ గుత్తాధిపత్యానికి ఎలాంటి ఇబ్బంది కలుగని విధంగానే ఒప్పందంలో అంశాన్ని చేర్చుకోగలి గారు. అమెరికా, ఇరాన్ అవగాహనలోని 14 అంశాల ఒప్పందానికి ఇస్లామాబాద్ మెమోరాండం ఆఫ్ అండర్‌స్టాండింగ్ బిట్వీన్ ది యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా అండ్ ఇస్లామిక్ రిపబ్లికన్ ఆఫ్ ఇరాన్' అని పేరు పెట్టారు. ఇందులో లెబనాన్‌ను ఒప్పందంలో భాగం చేసినా ఇజ్రాయెల్ 'ఒట్టు తీసి గట్టు మీద' పెట్టింది. తాజా ఒప్పందం అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థకు పెద్దఊరటనిచ్చే విషయం అను కుంటున్నాం. కానీ అలా ఒప్పందం అమల్లోకి వచ్చిన అతిస్వల్ప వ్యవధిలో ఇజ్రాయెల్, లెబనాన్‌పై కాలుదువ్వుతోంది. ఇజ్రాయెల్ వైమానిక దాడుల్లో 16 మంది మృతి చెందారు. దక్షిణ లెబనాన్‌లోని పలు ప్రాంతాలపై ఇజ్రాయెల్ సైన్యం దాడులు కొనసాగిస్తోంది. లెబనాన్ అంశం కూడా తాజా ఒప్పందంలోని అంశాలే. మరి ఒప్పందం భవిత ఏమిటో ట్రంపే తేల్చాలి. అవగాహన ఒప్పందంపై సంతకాలు చేసి తక్షణ అమల్లోకి ప్రవేశించిన అమెరికా ఇరాన్‌లు ఎవరి ధీమాతో వారు అపవేవో బీరాలు పలుకుతున్నాయి. సంధి ఒడంబడికల్లో ఎన్ని అమలవుతాయి, ఎన్ని ఉల్లంఘనలకు గురవుతాయన్నది సందిగ్ధంలో పడినప్పుడు పర్యవసానాల మాటేమిటో ఇతమిత్థంగా చర్చించినట్లు లేదు. కాగా ఇరాన్‌లో కుదిరిన ఒప్పందం ఫైనల్ కాదని, అదొక అవగాహన ఒప్పందమే. కనుక ఎప్పుడైనా ఇరాన్ ప్రవర్తన తనకు నచ్చకపోతే తూచ్ అని ఇరాన్‌పై బాంబులు తప్పవని ట్రంప్ బహిరంగంగానే హెచ్చరికలు చేశారు.ఫ్రాన్స్‌లో జరిగిన జీ7సదస్సులో ట్రంప్ చేసిన వ్యాఖ్యలివి. నిజంగా సంధికుదిరిదానిని ఉభయ పక్షాలూ గౌరవించే పరిస్థితి ఉంటే ఇలాంటి వ్యాఖ్యలు రాకూడదు. వచ్చేసాయి అంతేకాదు ఉల్లంఘనలు కూడా జరిగిపోతున్నాయి. ఇలాంటి పరిణామాలు పశ్చిమాసియాను ఏ దిశగా తీసుకెళ్తాయో గమనించాల్సిందే. ఇదే తరుణంలో అమెరికన్ ఇంటెలిజెన్స్ విడుదల చేసిన నివేదికను బట్టి చూస్తే ఇరాన్ యుఎస్ స్నేహ బంధం ఎంతకాలం నిలిచి ఉంటుందో చెప్పలేం. అసలే 'అణు'మానాలతో కొనసాగు తున్న ప్రయాణానికి మరికొన్ని అనుమానాలు వైరానికి ఊపిరిపోస్తున్నట్లే ఉంది. హర్మూజ్ జలసంధిపై ఇరాన్ నియంత్రణ అణ్వాయుధం కంటే శక్తివంతమైనదని యుఎస్ ఇంటెలిజెన్స్ చెబుతోంది.అది నిజమే. అమెరికాను ఎదురించేందుకు ఏమాత్రం సరితూగని ఇరాన్ అమెరికా దాదాపు దాసోహం చేసుకోగలిగిందంటే ఇరాన్ పవర్ అదే. అందుకేనేమో ట్రంప్ కూడా యూటర్న్ తీసుకునేందుకు వీలైన వాక్యాలతో ముందస్తు హెచ్చరి కలు చేసినట్లుగానే ఉంది. కాగా ఐరాస భద్రతా మండలి నిబంధనలకు లోబడి తుది ఒప్పందం కుదుర్చుకోవాలనే సూత్రప్రాయమైన నిర్దేశికతను పొందుపరుచుకున్నారు. ఈ నేపథ్యంలో ఐరాన్ నిర్ణయమే కొసమెరుపు కాగలదు. చిల్లర పేచీల నెవరు తీరుస్తారన్న ప్రశ్నకు ట్రంప్ తానే గార్డియన్‌గా ఉంటానన్న ఒకే ఒక్క భరోసా సమాధానమిస్తుందని ఎదురు చూడాలి. లెబనాన్ సార్వభౌమాధికారాన్ని గౌరవించాల్సిందెవరో అమెరికా అధ్యక్షుల వారే తేల్చాలి.

> దేశానికి గాని, సమాజానికి గాని సంఖ్యాబలం ఒక్కటే చాలదు. వారు ఎప్పుడూ అప్రమత్తులై, విద్యావంతులై ఉన్నప్పుడే ఆ జాతి బాగుపడుతుంది.
>
> 
>
> బి.ఆర్ అంబేద్కర్

> మానవత్వాన్ని మించింది ఈ లోకంలో లేదు. మానవత్వం ఒక సముద్రం.అందులో రెండు చుక్కలు మలినం కలిసినంత మాత్రాన సముద్రం చెడిపోదు.
>
> 
>
> మహాత్మా గాంధీ

# ప్రజావాక్కు

## ముఖ్యమంత్రి గారూ ఇదేనా మీ పాలన?

తిరుపతి జిల్లా వరదయ్యపాలెం మండలంలో 20 సంవత్సరాలక్రితం దళితుల అసైన్డ్ భూములక్రమించి కల్కి గోల్డెన్ టెంపుల్ కట్టాడు.కలెక్టరు నోటీసు ఇవ్వగా కల్కి కోర్టుకు వెళ్ళాడు. రెండు సంవత్సరాల క్రితం హైకోర్టు కల్కి పిటిషన్‌ను కొట్టేసింది.వెంటనే దళితులు వెళ్ళి మా భూములు మాకు అప్పగించండి అని తిరుపతి కలెక్టర్‌ను,వరదయ్యపాలెం తహసీల్‌దారుని కలవటంజరిగింది. కలెక్టర్‌చూస్తానన్నారు.తహసీల్‌దార్ మాత్రంఏదో అంటూ నాటకాలు ఆడుతున్నాడు. ముఖ్యమంత్రి గారూ మీరేమో భూములాక్రమిస్తే జైలుకు పంపుతాం అంటున్నారు. ఉత్తుత్తి ప్రగల్భాలుగా మీమాటలు మిగిలిపోతున్నాయి.మీ మాటలను అధికారులు పట్టించుకోవటం లేదు.వారిమీద చర్యలు తీసుకోండి.ఇంకా ఎన్నాళ్ళు?హైకోర్టు కల్కి కేసును హైకోర్టు కొట్టేసింది.తరువాత కేసు ఉపసంహరించుకున్నాడు.దళితులభూములు దళితులకు అప్పగించాల్సిన బాధ్యత జిల్లా అధికారులది.

- నార్నె వెంకటసుబ్బయ్య, ప్రకాశం జిల్లా

## మనుషుల్లో మార్పు రావాలి

మనం, మన ఇల్లు పచ్చగా వుంటే చాలు, మన చుట్టూ వున్న వారితో, పరిసరాలతో మనకు పని లేదు అనుకునే వాళ్ళు చాలామంది వున్నారు. వీళ్లు చదువుకోలేని అజ్ఞానులు అంటే అదీ కాదు. బాగా చదువుకున్నవాళ్ళే! మన ఇల్లు,గేటువరకే మనదని, దాని తర్వాత ప్రాంతం మనవి కాదని మన ఇంట్లో చెత్త చెదారాన్ని అక్కడ పడేస్తే, క్రిమికీటకాలు చేరి మన ప్రక్కవాళ్ళతో పాటు మనల్ని కుట్టి రోగాలను పుట్టిస్తాయని తెలుసు. అయినా వాళ్ళ పద్ధతి మార్చుకోరు. మనం తిరిగే ప్రతీ ప్రాంతం మనదే అనుకుని పరిశుభ్రంగా వుంచడానికి ప్రయత్నించరు. మన చుట్టూ వున్న పరిసరాల గురించి ఆలోచించాలంటే, ముందు మన మనసులో ఎలాంటి మలినాలు లేకుండా పరిశుభ్రంగా వుంచుకోవాలి.

- కాయల నాగేంద్ర, హైదరాబాద్

## నిధులను విడుదల చేయాలి

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఫీజ్ రీయంబర్స్‌మెంట్ బకాయి నిధులను సకాలంలో విడుదల చేయక పోవడం వల్ల ప్రైవేట్ కళాశాలల యాజమాన్యం ఫీజ్‌లు చెల్లించాలని విద్యార్థులపై వత్తిడి చెయడం వల్ల ఫీజ్‌లు చెల్లించే ఆర్థిక స్తోమత లేని విద్యార్థులు మధ్యలోనే చదువు మానేసే ప్రమాదం ఉంది.

-బి. కృష్ణయాదవ్, హైదరాబాద్

## ఆర్‌టీఐ వ్యవస్థను బలోపేతం చేయాలి

భారత ప్రజాస్వామ్యంలో సమాచార హక్కు చట్టం (ఆర్‌టీఐ) 21 సంవత్సరాలు పూర్తి చేసుకోవడం ఒక ముఖ్యమైన మైలురాయి. ప్రభుత్వ వ్యవస్థల్లో పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించడంలో ఈ చట్టం కీలకపాత్ర పోషించింది. అవినీతి వ్యవహారాలనువెలికితీయడం,ప్రజానిధుల వినియోగాన్ని పర్యవేక్షించడం, ప్రభుత్వ నిర్ణయాలపై సమాధానాలు రాబట్టడం వంటి అంశాల్లో ఆర్‌టీఐపౌరులకు శక్తివంతమైన ఆయుధంగా నిలిచింది.అయితే ప్రస్తుతం ఈచట్టం అమలులో పలు సవాళ్లు ఎదురవుతున్నాయి. దేశవ్యాప్తంగా సమాచార కమిషన్లలో 4.1లక్షలకుపైగా అప్పీలు పెండింగ్‌లో ఉండగా, ఒక్క ఏడాదిలోనే 2.4 లక్షల కొత్త కేసులు నమోదయ్యాయి. మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉంది. సమాచారం ఇవ్వడంలో ఆలస్యం లేదా నిరాకరణ ప్రజల్లో ప్రభుత్వాలపై నమ్మకాన్ని దెబ్బతీస్తుంది.ఆర్‌టీఐ వ్యవస్థను మరింత బలోపేతం చేయాలంటే పెండింగ్ కేసుల వేగవంతమైన పరిష్కారం,

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

## అక్రమ దత్తతలను అరికట్టాలి

తెలుగు రాష్ట్రాలలో దత్తత పేరిట సాగుతున్న శిశు విక్రయాలనుఅడ్డుకోవడం సామాజికబాధ్యత.ఇటీవలికాలంలో వెలుగు చూస్తున్న అక్రమ దత్తతలు,శిశు విక్రయ ముఠాల ఉదంతాలు ఈ సమస్య తీవ్రతకు అద్దం పడుతున్నాయి. సంతానంలేని దంపతుల ఆరాటాన్ని, పేదరికాన్ని ఆసరాగా చేసుకుని దళారులు వ్యాపారం చేస్తు న్నారు. సాంకేతికతను వాడుకుంటూ రహస్య సంప్రదింపుల ద్వారా అక్రమ రవాణాకు పాల్పడుతున్నారు. పిల్లల దత్తతకు చట్టబద్ధమైన మార్గం ఒక్కటే. కేంద్ర ప్రభుత్వ సంస్థ కారా మహిళా, శిశు సంక్షేమ శాఖల ద్వారానే ఈ ప్రక్రియ జరగాలి అక్రమ దత్తతలను అనుమతిస్తే బాలల అక్రమ రవాణా విపరీతంగా పెరిగిపోతుంది

- కె.రామారావు, హైదరాబాద్

## పెరుగుతున్న ధరలను నియంత్రించలేరా?

పశ్చిమాసియా ఘర్షణ కేవలం ఆప్రాంత సరిహద్దులకే పరిమితం కాకుండా, ప్రపంచ ఆర్థికవ్యవస్థ గుండెకాయను తాకుతున్నాయి. ఈఘర్షణలు నేడు ప్రతి దేశపు వంటింటి బడ్జెట్‌ను, పారిశ్రామిక రంగాన్ని అతలాకుతలం చేస్తున్నాయి. నౌకల రాకపోకలు నిలిచిపోవడంతో సహజ వాయువు, చమురు ధరలు అంతర్జాతీయ మార్కెట్‌లో ఒక్కసారిగా ఎగబాకాయి. భవిష్యత్తులో రాబోయే భారీ ద్రవ్యోల్బణానికి సంకేతం.

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి | ఎడిట్ పేజీకి..
ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు
మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)

# విస్తరిస్తున్న వికృత క్రీడ!

**దేశంలో ఈ రాక్షస క్రీడ చాపకింద నీరులా విస్తరిస్తూనే ఉన్నది. సంఘటనలు జరిగినప్పుడు పోలీసుల హడావుడి, నాలుగైదు రోజుల పాటు నేతల పత్రికా ప్రకటనలు, ఆ తర్వాత మరిచిపోతున్నారు. ఈ రాక్షసక్రీడ ఇంత వికృత రూపం దాలుస్తున్నా నిందితులను సాక్ష్యాలతో న్యాయస్థానం ముందు నిలబెట్టి శిక్షలు వేయించలేకపోతున్నారంటే ఏమనుకోవాలి. ప్రాణసమానంగా పెంచుకున్న తమ బిడ్డలు తమ కళ్లముందే చదువు, సంస్కారం ఉందనుకున్న వింత పశువుల వికృత చేష్టలకు బలవుతుంటే ఆ గర్భశోకాన్ని ఊహించగలమా? అది ఎప్పటికైనా తీరుతుందా? పాలక పెద్దలు ఇప్పటికైనా మనసుపెట్టి ఆలోచించాలి. రాజకీయాలకు అతీతంగా చర్యలు తీసుకోవాలి. ర్యాగింగ్‌కు పాల్పడేవారికి, ప్రోత్సహించేవారికి మాటలతో కాకుండా చర్యల ద్వారా తిరుగులేని హెచ్చరికలు అందించాలి. అప్పుడే ర్యాగింగ్ భూతాన్ని దేశం నుంచి పారద్రోలగలుగుతాం. చట్టాన్ని అమలు చేసే చిత్తశుద్ధి లేనప్పుడు, త్రికరణశుద్ధిగా ప్రయత్నం చేయలేనప్పుడు ఈ చట్టాలు, చర్చలు, అన్నీ నిష్ప్రయోజనమే.**

దామెర్ల సాయిబాబ

ఎన్ని చట్టాలు చేసినా, కఠిన చర్యలు తప్పవని పాలకులు ఎన్నిసార్లు హెచ్చరించినా ర్యాగింగ్ భూతం వదిలిపెట్టడం లేదు. ఎందరో అమాయక విద్యార్థులు బలైపోతున్నారు. తమకు జరిగిన అవమానాలు భరించలేక, బయటకు చెప్పుకోలేక వారిలో వారు కుమిలిపోతుంటే మరికొందరు ఆత్మహత్యలు చేసుకోవడానికి కూడా వెనుకాడడం లేదు. ఇంతకాలంగా ఇంతలా కొనసాగుతున్న ర్యాగింగ్ కారకులపై పాలకులు నిర్దిష్టమైన చర్యలు తీసుకోలేకపోతున్నారు. ఇలాంటి సంఘటనలు స్పష్టమైన సాక్ష్యాధారాలతో వెలుగు చూసినప్పుడు కూడా వాటిని న్యాయస్థానం ముందుబెట్టి నిందితులకు శిక్షలు వేయించడంలో ప్రభుత్వ యంత్రాంగం ఘోరంగా విఫలమవుతున్నది. ర్యాగింగ్ భూతాన్ని పారద్రోలేందుకు తీసుకువచ్చిన చట్టం, నిబంధనలు, నియమించుకున్న కమిటీలు అన్నీ కాగితాలకే పరిమితమవుతున్నాయి. చట్టాలకు సామాన్యులు లోకువ అయితే సమర్థులకు చట్టాలు లోకువవుతున్నట్లు కారకులు ఏదో రకంగా బయటపడుతున్నారు. కొన్ని సందర్భాల్లో ర్యాగింగ్‌ను నిరోధించడానికి ఏర్పాటు చేసిన కమిటీల్లోని సభ్యులు,కాలేజీల యాజమాన్యాలు సంఘటనలు వెలుగు చూడకుండా చేస్తున్నారు. కాలేజీలకు చెడ్డపేరు వస్తుందనే భయంతో పెదవులు విప్పడంలేదు. అందుకే ఎన్నో దారుణ సంఘటనలు వెలుగు చూడడం లేదు. ర్యాగింగ్ అనండి, వేధింపులు అనండి, టార్చర్ అనండి వీటి కారణంగా ఎందరో విద్యార్థినీవిద్యార్థులు పడుతున్న ఇబ్బందులు అన్నీఇన్నీ కావు. తాజాగా తెలంగాణ రాజధాని హైదరాబాద్ నడిబొడ్డులో ఉన్న ఉస్మానియా వైద్య కళాశాల వసతి గృహంలో కొందరు సీనియర్లు ర్యాగింగ్ పేరుతో జూనియర్లపై ర్యాగింగ్ చేసిన ఉదంతం వెలుగు చూసింది. ర్యాగింగ్ చేయొద్దని కొందరు సీనియర్లు చేసిన సలహాలు పెడచెవిన పెట్టడమే కాదు వారిపై దాడి చేసిన సంఘటనతో మొత్తం బయట పడింది. ఈ విషయం వెలుగు చూడకుండా చేయాలనే ప్రయత్నాలు ఫలించలేదు. ఎట్టకేలకు పోలీసులు రంగ ప్రవేశం చేసి కేసు నమోదు చేసి డజను మంది సీనియర్లపై కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకొన్నారు. కాలేజీ యాజమాన్యం ఆ పన్నెండు మందిని ఆరు నెలల పాటు సస్పెండ్ చేసింది. వాస్తవంగా ఎంతో కాలంగా ఈ ర్యాగింగ్ కొనసాగుతున్నట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడయింది. ఈ నెల ఎనిమిదో తేదీన పద్నాలుగు మంది బిడిఎస్‌కు చెందిన మొదటి సంవత్సరం విద్యార్థులను చివరి సంవత్సరం విద్యార్థులు ర్యాగింగ్ పేరుతో మానసిక ఒత్తిడికి గురి చేస్తుండగా గమనించిన ఇంటర్న్‌షిప్ చేస్తున్న కొందరు సీనియర్లు అడ్డుకున్నారు. ఈ విషయం కాలేజీ యాజమాన్యం దృష్టికి వెళ్లడంతో మరుసటి రోజు సమావేశం నిర్వహించి నచ్చచెప్పే ప్రయత్నం చేశారు. అయితే తమపై ఫిర్యాదు చేయడాన్ని తీవ్రంగా భావించిన ర్యాగింగ్ చేసిన నిందితులు మళ్లీ ఈ నెల 11వ తేదీన మరోసారి జూనియర్లపై తమ ప్రతాపం చూపారు. దీంతో పరిస్థితి చేతులు దాటుతుండడంతో యాజమాన్యం ఈ నెల 16న సుల్తాన్ బజారు పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకొని ర్యాగింగ్‌కు పాల్పడినట్లు ఆరోపణకు

## ఒక్క మాట

గురైన పన్నెండు మంది విద్యార్థులను అదుపులోకి తీసుకున్నట్లు సంబంధిత డిసిపి వెల్లడించారు. వారందరిని ఆరు నెలలపాటు సస్పెండ్ చేసినట్లు ప్రిన్సిపల్ ప్రకటించారు. తెలుగు రాష్ట్రాల్లోనే కాదు దేశవ్యాప్తంగా కూడా ఈ ర్యాగింగ్ భూతం విస్తరిస్తూనే ఉంది. మొన్న ఆ మధ్య గుజరాత్‌లోని పాటణ్ జిల్లాలో ఒక వైద్య కళాశాలలో కొందరు సీనియర్లు జూనియర్ విద్యార్థినిని మూడుగంటలపాటు నిలబెట్టి పైశాచిక ఆనందం పొందడంతో ఆ విద్యార్థి అపస్మారక స్థితిలోకి వెళ్లిప్రాణం విడిచారు. తెలంగాణలోని ఖమ్మంలోని ఒకవైద్య కళాశాలలో కొత్తగా చేరిన వైద్య విద్యార్థినిని తన హెయిర్ స్టైల్ బాగాలేదంటూ సీనియర్లు ర్యాగింగ్ చేశారు. ఆ విషయం తెలుసుకున్న బాధ్యత కలిగిన ఒక ఉద్యోగి సీనియర్లను మందలించడానికి బదులు జూనియర్లపై ఆగ్రహంవ్యక్తం చేశారు. ఆ తర్వాత ఆ విద్యార్థికి గుండు కొట్టించేప్రయత్నం చేసి పవిత్ర వృత్తికే కళంకం తెచ్చారు. గతంలో ఎంతో మంది ఈర్యాగింగ్ కారణంగా తనువులు చాలించిన సందర్భాలున్నాయి. మరెందరో ఏకంగా విద్యా భ్యాసానికి స్వస్తి చెప్పిన సంఘటనలు కూడా చోటు చేసు కున్నాయి. ఈ ర్యాగింగ్ అనేది ముందుగా కేవలంమెడికల్, ఇంజినీరింగ్ వంటి ప్రొఫెషనల్ కళాశాలల్లో 19వ శతాబ్దం ఆరంభంలో మొదలైనట్లు చెప్తారు. ఇది రానురాను అన్ని కాలేజీలకు విస్తరించింది. ఎన్నోవ్యయప్రయాసలకు ఓర్చి ఇంటర్మీడియేట్ విద్యను పూర్తి చేసుకొని ఉజ్వల భవిష్యత్‌ను ఊహించుకుంటూ కాలేజీల్లోకి అడుగుపెట్టిన విద్యార్థులకు బెరుకు,భయం పోగొట్టి నలుగురితో కలిసి మెలిసి ఉండేలా చేసేందుకు చేపట్టిన పరిచయ వినోద కార్యక్రమం ఇది. ప్రారంభంలో అంతవరకే పరిమితమైనా ఆ తర్వాత శృతిమించి కొందరు విద్యార్థులకు ప్రాణాంతక వికృతకేళిగా మారిపోయింది. పాశ్చాత్య సంస్కృతి విషవలయంలో చిక్కుకొని ఆలోచనా రహితంగా చేస్తున్న ఈర్యాగింగ్‌ను లేత మనుసులు తట్టుకోలేకపోతున్నాయి.దీనికి అశ్లీలసాహిత్యం,నీలిచిత్రాలు, మాదక ద్రవ్యాలు, మత్తుపదార్థాలు, ఇతర బలహీనతలు తోడుకావడంతో ఈ అమానుషత్వం పరాకాష్ఠకు చేరింది. దేశవ్యాప్తంగా ఇప్పటికే ఎంతోమంది మెరికల్లాంటి విద్యార్థులు బలైపోయారు. మరెందరో ర్యాగింగ్‌కు భయపడి ఏకంగా చదువులకే స్వస్తి చెప్తున్నారు. రికార్డుల పరంగా కొంతమేరకు తగ్గినట్లు కన్పిస్తున్నా చాలావరకు వెలుగు చూడడం లేదేమోనని పిస్తున్నది. ఈ ర్యాగింగ్‌ను అదుపు చేయడానికి ఏమీ చేయడం లేదని చెప్పడంలేదు. పటిష్టమైన చట్టాన్ని తీసుకువచ్చారు. జరిమానాలతోపాటు జైలు శిక్షలు కూడా విధించే చట్టాన్ని ప్రవేశపెట్టినా ఫలితం లేకుండాపోతున్నది. వీటన్నింటికి మించిర్యాగింగ్ చేసిన విద్యార్థులను ఆయా విద్యాసంస్థల నుండి సస్పెండ్ చేయడమేకాదు వారిని మరో చోట ఎక్కడా చేర్చుకోరాదని కూడా చట్టంలో చాలా స్పష్టంగా పేర్కొన్నారు. ఈచట్టం వచ్చిన తర్వాత ర్యాగింగ్ కనుమరుగవుతుందని పాలకులు ప్రకటనల మీద ప్రకటనలు గుప్పించారు. కానీ చేసిన చట్టాలను అమలు చేసే త్రికరణశుద్ధి ప్రభుత్వానికి లోపించడం వల్లనే చట్టం వచ్చినప్పుడు కొంత భయం ఏర్పడినా ఆతర్వాత క్రమేపీ యధాస్థితికి చేరుకున్నదనే చెప్పొచ్చు. అందుకే దేశంలో ఈ రాక్షసక్రీడ చాపకింద నీరులా విస్తరిస్తూనే ఉన్నది. సంఘటనలు జరిగినప్పుడు పోలీసుల హడావుడి,నాలుగైదు రోజులపాటు నేతల పత్రికా ప్రకటనలు, ఆతర్వాత మరిచిపోతున్నారు.ఈ రాక్షసక్రీడ ఇంత వికృతరూపం దాలుస్తున్నా నిందితులకు సాక్ష్యాలతో న్యాయస్థానం ముందు నిలబెట్టి శిక్షలు వేయించలేకపోతున్నారంటే ఏమనుకోవాలి. ప్రాణ సమానంగా పెంచుకున్న తమబిడ్డలు తమ కళ్లముందే చదువు,సంస్కారం ఉందనుకున్న వింతపశువుల వికృతచేష్టలకు బలవుతుంటే ఆ గర్భశోకాన్నిఊహించగలమా?అదిఎప్పటికైనా తీరుతుందా?పాలక పెద్దలు ఇప్పటికైనా మనసుపెట్టి ఆలోచించాలి. రాజకీయాలకు అతీతంగా చర్యలుతీసుకోవాలి.ర్యాగింగ్‌కు పాల్పడేవారికి, ప్రోత్సహించేవారికి మాటలతోకాకుండా చర్యల ద్వారా తిరుగులేని హెచ్చరికలు అందించాలి. అప్పుడే ర్యాగింగ్ భూతాన్ని దేశంనుంచి పారద్రోలగలుగుతాం.చట్టాన్ని అమలు చేసే చిత్తశుద్ధిలేనప్పుడు,త్రికరణశుద్ధిగా ప్రయత్నం చేయలేనప్పుడు ఈ చట్టాలు, చర్చలు,అన్నీ నిష్ప్రయోజనమే. ●

# శరణార్థులకు కనీస మానవ హక్కులు వర్తించవా!


బి. మధుసూదన్

యుద్ధాలు, సంక్షోభాలు, హింసలు,పీడించడం, వాతావరణ ప్రతికూల మార్పులు, జాతి వివక్షలు, మత విద్వేషాలు, జాతీయత, కొన్ని సామాజిక లేదా రాజకీయ సంఘాల్లో సభ్యత్వాల కారణంగా ప్రాణ భయంతో మరో దేశానికి వెళ్లి శరణు కోరి ప్రాణాలు కాపాడుకునే ప్రత్యేక వ్యక్తులు లేదా సమూహాలను శరణార్థులుగా నిర్వచిస్తాం. నేరుగా మరో దేశంలో శరణార్థులుగా చేరే వారు, ఆశ్రమం పొందే వారు, అంతర్గతంగా స్థానభ్రంశం పొందిన వారు, ఏ దేశానికి చెందని వారు, అనేక ఏళ్ల తర్వాత తిరిగి తమ దేశానికి చేరిన వారందరూ శరణార్థుల జాబితాలోకి వస్తారు. శరణార్థులు, వారి పిల్లలు పడుతున్న అమానవీయ వేదనలను గుర్తించి ఐరాస తీసుకున్న నిర్ణయం ప్రకారం ప్రతి ఏటా 20 జూన్ రోజున ప్రపంచ శరణార్థి దినోత్సవాన్ని 2001 నుంచి పాటించడం జరుగుతోంది. మరో దేశం నుంచి ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని వచ్చిన శరణార్థులు కూడా సాధారణ మానవులే అని, వారికి కూడా కనీస మానవ హక్కులు వర్తిస్తాయని, వారిలో ధైర్యాన్ని నింపడం, వారి పిల్లలకు విద్య వసతులు విస్తరించాలని, ఆకలి చావుల కోరల్లో చిక్కకుండా చూసుకోవాలని ప్రపంచ దేశాలకు అవగాహన పరచడానికి ఈ వేదికలు ఉపయోగపడుతున్నాయి. 2026 ప్రపంచ శరణార్థి దినోత్సవం ఇతివృత్తంగా 'అందరు సురక్షితంగా ఉండే వరకు శరణార్థులకు సంఘీభావం ప్రకటిద్దాం' అనే అంశాన్ని నిర్ణయించారు. 2026 శరణార్థి వారం ఇతి వృత్తంగా 'సూపర్ పవర్‌గా పౌర సమాజం' అనే అంశాన్ని తీసుకున్నారు. శరణార్థులను కూడా సాధారణ పౌరులుగా చూడాలని, శత్రువులుగా భావించవద్దని ఐరాస సూచిస్తున్న ది. శరణార్థుల పట్ల సహానుభూతి చూపడం, కనీసమానవ




హక్కులను కల్పించడం, వారికి సంఘీభావంగా ప్రచారాలు నిర్వహించడం, వారి జీవిత కథలను వినడం, వారి అనుభవాలను అర్థం చేసుకోవడం, వారి పట్ల రాజకీయ ఏకీకరణ జరగడం, వారి అభ్యున్నతికి నిధులు కేటాయించడం, వారి మనోభావాలను అర్థం చేసుకోవడం లాంటివి నిత్యం కొనసాగాలి. భారత్‌లోకి శ్రీలంక, మయాన్మార్, అఫ్ఘానిస్థాన్, చిబెట్, బంగ్లాదేశ్ లాంటి ఇరుగు పొరుగు దేశాల నుంచి వేల మంది శరణార్థులు భారత భూభాగంలోకి శరణార్థులుగా చేరడం కొనసాగుతున్నది. శ్రీలంకన్ తమిళులు, రోహింగ్యాలు, టిబెటన్లు, చక్మాహాజోంగ్‌లు, జూయిష్ వర్గాలు అధిక సంఖ్యలో భారత్‌కు రావడం, శరణార్థులుగా జీవితాలను కొనసాగించుకోవడం జరుగుతూ కొన్నిసార్లు మన దేశంలో శాంతి భద్రతల సమస్యలకు కూడా కారణం అవుతున్నారని కూడా అవుతున్నారు. 2022 వివరాల ప్రకారం, భారత్‌లో 46,000 మంది, అందులో 22,509 మంది రోహింగ్యాలు కూడా శరణార్థులు నమోదు అయినట్లు గణాంకాలు తెలుపుతున్నాయి. భారత్‌లో చేరిన శరణార్థులు అధిక శాతం పట్టణ ప్రాంతాల్లో స్థిరపడి అసంఘటిత పనుల్లో నిమగ్నం అవుతున్నారు. శరణార్థి కుటుంబాలకు చెందిన పిల్లలు 7 శాతం మాత్రమే విద్య కొనసాగిస్తున్నారని, 87 శాతం శరణార్థులు అల్పాదాయ, మధ్యాదాయ దేశాల్లోనే జీవిస్తున్నారని తెలుసుకోవాలి. ప్రపంచ శరణార్థి దినోత్సవ వేదికగా నిజమైన శరణార్థులను గుర్తించి వారికి కనీస వసతులను కల్పించడం, దురుద్దేశంతో భారత్‌లోకి చేరిన శరణార్థులను ఏరిపారేయడం నిరంతరం జరగాలి. నిస్సహాయ స్థితుల్లో శరణార్థులుగా చేరిన వారి కుటుంబాలకు కనీస అవసరాలు తీర్చడం, సహానుభూతితో వారికి గొడుగు పట్టడం, వారి పిల్లలకు చదువుకునే అవకాశాలు కల్పించడం, మానవీయ కోణంలో అక్కున చేర్చుకోవడం, వారికి వైద్య ఆరోగ్య వసతులు కల్పించం, వారిని మానవులుగా గౌరవించడం, సమానత్వ భావనలను ఆచరించడం, కనీస సహకారాలను అందించడం కొనసాగాలి. ఊహించని సందర్భాల్లో పరాయి దేశంలోకి చేరిన శరణార్థులకు మానవ హక్కుల

# ప్రజాస్వామ్య సంస్థల స్వతంత్రత నేతిబీర చందమేనా?



పాపని నాగరాజు

అప్పటి ప్రధాని ఇందిరా గాంధీ ఎన్నికను చెల్లదని 1975 జూన్ 12న అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జగ్మోహన్ లాల్ సిన్హా ప్రకటించారు.మన దేశ ప్రజాస్వామ్య చరిత్రలో అది ఒక అసాధారణ ఘట్టం. దేశ అత్యున్నత రాజకీయ నాయకురాలి అధికారాన్ని ఒక న్యాయమూర్తి తీర్పు ప్రశ్నించింది. అనంతర రాజకీయ పరిణామాలు ఎమర్జెన్సీకి దారితీశాయి. ఎమర్జెన్సీ భారత ప్రజాస్వామ్య చరిత్రలో చీకటి అధ్యాయంగా నిలిచినా, అలహాబాద్ హైకోర్టు తీర్పుమాత్రం ప్రజాస్వా మ్య సంస్థల స్వతంత్రతకు చారిత్రక నిదర్శనంగా మిగిలిపోయింది. ప్రజాస్వామ్యంలో ఎన్నికలు మాత్రమే సరిపోవు. అధికారాన్ని ప్రశ్నించగల, నియంత్రించగల, రాజ్యాంగ పరిమితుల్లో ఉంచగల సంస్థలు కూడా అంతే అవసరం. ఎన్నికల సంఘం, న్యాయవ్యవస్థ, దర్యాప్తు సంస్థలు, సమాచార వ్యవస్థలు, ఇవన్నీప్రభుత్వానికి అనుబంధ విభాగాలు కాదు. ప్రజాస్వామ్య సమతుల్యతను కాపాడే రాజ్యాంగబద్ధ వ్యవస్థలు. అయితే గత కొన్నేళ్లుగా ఈ సంస్థల స్వతంత్రతపై దేశవ్యాప్తంగా చర్చజరుగుతోంది. ఎన్నికల సంఘం వ్యవహారశైలిపై ప్రతిపక్ష పార్టీలు, పౌర సమాజ సంస్థలు, మాజీ ఎన్నికల కమిషనర్లు ఆందోళనలు వ్యక్తం చేశారు. ఎన్నికల నిర్వహణ, ఎన్నికల నిబంధనల అమలు, అధికార పక్షం ప్రతిపక్షాల పట్ల వ్యవహరించే తీరుపై ప్రశ్నలు లేవనెత్తబడ్డాయి. దర్యాప్తు సంస్థలైన ఈడీ, సీబీఐల విషయంలో కూడా ఇలాంటి విమర్శలే వినిపిస్తున్నాయి. అవినీతి నిరోధక చర్యలు అవసరమే అయినప్పటికీ, ఈ సంస్థల చర్యలు ప్రతిపక్ష నేతలపైనే ఎక్కువగా కేంద్రీకృతమవుతున్నాయనే అభిప్రాయం దేశ రాజకీయ చర్చలో పదేపదే వ్యక్తమవు తోంది. అధికార పక్షానికి చేరిన కొందరు నేతలపై విచారణల వేగం మారడం వంటి పరిణామాలు ఈ విమర్శలకు మరింత బలం చేకూర్చాయి. అన్నింటికంటే ముఖ్యమైనది న్యాయవ్యవస్థ. ఎందుకంటే మిగతా అన్ని వ్యవస్థలు విఫల మైనా ప్రజాస్వామ్యానికి చివరి ఆశ్రయం న్యాయస్థానాలే. అయితే ఇటీవలి కాలంలో న్యాయవ్యవస్థ స్వతంత్రతపై కూడా ప్రశ్నలు లేవనెత్తబడుతున్నాయి. న్యాయమూర్తుల నియామకాల వ్యవహారం, కీలక రాజకీయ కేసుల విచారణ సమయం, ఎన్నికల బాండ్ల వ్యవహారం, ఆర్టికల్ 370 రద్దుకు సంబంధించిన విచారణ, పౌరహక్కులు, వ్యక్తిగత స్వేచ్ఛలకు సంబంధించిన కొన్ని కేసుల పరిణామాలు దేశంలో విస్తృత చర్చకు దారితీశాయి.



యూఏపీఏ కింద అరెస్టయిన కార్యకర్తలు, భీమా కోరేగావ్ కేసు నిందితులు, రాజకీయ అసమ్మతిని వ్యక్తం చేసిన వ్యక్తుల దీర్ఘకాల నిర్బంధం వంటి అంశాలపై పౌరహక్కుల సంఘాలు వ్యక్తం చేసిన ఆందోళనలు కూడా ఈ చర్చలో భాగమయ్యాయి. ఎమర్జెన్సీ అనంతరం మన దేశ ప్రజాస్వామ్యం కొన్ని కీలక పాఠాలు నేర్చుకుంది. అధికారాన్ని ఒకే వ్యక్తి లేదా ఒకే కేంద్రంలో కేంద్రీకరించడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకర మని దేశం గుర్తించింది. అందుకే 44వ రాజ్యాంగ సవరణ ద్వారా ఎమర్జెన్సీ అధికారాలపై కొన్ని పరిమితులు విధించబడ్డాయి. ప్రాథమిక హక్కులకు అదనపు రక్షణలు కల్పించబడ్డాయి. ప్రజాస్వామ్య వ్యవస్థలో అధికార కేంద్రీకరణను నియంత్రించే ప్రయత్నాలు జరిగాయి. అయితే చరిత్రలో తరచుగా జరిగే విధంగానే, ఒక దశలో అధికార దుర్వినియోగాన్ని నిరోధించేందుకు రూపొందించిన వ్యవస్థలనే తరువాతి పాలక వర్గాలు తమ అవసరాలకు అనుగుణంగా మలుచుకునే ప్రయత్నాలు చేస్తుంటాయి. చట్టాలు, సంస్థలు, రాజ్యాంగ పరిమితులు యథాతథంగా ఉన్నప్పటికీ, వాటి అమలు పద్ధతుల ద్వారా అధికార కేంద్రీకరణ మళ్లీ పెరగవచ్చు. అధికార కేంద్రీకరణ పెరిగే కొద్దీ సామాజిక వైవిధ్యానికి, ప్రాంతీయ స్వరాలకు, అట్టడుగు వర్గాల రాజకీయ ప్రాతినిధ్యానికి ఎదురయ్యే సవాళ్లు కూడా పెరుగుతాయి. ఈ పరిస్థితిని 1975 ఎమర్జెన్సీతో యథాతథంగా పోల్చడం సరైందికాదు కానీ అప్రకటితమైనది. అప్పట్లో ఎమర్జెన్సీ అధికారికంగా ప్రకటించబడింది. పత్రికలపై సెన్సార్ విధించబడింది. ప్రతిపక్ష నాయకులు జైలుకు పంపబడ్డారు. రాజ్యాంగ హక్కులు నిలిపివేయబడ్డాయి. ప్రజాస్వామ్యంపై దాడి ప్రత్యక్షంగా కనిపించింది నేడు పరిస్థితి భిన్నంగా ఉంది. ఎన్నికలు జరుగుతున్నాయి. పార్లమెంట్ పనిచేస్తోంది. కోర్టులు ఉన్నాయి. మీడియా ఉంది. ఎన్నికల సంఘం ఉంది. కానీ ఈసంస్థలు రూపంలో మాత్రమే స్వతంత్రంగా ఉన్నాయా? లేక వాస్తవంగా కూడా అధికారాన్ని ప్రశ్నించే స్థితిలో ఉన్నాయా? అనే ప్రశ్న దేశ రాజకీయ చర్చలో ప్రధాన అంశంగా మారింది. ప్రజాస్వామ్య వ్యవస్థలో అధికారాన్ని పరిమితం చేసే శక్తులు బలపడుతున్నాయా, బలహీనపడుతున్నాయా అన్నదే కీలకం. చరిత్ర చెబుతున్న పాఠం ఏమిటంటే, ప్రజాస్వామ్య సంస్థలు ఒక్కసారిగా కూలిపోవు. ముందుగా వాటి స్వతంత్రత క్షీణిస్తుంది. తరువాత వాటి ప్రతిష్ఠ దెబ్బతిం టుంది. చివరికి అవి ప్రజల కన్నా అధికారానికి ఎక్కువ జవాబుదారీగా మారే ప్రమాదం ఏర్పడుతుంది. 1975లో ఒక హైకోర్టు న్యాయమూర్తి తీర్పు దేశ ప్రధానమంత్రిని సవాలు చేయగలిగింది. నేడు ఎన్నికల సంఘం, దర్యాప్తు సంస్థలు, న్యాయవ్యవస్థ వంటి రాజ్యాంగబద్ధ సంస్థలు అధికారాన్ని అదే స్థాయిలో ప్రశ్నించగలవా? ఇదే భారత ప్రజాస్వామ్యం ముందున్న కీలక ప్రశ్న. ఎందుకంటే ప్రజాస్వామ్యానికి అసలు రక్షణ ఎన్నికల్లో కాదు అధికారా న్ని జవాబుదారీగా ఉంచగల

# అమెరికా, ఇరాన్ చర్చలకు బ్రేక్



## లెబనాన్‌పై ఆగని ఇజ్రాయెల్ దాడులు

## యుఎస్ ఉపాధ్యక్షుడు జెడి వాన్స్ పర్యటన రద్దు

## తుది ఒప్పందం కోసం 60 రోజుల ప్రక్రియ ఆరంభం

## చర్చల కొత్త తేదీ త్వరలో ప్రకటించే అవకాశం

**వాషింగ్టన్/దుబాయ్/జూరిచ్, జూన్ 19:** లెబనాన్‌లో ఘర్షణలు తీవ్రరూపం దాల్చడంతో, శుక్రవారం స్విట్జర్లాండ్‌లో జరగాల్సిన అమెరికా- ఇరాన్ చర్చలు రద్దయ్యాయి. ఇదిలా ఉండగా, స్విస్ పర్వత ప్రాంతంలోని బ్యూర్గెన్‌స్టాక్ రిసార్ట్‌లో ప్రారంభం కానున్న సాంకేతిక చర్చల సన్నాహాలు చాలా వరకు పూర్తయ్యాయని, అయితే తాను హాజరయ్యే ప్రణాళికలను విరమించుకున్నట్లు అమెరికా ఉపాధ్యక్షుడు జెడి వాన్స్ తన పర్యటనను వాయిదా వేసుకున్నారు. ఏర్పాట్లకు సంబంధించిన సమస్యల కారణంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు శ్వేతసౌధం వెల్లడించింది. శ్వేతసౌధం ప్రతినిధి మాట్లాడుతూ, 'ఉపాధ్యక్షుడు ఇప్పటికే చెప్పినట్లుగా సాంకేతిక చర్చల ప్రణాళికలు ఇంకా తుది రూపం దాల్చలేదు. అది పూర్తి కాగానే వెంటనే అమెరికా ప్రతినిధి బృందం బయలుదేరేందుకు సిద్ధంగా ఉంది. అయితే ఇలాంటి చర్చల ఏర్పాట్లు ఎప్పుడూ సంక్లిష్టంగానే ఉంటాయి. ప్రస్తుతం ఉపాధ్యక్షుడు ఈ రాత్రి స్విట్జర్లాండ్‌కు వెళ్లడం లేదు' అని తెలిపారు. అంతకు ముందు, టెహ్రాన్ ఆలోచనా విధానం తెలిసిన ఒక మూలం, ఇరాన్ ప్రధాన సంధానకర్త మొహమ్మద్ బాకర్ ఖాలిబాఫ్ హాజరయ్యే ప్రణాళికలో లేరని చెప్పింది. చర్చలు వాయిదా పడ్డాయని, చర్చలకు సహకరించేందుకు స్విట్జర్లాండ్ సిద్ధంగా ఉందని, సంబంధిత సన్నాహక పనులు కొనసాగుతున్నాయని స్విస్ విదేశాంగ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. దీంతో, మధ్యంతర ఒప్పందాన్ని మరింత శాశ్వతమైన మధ్యప్రాచ్య శాంతి ఒప్పందంగా మార్చేందుకు జరగాల్సిన చర్చల సమయంపై కొత్త అనిశ్చితి నెలకొంది. స్విట్జర్లాండ్‌లో జరగాల్సిన సమావేశం వాయిదా పడటంపై ఇరాన్ నాయకులు వెంటనే స్పందించలేదు. అయితే, సమగ్ర కాల్పుల విరమణ అమల్లోకి వస్తేనే తదుపరి చర్చలు సాధ్యమవుతాయని ఇరాన్ చెప్పినట్లు హిజ్బుల్లా శాసనసభ్యుడు హసన్ ఫద్లల్లా పేర్కొన్నారు.

లెబనాన్‌లో వైమానిక దాడుల్లో 18 మంది, హిజ్బుల్లా మిలిటెంట్ల చేతిలో నలుగురు ఇజ్రాయెల్ సైనికులు మరణించడంతో అక్కడ ఘర్షణలు తీవ్రరూపం దాల్చాయి. ఈ పరిణామం చర్చలపై తీవ్ర ప్రభావం చూపవచ్చు, ఎందుకంటే విస్తృతమైన అమెరికా-ఇరాన్ ఒప్పందానికి అక్కడ ఘర్షణలను ముగించడం ఒక షరతు. సమగ్ర కాల్పుల విరమణ లేకుండా అమెరికాతో చర్చలు కొనసాగలేవని, ఇజ్రాయెల్ తన దాడులను నిలిపివేసేలా చూడాల్సిన బాధ్యత వాషింగ్టన్‌దేనని ఇరాన్ తమ బృందానికి చెప్పిందని హిజ్బుల్లా సీనియర్ చట్టసభ్యుడు ఒకరు తెలిపారు.

అమెరికా- ఇరాన్ మధ్య కుదిరిన 14 అంశాల అవగాహన ఒప్పందం (ఎంఓయు) అమలుకు సంబంధించిన సాంకేతిక అంశాలను ఖరారు చేయడమే లక్ష ్యంగా శుక్రవారం స్విట్జర్లాండ్‌లోని జెనీ వాలో ఈ చర్చలు జరగాల్సి ఉంది. అయితే ప్రయా ణంపై వాన్స్ సందేహాలు వ్యక్తం చేయడంతో సమావేశం తేదీ ఇంకా ఖరారు కాలేదని ఇరాన్ ప్రతినిధులు తెలిపారు.

**తుది ఒప్పందం కోసం నిర్దేశించిన 60రోజుల ప్రక్రియ ప్రారంభం:** అమెరికా ఉపాధ్యక్షుడు జెడి వాన్స్ గురువారం వైట్ హౌస్‌లో మీడియా సమావేశంలో మాట్లాడుతూ, ఇరాన్‌తో కుదిరిన శాంతి ఒప్పందంలోని తొలిదశ అమలుకు అమెరికా పూర్తిగా కట్టుబడి ఉందన్నారు. అవగాహన ఒప్పందంలో పేర్కొన్న 60రోజుల గడువు గురువారం నుంచే ప్రారంభమైందని చెప్పారు. ఈ కాలంలో ఇరుపక్షాలు అణుకార్యక్రమం, ఆంక్షల సడలింపు, భద్రతాఏర్పాట్లు తదితర అంశాలపై సాంకేతిక స్థాయిలో చర్చలు జరపనున్నట్లు తెలిపారు.

**ట్రంప్ కీలక వ్యాఖ్యలు:** ఇరాన్‌తో కుదిరిన శాంతి ఒప్పందం నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. శాంతి స్థాపనకు అమెరికా పూర్తిగా కట్టుబడి ఉందని, జరుగుతున్న చర్చలు విజయవంతం కావాలంటే పశ్చిమాసియాలోని అన్ని పక్షాలు తమ నిబద్ధతను కొనసాగించాలని కోరారు. లెబనాన్, హిజ్బుల్లా, ఇజ్రాయెల్ సహా అన్ని రంగాల్లో సంపూర్ణ కాల్పుల విరమణ అమలవుతుందని ఆశాభావం వ్యక్తం చేసిన ట్రంప్, ఈ మేరకు తన సోషల్ మీడియా వేదిక 'ట్రూత్ సోషల్'లో పోస్టు చేశారు.

**ఉల్లంఘిస్తే తీవ్రంగా స్పందిస్తాం: ఇరాన్**

ఈ నేపథ్యంలో అమెరికాకు ఇరాన్ గట్టి హెచ్చరిక చేసింది. డీల్‌కు సంబంధించిన చర్చల నేపథ్యంలో అమెరికా దాని భాగస్వాములు దురుద్దేశంతో వ్యవహరించినా ఒప్పందాన్ని ఉల్లంఘించినా, మితిమీరిన డిమాండ్లు చేసినా తమ స్పందన తీవ్రంగా ఉంటుందని ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ ఘాలిబఫ్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్టు పెట్టారు. యుద్ధంలో ఇప్పటికే గట్టి దెబ్బ తిన్నారు. మళ్లీ అదే దారిలో నడిస్తే పరిస్థితి మరింత దారుణంగా ఉంటుందన్నారు.



## లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడి: 18 మంది మృతి

### అటు హిజ్బుల్లా చేతిలో నలుగురు ఇజ్రాయెల్ సైనికులు హతం

**టెల్‌అవీవ్/బీరుట్, జూన్ 19:** ఇజ్రాయెల్ గురువారంరాత్రి దక్షిణ లెబనాన్‌పై జరిపిన వరుస వైమానిక దాడుల్లో 18 మంది మరణించారు. అదే సమయంలో హిజ్బుల్లా చేతిలో నలుగురు ఇజ్రాయెల్ సైనికులు కూడా మరణించారు. ఇరాన్ మద్దతు ఉన్న సాయుధ సంస్థ హిజ్బుల్లాకు సంబంధించిన 80 లక్ష్యాలపై దాడి చేసి, దానిలోని "రద్వాన్ ఫోర్స్" సభ్యులను హతమార్చినట్లు ఇజ్రాయెల్ రక్షణ దళాలు (ఐడీఎఫ్) తెలిపాయి. మధ్యప్రాచ్యంలో సంఘర్షణను అంతం చేసే లక్ష ్యంతో, లెబనాన్‌లో శాశ్వత శత్రుత్వ విరమణతో సహా, అమెరికా-ఇరాన్ ఒక ఒప్పందంపై సంతకం చేసిన మరుసటి రోజే ఈ పరిణామం చోటుచేసుకుంది. ఒప్పందం ప్రకటించినప్పటి నుండి ఇజ్రాయెల్, హిజ్బుల్లా ఒకరిపై ఒకరు దాడులు చేసుకుంటున్నాయి. దక్షి ణ లెబనాన్‌లోని నబాటియే జిల్లాలో గురువారం రాత్రి జరిగిన బాంబు దాడులు యుద్ధంలోనే అత్యంత తీవ్రమైనవని లెబనాన్ ప్రభుత్వ వార్తా సంస్థ అభివర్ణించింది. ఈ దాడుల్లో కనీసం 18 మంది మరణించగా, 33 మంది గాయపడ్డారు. అనేక భవనాలు దెబ్బతిన్నాయి. దక్షి ణ లెబనాన్‌లో ఒక ఇజ్రాయెల్ బృందంపై తాము మెరుపుదాడి చేశామని, గైడెడ్ క్షి పణులతో మూడు ట్యాంకులను ధ్వంసం చేశామని, అలాగే సైనికులను రాకెట్, ఫిరంగి కాల్పులతో లక్ష ్యంగా చేసుకున్నామని హిజ్బుల్లా తెలిపింది. ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు నలుగురు సైనికుల మృతికి సంతా పం తెలిపారు. "హిజ్బుల్లాపై పూర్తి శక్తితో దాడి చేయాలని" తాను ఇజ్రాయెల్ రక్షణ దళాలను ఆదేశించినట్లు శుక్రవారం ఎక్స్ వేదికగా వెల్లడించారు. "నా ఆదేశం స్పష్టం: మా సైనికులపై గాని, మా భూభాగంపై గాని దాడులను ఇజ్రాయెల్ సహించదు. ఈ దాడులకు హిజ్బుల్లా నుండి చాలా భారీ మూల్యం వసూలు చేస్తుంది" అని ఆయన అన్నారు. "ఇజ్రాయెల్ దాడుల విస్తరణ ఒక ప్రమాదకరమైన, ఖండించదగిన ఉద్రిక్తతను పెంచడమే" అని లెబనాన్ అధ్యక్షుడు జోసెఫ్ఔన్ అన్నారు. "వీలైనంత త్వరగా సమగ్ర కాల్పుల

## అర్ధరాత్రి ఛత్తీస్‌గఢ్ సిఎం అత్యవసర కేబినెట్ సమావేశం

### కేబినెట్ శాఖల్లో మార్పులు,చేర్పుల కోసమేనన్న ప్రచారం

**రాయ్‌పూర్,జూన్ 19:** ముఖ్యమంత్రి ఆకస్మిక పిలుపుతో పలువురు మంత్రులు ఆయన అధికార నివాసానికి చేరుకున్నారు. అర్ధరాత్రి వరకు కేబినెట్ సమావేశాన్ని నిర్వహించారు. దీంతో మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ జరుగనున్నదా మంత్రుల శాఖలు మారబోతున్నాయా అన్న ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఛత్తీస్‌గఢ్ సీఎం విష్ణుదేవ్ సాయి, గురువారం సాయంత్రం ఆకస్మిక ఆదేశాలు జారీ చేశారు. మంత్రులందరిని తన అధికారిక నివాసానికి పిలిపించారు. దీంతో పలువురు మంత్రులు ముందుగా నిర్ణయించుకున్న తమ కార్యక్రమాలను రద్దు చేసుకున్నారు. హుటాహుటిన రాయ్‌పూర్‌కు తిరిగి వచ్చారు. గురువారం రాత్రి 10 గంటల సమయంలో సీఎం విష్ణుదేవ్ సాయి అధికార నివాసంలో కేబినెట్ సమావేశం ప్రారంభమైంది. శుక్రవారం తెల్లవారు జామున 1:40 గంటల వరకు ఇది కొనసాగింది. ఈ అసాధారణ మంత్రివర్గ సమావేశంలో ఉప ముఖ్యమంత్రులు, సీనియర్ మంత్రులతో పాటు బీజేపీ సంస్థాగత అగ్ర నాయకులు కూడా హాజరయ్యారు. దీంతో రాజకీయ వదంతులు జోరందుకున్నాయి. బీజేపీ పాలిత ఛత్తీస్‌గఢ్‌లో మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ జరుగుతున్నదా శాఖలు మారబోతున్నాయా పదవీకాలం మధ్యలోనే ప్రభుత్వ పనితీరుపై బీజేపీ నాయకత్వం అసంతృప్తిగా ఉన్నదా అన్న ఊహాగానాలు వెల్లువెత్తాయి. ఈ అత్యవసర మంత్రివర్గ సమావేశం అనంతరం ఉప ముఖ్యమంత్రి విజయ్ శర్మ మీడియాతో మాట్లాడారు. ఈ ఊహాగానాలకు తెరదించేందుకు ఆయన ప్రయత్నించారు. మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ అంశం చర్చ జరుగలేదని తెలిపారు. మరోవైపు తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నరసంవత్సరాలు పూర్తయిన సందర్భంగా పనితీరును సమీక్షించుకున్నామని, భవిష్యత్ పాలనకు సంబంధించిన ప్రాధాన్యతలపై చర్చించినట్లు బీజేపీవర్గాలు తెలిపాయి. ప్రభుత్వం ,బీజేపీ మధ్య సమన్వయ బలోపేతంతో పాటు ప్రధాని మోడీ అధికారంలోకివచ్చి 12 ఏళ్ల పూర్తయిన సందర్భంగా నిర్వహిస్తున్న కార్యక్రమాలను ఈ సమావేశంలో సమీక్షించినట్లు వెల్లడించాయి.

## అమెరికా కోసం ఇరాన్ 'కోవర్ట్ సెల్స్'



**టెహ్రాన్, జూన్ 19:** అమెరికా-ఇరాన్ యుద్ధానికి సంబంధించి ఓ సంచలన విషయం వెలుగులోకి వచ్చింది. ఇటీవల ఉద్రిక్తతల సమయంలో గల్ఫ్ దేశాల్లోని అమెరికా సైనిక స్థావరాలపై దాడులు జరిగిన సంగతి తెలిసిందే. ఈ దాడుల కోసం ఇరాన్ పక్కా ప్రణాళికతో కోవర్ట్ సెల్స్‌ను ఉపయోగించుకున్నట్లు తెలిసింది. ఈ మేరకు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ ఓ అంతర్జాతీయ మీడియా కథనం వెల్లడించింది. ఉద్రిక్తతల వేళ ఇరాక్‌లో ఈ కోవర్టు సెల్స్‌ను ఐఆర్‌జిసి ఏర్పాటు చేసినట్లు తెలిసింది. ఒక్కో యూనిట్‌లో దాదాపు 10 మంది ఇరాకీ ఫైటర్లను నియమించుకుందట. గల్ఫ్ దేశాల్లోని అమెరికా స్థావరాలను లక్ష్యంగా చేసుకోవడమే వీరి పని. ఈ సెల్స్‌ను ఉపయోగించే ఏప్రిల్ 20 నుంచి మే 15 మధ్య కువైట్, సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లోని యుఎస్ బేస్‌లపై దాడులు చేసినట్లు సదరు వర్గాలు వెల్లడించాయి. ఈ కోవర్ట్ యూనిట్ సభ్యులు బస్రా, సమావా నగరాల సమీపంలోని ఎడారి ప్రాంతాల నుంచి కనీసం ఏడుసార్లు డ్రోన్ దాడులు జరిపినట్లు పేర్కొన్నాయి. సాధారణంగా ఇరాక్‌లోని మిలీషియా గ్రూప్‌లతో టెహ్రాన్‌కు సత్సంబంధాలున్నాయి. ఇరాక్‌తోపాటు గాజా, లెబనాన్, యెమెన్ వంటి దేశాల్లో ఈ గ్రూప్ విస్తరించింది. గల్ఫ్‌దేశాల్లో ఐఆర్‌జిసి ఆపరేషన్లకు ఈ ముఠాలు కీలకంగా వ్యవహరిస్తాయి. అయితే, అమెరికా స్థావరాలపై దాడులకు మాత్రం ఈ మిలీషియా నెట్‌వర్క్‌ను ఇరాన్ ఉపయోగించుకోకుండా కోవర్ట్ సెల్స్‌ను ఏర్పాటు చేసుకోవడం చర్చనీయాంశంగా మారింది. ఇరాక్‌లోని ఇస్లామిక్ రెసిస్టెన్స్ గ్రూప్ సభ్యులను టెహ్రాన్ కోవర్టులుగా నియమించున్నట్లు సదరు కథనం వెల్లడించింది. ఈయూనిట్లలో ఇద్దరు ఇరాకీ మిలిటరీ అధికారులు, భద్రదతా సిబ్బంది, ఐదుగురు మిలీషియా కమాండర్లు కూడా ఉన్నట్లు తెలుస్తోంది.

## గెలుపు నాది.. ఓటమి వాన్స్‌ది: ట్రంప్ స్టైల్ క్లెయిమ్



**వాషింగ్టన్, జూన్ 19:** ఇరాన్‌తో ఒప్పందంపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌తో ఒప్పందం విఫలమైతే ఏం చేస్తారని మీడియా అడిగిన ప్రశ్నకు 'ఒప్పందం సఫలమైతే ఆ ఘనత నా ఖాతాలో వేసుకుంటా, విఫలమైతే ఆ నింద జెడి వాన్స్‌పై వేస్తా'నంటూ నవ్వుతూ బదులిచ్చారు. కాబట్టి ఈ విషయంలో జాగ్రత్తగా ఉండాలని ఉపాధ్యక్షుడికి సూచించారు. ఇరు దేశాల మధ్య కుదిరిన ఒప్పందంలో టెహ్రాన్ ఎలాంటి షరతులు విధించకుండానే లొంగిపోయిందని పేర్కొన్నారు. హర్మూజ్ మూసివేతతో ప్రపంచ వాణిజ్య మార్గాలకు అంతరాయం ఏర్పడటంతో ప్రపంచాన్ని ఆర్థిక సంక్షోభం బారి నుంచి కాపాడేందుకు తానే చర్చలకు ప్రాధాన్యం ఇచ్చినట్లు ట్రంప్ వెల్లడించారు. ఈ ఘర్షణ మరింత విస్తృత ఆర్థిక విపత్తుగా మారకుండా నివారించడానికే ఒప్పందం కుదుర్చుకున్నట్లు ట్రంప్ మీడియా సమావేశంలో పేర్కొన్నారు. తన శక్తికి, అధికారానికి పరిమితులు లేవని వ్యాఖ్యానించారు. మరోవైపు అమెరికా ఉపాధ్యక్షుడు జెడి వాన్స్ ఇజ్రాయెల్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రపంచంలో ఇజ్రాయెల్‌పై సాను భూతి ఉన్న ఏకైక దేశాధినేత ట్రంప్ మాత్రమేనని పేర్కొన్నారు. అమెరికా డబ్బుతోనే ఇజ్రాయెల్ అభివృద్ధి చెందుతోందన్నారు. తమ అతిపెద్ద సమస్య అమెరికా అధ్యక్షుడే అని ఇజ్రాయెల్‌లో ఎవరైనా అనుకుంటే వారు ఇప్పటికైనా మేల్కొని తమ దేశం ఎదుర్కొంటున్న వాస్తవ పరిస్థితిని గ్రహించాలని సూచించారు. ఇరాన్-అమెరికా చేసుకున్న ఒప్పందంలోని నిబంధనలను పాటించాల్సిన అవసరం లేదని ఇజ్రాయెల్ క్యాబినెట్‌లోని జాతీయ భద్రతా మంత్రి ఇటామర్ బెన్-గ్విర్ పేర్కొన్న నేపథ్యంలో జెడి వాన్స్ ఈ వ్యాఖ్యలు చేశారు.



## భార్యపై క్రూరమైన దాడి

## బలవంతంగా మూత్రం తాగించిన భర్త

**రాయ్‌పూర్,జూన్ 19:** విడిగా నివసిస్తున్న భార్యకు పలువురితో సంబంధం ఉన్నట్లు భర్త అనుమానించాడు. ఆమె ఇంటికి చేరుకుని పిల్లల ముందే దారుణంగా హింసించాడు. కాళ్లు, చేతులు కట్టేసి కొట్టాడు. జుట్టు కత్తిరించాడు. ఆమెతో బలవంతంగా మూత్రం తాగించాడు. ఛత్తీస్‌గఢ్‌లోని కోరియా జిల్లాలో తార, జితేంద్ర ఘసియా 15ఏళ్ల కిందట ప్రేమించుకుని పెళ్లి చేసుకున్నారు. వీరికి నలుగురు పిల్లలు ఉన్నారు. వైవాహిక విభేదాలు, భర్త వేధింపుల కారణంగా తార విడిగా జీవిస్తున్నది. ఇళ్లల్లో పనులు చేస్తూ పిల్లలను పోషిస్తున్నది. కష్టకాలంలో సహాయం చేసిన ఒక వ్యక్తి ఇంట్లో ఆమె నివసిస్తున్నది. ఈనెల 14న భార్య తార నివసిస్తున్న ఇంటికి భర్త జితేంద్ర చేరుకున్నాడు. మద్యం సేవించి వచ్చిన అతడు ఆమెను ఇంటి నుంచి బయటకు పిలిచి దూషించాడు. ఇతర వ్యక్తులతో సంబధాలున్నాయని ఆరోపించాడు. భార్య కాళ్లు, చేతులు కట్టేసి కొట్టాడు. పిల్లల ముందే ఆమెను హింసించాడు. జుట్టు కత్తిరించాడు. ముఖానికి నల్లరంగు, ఇంజిన్ ఆయిల్ పూశాడు. తన పిల్లలతో కూడా భార్య చెంపలపై కొట్టించాడు. పిల్లల్లో ఒకరితో మూత్రం తాగించాడు. అలాగే తన మూత్రాన్ని కూడా భార్యతో తాగించాడు. ఆమెను సజీవంగా తగులబెడతానని బెదిరించాడు. మరోవైపు భర్త దాడిలో తీవ్రంగా గాయపడిన తార పోలీసులకు ఫిర్యాదు చేసింది. తనకు న్యాయం కావాలని, భర్తకు శిక్ష పడాలని డిమాండ్ చేసింది. దీంతో పలు సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు. జితేంద్రను అరెస్ట్ చేశారు. అతడ్ని కోర్టులో హాజరుపర్చిన తర్వాత రిమాండ్ నిమిత్తం జైలుకు తరలించారు. జితేంద్ర తన భార్యను దారుణంగా కొట్టి హింసించిన వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.

### అయోధ్య విరాళాల్లో అవకతవకలు రుజువైతే

## ఎవరినీ వదిలిపెట్టం: యుపి సిఎం యోగి ఆదిత్యనాథ్

**అయోధ్య,జూన్ 19:** ఉత్తర ప్రదేశ్, అయోధ్యలోని రామ మందిరంలో విరాళాలకు సంబంధించి అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ స్పందించారు. నిందితులు ఎలాంటివారైనా, ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టేది లేదని హెచ్చరించారు. యోగి ఆదిత్యనాథ్ శుక్రవారం అయోధ్యలో పర్యటించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మాట్లాడారు. రామ భక్తుల మనోభావాలు దెబ్బతినేలా ప్రజలు ఎలాంటి వ్యాఖ్యలు చేయొద్దని ఆయన కోరారు. ఈ అంశంపై సిట్ దర్యాప్తు జరుపుతోందని, దీనికి సంబంధించి ఎవరివద్దనైనా ఆధారాలుంటే సిట్‌కు సమర్పించాలని ఆయన సూచించారు. ఆలయ ట్రస్ట్ వినతి మేరకు ఈ అంశంపై దర్యాప్తు జరిపేందుకు సిట్ ఏర్పాటు చేశామని, ఈ అంశంలోని విషయాల్ని సిట్ వెలుగులోకి తెస్తుందని భావిస్తున్నామని యోగి అన్నారు. భక్తులు కూడా ఆలయంపై



జరుగుతున్న అనేక దుష్ప్రచారాలను నమ్మకుండా సహనంతో ఉండాలని, ఆలయ ప్రతిష్టకు భంగం కలిగించే ప్రయత్నాలకు దూరంగా ఉంటూ, రాముడికి సంబంధించి గౌరవం, సహనం కలిగి ఉండాలని భక్తులను కోరారు. రామాలయ ఉద్యమాన్ని కాంగ్రెస్, ఎస్పీలు అడ్డుకుంటున్నాయని, గత ప్రభుత్వాలు రామ భక్తులకు, కర సేవకులకు వ్యతిరేకంగా చర్యలు తీసుకున్నారని యోగి గుర్తుచేశారు. గతంలో అయోధ్యలో రామాలయ నిర్మాణాన్ని అడ్డుకున్న కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు ఇక్కడి ఆలయంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నట్లు నటిస్తోందని, ఇది ఆ పార్టీ ద్వంద్వ ప్రమాణాలకు నిదర్శనం అన్నారు. రామాలయ ఉద్యమాన్ని కూడా కోర్టులో కాంగ్రెస్ పార్టీ అడ్డుకుందన్నారు. రామభక్తుల మనోభావాలు దెబ్బతిన్నాయంటున్న సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) గతంలో కరసేవకులపై కాల్పులు జరపాలంటూ ఆదేశించిందని, జై శ్రీరామ్ అన్నవారిపై దళాల్ని ప్రయోగించిందంటూ యోగి విమర్శించారు. అయోధ్యలోని రామ మందిరానికి వచ్చిన విరాళాల విషయంలో అవకతవకలు, అక్రమాలు జరిగాయనే విషయం తాజాగా వెల్లడైంది. భక్తులు సమర్పించిన కానుకలు దేవాలయానికి చెందకుండా కొందరు సిబ్బంది కాజేశారని తేలింది. దీనిపై ప్రస్తుతం సిట్ దర్యాప్తునకు ప్రభుత్వం ఆదేశించింది. ఈ విషయంలో కొన్ని ప్రాథమిక ఆధారాలు కూడా లభించాయి.

## కర్ణాటక ఎమ్మెల్సీ మొత్తం స్థానాలు కాంగ్రెస్‌కే


### పట్టు నిరూపించుకున్న సిఎం డికెశివకుమార్

**బెంగళూరు,జూన్ 19:** కర్ణాటక రాజకీయాల్లో అధికార కాంగ్రెస్ పార్టీ మరోసారి తన పట్టును నిరూపించుకుంది. ఈనెల 18న జరిగిన శాసనమండలి ద్వైవార్షిక ఎన్నికల్లో ప్రతిపక్ష బీజేపీ, జేడీఎస్ కూటమికి కోలుకోలేని షాక్ ఇస్తూ కాంగ్రెస్ పార్టీ ఐదు స్థానాలను కైవసం చేసుకుంది. 30వ తేదీతో ఖాళీ అవుతున్న 7 ఎమ్మెల్సీ స్థానాలకు జరిగిన ఈ ఎన్నికల్లో విపక్ష ఎన్డీఏ కూటమికి చెందిన పలువురు ఎమ్మెల్యేలు భారీగా క్రాస్ ఓటింగ్‌కు పాల్పడి కాంగ్రెస్ అభ్యర్థులకు ఓటు వేయడం సంచలనం సృష్టిస్తోంది. ఈ విజయంతో 75 స్థానాలున్న కర్ణాటక శాసనమండలిలో (ఎగువ సభ) కాంగ్రెస్ పార్టీ పూర్తి మెజారిటీని సాధించి, తన స్థానాన్ని మరింత సుస్థిరం చేసుకుంది. ఈ ఎన్నికల బరిలో నిలిచిన కాంగ్రెస్ అభ్యర్థులు తిప్పన్నప్ప కంక్నూర్, పీవీ మోహన్, బీకే హరిప్రసాద్,



శివన్న బీఎస్, వినయ్ కార్తీక్ ప్రకాశ్ అందరూ మొదటి రౌండ్‌లోనే ఘన విజయం సాధించారు. బీజేపీ తరఫున లింగరాజ్ పాటిల్, రఘు ఆర్ విజయం సాధించగా, జేడీఎస్ అభ్యర్థి గోవిందరాజు తీవ్ర పోటీ నడుమ ఓటమి పాలయ్యారు. అసెంబ్లీలో 135 మంది ఎమ్మెల్యేల బలం ఉన్న కాంగ్రెస్ పార్టీ, స్వతంత్రుల మద్దతుతో కలిపి సులభంగానే తన అభ్యర్థులను గెలిపించుకుంటుందని భావించారు. అందరి అంచనాలను తలకిందులు చేస్తూ కాంగ్రెస్ అభ్యర్థులకు ఏకంగా 151 ఓట్లు వచ్చాయి. బీజేపీకి చెందిన ముగ్గురు నుంచి ఏడుగురు, అలాగే జేడీఎస్‌కు చెందిన నలుగురు నుంచి ఏడుగురు ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌కు ఓటు వేసినట్లు తెలుస్తోంది. దీనివల్ల ఎన్డీఏ కూటమి ఆశించిన దానికంటే 12 ఓట్లు తక్కువగా నమోదయ్యాయి. ఈ ఘన విజయం నూతన ముఖ్యమంత్రి డీకే శివకుమార్, మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య నాయకత్వానికి దక్కిన పెద్ద విజయంగా కాంగ్రెస్ శ్రేణులు భావిస్తున్నాయి. ఫలితాల అనంతరం డీకే శివకుమార్ మాట్లాడుతూ తమ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల ప్రజాదరణ చూసి ప్రతిపక్ష ఎమ్మెల్యేలు తమ మనస్సాక్షి ఓటును కాంగ్రెస్‌కు వేశారని వ్యాఖ్యానించారు. ఇప్పటికే బీజేపీ నుంచి బహిష్కరణకు గురైన ఎస్టీ సోమశేఖర్, శివరామ్ హెబ్బార్ వంటి నాయకులు తమకు మద్దతు ఇచ్చారని ఆయన గుర్తుచేశారు. తమ కూటమిలో జరిగిన ఈ వెన్నుపోటుపై బీజేపీ, జేడీఎస్ అగ్రనాయకత్వం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. అంతర్గతంగా దర్యాప్తు జరిపి, క్రాస్ ఓటింగ్‌కు పాల్పడిన బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.

## చేతబడి చేస్తోందని పనిమనిషిని చంపేసిన డాక్టర్..



**న్యూఢిల్లీ,జూన్ 19:** దేశరాజధాని ఢిల్లీలో దారుణం జరిగింది. చేతబడి చేస్తుందనే అనుమానంతో ఒక డాక్టర్ తన ఇంట్లో పనిచేసే మహిళను దారుణంగా హత్య చేశాడు. హంతకుడైన డాక్టర్‌ను పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం ఢిల్లీలో డా.మనీష్ గుప్తా డెర్మటాలజిస్ట్‌గా పని చేస్తున్నాడు. అతడి భార్య టీనా గుప్తా కూడా డాక్టరే. వారి ఇంట్లో మీనా అనే మహిళ చాలాకాలంగా పని చేస్తుండేది. ఇటీవల ఆ ఇంట్లో కొన్ని మనస్పర్థలు తలెత్తాయి. మనీష్ గుప్తా మాటల్ని అతడి భార్య, కుటుంబ సభ్యులు పట్టించుకోవడం మానేశారు. కుటుంబ సభ్యులు తనను లెక్కచేయకుండా ఉండేందుకు, వారి ప్రవర్తన మారేందుకు పనిమనిషి మీనానే కారణం అని అతడు భావించాడు. ఇదే సమయంలో మీనాను పనిలోంచి తీసేయాలని కొంతకాలంగా భార్య, కుటుంబసభ్యులకు చెబుతూ వచ్చాడు. కానీ, వారు మనీష్ గుప్తా మాటల్ని పట్టించుకోలేదు. ఆమెనే పని మనిషిగా కొనసాగించారు. దీనంతటికీ పని మనిషి మీనానే కారణం అని భావించాడు. కుటుంబ సభ్యులు తన మాట వినకుండా ఆమె చేతబడి చేస్తోందని, ఇంట్లోకి ఆమె నెగెటివ్ ఎనర్జీని తెస్తుందని మనీష్ భావించాడు. దీంతో అతడు మీనాపై కోపం తెచ్చుకున్నాడు. మనీష్ గుప్తా భార్య టీనా గుప్తా ఇంటి నుంచి బయటకు వెళ్లింది. అదే సమయంలో పని మనిషి మీనా ఇంటికివచ్చింది. ఇంట్లో బట్టలు ఉతికి, ఆరేసేందుకు మేడపైకి వెళ్లింది. అప్పుడు ఇంట్లో మనీష్ ఒక్కడే ఉన్నాడు. అప్పటికే మీనాపై ఆగ్రహంతో ఉన్న మనీష్ మేడపై బట్టలు ఆరేస్తున్న మీనా వద్దకువెళ్లి బ్యాట్‌తో ఆమె తలపై బలంగా కొట్టాడు. దీంతో తీవ్రంగా గాయపడి కిందపడి గిలగిలా కొట్టుకోసాగింది. అయినా, ఆగకుండా ఆమెను పలుమార్లు కత్తితో పొడిచాడు. అటు తలకు గాయమై రక్తం కారడం,ఇటు అతడు కత్తితో పొడవడంతో మీనా రక్తపుమడుగులో పడిపోయింది. కొంతసేపటికి ఆమె మరణించింది. పోలీసులు వచ్చి అరెస్టు చేసేవరకు ఆమె మృతదేహం వద్దేఉండిపోయాడు. దీనిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు మనీష్ గుప్తాను అరెస్టు చేశారు.మీనా మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

# సంక్షిప్త వార్తలు

## రాహుల్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ప్రధాని మోడీ




**న్యూఢిల్లీ,జూన్ 19:** లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి ప్రధాని మోదీ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. దేవుడు ఆయనకు మంచి ఆరోగ్యం, దీర్ఘాయుష్షు ప్రసాదించాలని ఆకాంక్షించారు. శుక్రవారం రాహుల్ గాంధీ 56వ పుట్టినరోజు జరుపుకొంటున్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ సోషల్ మీడియా ఎక్స్‌లో ప్రత్యేక సందేశం పోస్టు చేశారు. లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్ గాంధీకి జన్మదిన శుభాకాంక్షలు. ఆయన మంచి ఆరోగ్యం, దీర్ఘాయుష్షుతో ఉండాలని ప్రార్థిస్తున్నాను అని మోదీ పేర్కొన్నారు. రాజకీయంగా తీవ్ర విభేదాలు ఉన్నప్పటికీ రాహుల్ గాంధీ పుట్టినరోజు సందర్భంగా ప్రధాని మోదీ శుభాకాంక్షలు తెలియజేయడం విశేషం. 1970 జూన్ 19న జన్మించిన రాహుల్ ప్రస్తుతం ఉత్తరప్రదేశ్‌లోని రాయ్‌బరేలీ నుంచి లోక్‌సభ సభ్యుడిగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. 2004లో అమేథీ నుంచి తొలిసారి లోక్‌సభకు ఎన్నికయ్యారు.

## పాక్‌పై అఫ్ఘాన్ దాడి: పలు ఉగ్రవాద శిబిరాలు ధ్వంసం



**కాబూల్, జూన్ 19:** పొరుగు దేశమైన పాకిస్థాన్‌లోని ఐసిస్ లక్ష్యాలపై తాము వైమానిక దాడులు జరిపినట్లు తాలిబన్ రక్షణ మంత్రిత్వ శాఖ శుక్రవారం తెలిపింది. బలూచిస్తాన్, ఖైబర్ పఖ్తూన్‌ఖ్వా ప్రావిన్సులలోని పలు స్థావరాలపై దాడులు జరిపినట్లు పేర్కొంది. బలూచిస్తాన్ ప్రావిన్సులోని ఖిలా అబ్దుల్లా జిల్లాలోని గులిస్తాన్ ప్రాంతంలో, చాగై జిల్లాలోని షకరాబ్ ప్రాంతంలో ఉన్న ఐసిస్‌ఖొరాసన్ (ఐసిస్‌కె) స్థావరాలను లక్ష ్యంగా చేసుకుని ఈ దాడులు జరిపినట్లు మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ఆఫ్ఘనిస్తాన్ లోపల దాడులకు ప్రణాళికలు రచించడానికి ఈ స్థావరాలను ఉపయోగిస్తున్నారని మంత్రిత్వ శాఖ ఆరోపించింది. పాకిస్థాన్‌లోని ఖైబర్ పఖ్తూన్‌ఖ్వాప్రావిన్సులోని ఒరక్జాయ్ జిల్లాలోని కంబర్ ఖేల్ ప్రాంతంలో కూడా అదనపు లక్ష్యాలపై దాడులు జరిపినట్లు, అవి ఐసిస్‌కెకు చెందినవని పేర్కొంది.

## మేకేదాటు ప్రాజెక్టుకు తమిళనాడు వ్యతిరేకం




**చెన్నై,జూన్ 19:** కావేరీ నదీ జలాల పంపిణీ విషయంలో కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల మధ్య దశాబ్దాలుగా సాగుతున్న వివాదం మేకెదాటు డ్యామ్ ప్రతిపాదనతో మరోసారి తీవ్రరూపం దాల్చింది. కర్ణాటక ప్రభుత్వం కావేరీ నదిపై మేకెదాటు వద్ద కొత్త డ్యామ్ నిర్మాణానికి జరుపుతున్న ప్రయత్నాలను తీవ్రంగా వ్యతిరేకిస్తూ శుక్రవారం తమిళనాడు అసెంబ్లీలో ముఖ్యమంత్రి విజయ్ ఒక కీలక తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఈ తీర్మానానికి అధికార పక్షంతో పాటు కాంగ్రెస్, వీసీకే, ఇతర రాజకీయ పక్షాలు పూర్తి మద్దతు ప్రకటించడంతో అసెంబ్లీ దీనిని ఏకగ్రీవంగా ఆమోదించింది. అసెంబ్లీలో తీర్మానాన్ని ప్రవేశపెట్టినసందర్భంగా విజయ్ మాట్లాడుతూ కర్ణాటక ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న మేకెదాటు ప్రాజెక్ట్ చట్ట విరుద్ధమని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్ట్ కావేరినదీ జలాల వివా దాల ట్రైబ్యునల్ ఇచ్చిన తుదిఅవార్డుతో పాటు, ఈ విషయమై గతంలో దేశ సర్వోన్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులను పూర్తిగా ఉల్లంఘిస్తోందని ఆయన స్పష్టం చేశారు.

## చీలికదిశగా శరద్‌పవార్ ఎన్సీపీ..

**ముంబై,జూన్ 19:** మహారాష్ట్రలో శివసేన (యూబీటీ) చుట్టూ రాజకీయ దుమా రం రేగుతుండగా తాజాగా శరద్ పవార్ ఎన్‌సీపీఎస్పీ సైతం ఆ దిశగానే వెళ్తున్నట్టు పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. శరద్ పవార్ వర్గానికి చెందిన పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు తమతో సంప్రదింపులు సాగిస్తున్నట్టు అజిత్ పవార్ నేషనలిస్ట్ పార్టీ బాంబు పేల్చింది. దీంతో ప్రస్తుతం శివసేన ఎదుర్కొంటున్న పరిస్థితినే ఎన్‌సీపీ ఎస్పీ ఎదుర్కొనే అవకాశం ఉందంటూ రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. శరద్ పవార్ పార్టీకి చెందిన పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు తమ పార్టీతో సంప్రదింపులు జరుపుతున్నట్టు ఎన్‌సీపీ సీనియర్ నేత, మహారాష్ట్ర మాజీ మంత్రి బాబా ధర్మారావు ఆత్రం వెల్లడించారు.

# రెండేళ్ల కూటమి పాలనలో ఆత్మకూరుకు అగ్రస్థానం



మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

**ఆత్మకూరు (నెల్లూరు), జూన్ 19 ప్రభాతవార్త:** రెండేళ్ళ ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వ పాలనలో ఆత్మకూరును అభివృద్ధి, సంక్షేమంలో అగ్రస్థానంలో నిలిపామని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం ఆత్మకూరు పట్టణంలోని శ్రీధర్ గార్డెన్స్‌లో నియోజకవర్గ ప్రజల ఆనందోత్సాహాల మధ్య రాష్ట్రంలో ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్ళు పూర్తయిన సందర్భంగా 'నమ్మకం.. అభివృద్ధి.. సంక్షేమం' విజయోత్సవ సంబరాలను మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ప్రారంభించారు. ప్రభుత్వ రెండేళ్ళ పాలనలో సాధించిన అభివృద్ధి, సంక్షేమ ఫలితాలను మంత్రి ప్రజలకు వివరించారు. ఈసందర్భంగా మంత్రి ఆనం మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ సూపర్ సిక్స్ పథకాలను సూపర్ హిట్ చేశామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన రెండేళ్ళలో ఆత్మకూరు నియోజకవర్గానికి సంక్షేమ కార్యక్రమాలకు 3,467.17 కోట్లు, అభివృద్ధి కార్యక్రమాలకు 3,084.53 కోట్లు వెచ్చించామని, మొత్తం 6,545.70 కోట్లతో రికార్డు స్థాయిలో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశామన్నారు. రైతుల హక్కులను కాపాడేందుకే గత ప్రభుత్వం తీసుకొచ్చిన ల్యాండ్ టైటిల్ యాక్ట్‌ను రద్దు చేశామని, ప్రభుత్వ రాజముద్రతో కూడిన నూతన పట్టాదారు పాస్ పుస్తకాలను రైతులకు అందిస్తున్నామని చెప్పారు. రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తూ అన్నదాత సుఖీభవ, పిఎం కిసాన్, పింఛన్లు, ఉచిత బస్సు ప్రయాణం, దీపం-2 , తల్లికి వందనం వంటి పథకాల ద్వారా వేలాది కుటుంబాలకు ప్రత్యక్ష లబ్ధి చేకూరిందన్నారు. దేవాదాయ శాఖ మంత్రిగా పనిచేయడం తనకు మహా భాగ్యంగా భావిస్తున్నానన్నారు. ముఖ్యమంత్రి దేవాదాయ శాఖకు సంబంధించి నిర్దేశించిన 11ప్రధాన వాగ్దానాల్లో ఇప్పటికే 10 వాగ్దానాలను అమలు చేశామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కోట్లాది రూపాయలతో 800లకు పైగా పురాతన ఆలయాల పునర్నిర్మాణం చేపడుతూ భగవత్ సంకల్పంతో ఆలయాలను ఆధ్యాత్మిక కేంద్రాలుగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఆత్మకూరు నియోజకవర్గంలో సాగునీటి రంగానికి అత్యంత ప్రాధాన్యతనిస్తున్నామని, సోమశిల హైలెవల్ కెనాల్ పనులను పూర్తిచేసి మర్రిపాడు వరకు సాగునీరు అందించడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. సోమశిల రిజర్వాయర్, సంగం బ్యారేజ్, ఎస్‌ఆర్ హైలెవల్ కెనాల్, కావలి కాలువ, కనిగిరి రిజర్వాయర్ వంటి కీలక ప్రాజెక్టుల పనులు వేగంగా కొనసాగుతున్నాయన్నారు.

ఆత్మకూరు మెట్టప్రాంతంలో పారిశ్రామికాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని మంత్రి పేర్కొన్నారు. మర్రిపాడులో 300ఎకరాల విస్తీర్ణంలో 500కోట్ల పెట్టుబడితో ఛత్తీస్‌గఢ్‌కు చెందిన పరిశ్రమ ఏర్పాటుకు ముందుకు వచ్చిందని దీంతో స్థానిక యువతకు పెదనద ఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు.

ఎంఎస్ఎంఇ పార్క్, ఆటోనగర్ ఏర్పాటు ద్వారా పారిశ్రామిక వాతావరణాన్ని మరింత బలోపేతం చేస్తున్నామన్నారు. ఆత్మకూరు పట్టణ అభివృద్ధిలో భాగంగా ఆటోనగర్, నగరవనం, క్రీడాప్రాంగణం వంటి ప్రాజెక్టులను మంజూరు చేశామని, మున్సిపాల్టీ పరిధిలో 75కోట్లతో మౌళిక వసతుల అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయన్నారు. నరగామీణాభివృద్ధికి పల్లె పండుగ కార్యక్రమాల కింద భారీ నిధులు కేటాయించి పనులు చేపడుతున్నామన్నారు.

గత రెండేళ్ళలో ప్రభుత్వంపై ప్రజల్లో నమ్మకం పెరిగిందని, అభివృద్ధి, సంక్షేమం అనే రెండు చక్రాలపై రాష్ట్రాన్ని ముందడుకు తీసుకెళుతున్నామని మంత్రి పేర్కొన్నారు. రాబోయే మూడేళ్ళలో మరింత వేగంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసి ఆత్మకూరు నియోజకవర్గాన్ని రాష్ట్రంలో ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి స్పష్టంచేశారు. తొలుత ఆర్‌డిఓ పావని, డిఎల్‌డిఓ రమణయ్యలు ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. పలువురు సంక్షేమ పథకాల లబ్ధిదారులు తమకు జరిగిన మంచిని వివరించారు. అనంతరం 28 మంది లబ్ధిదారులకు సుమారు 30లక్షలు విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులనఉ మంత్రి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మోడీతోనే మౌలిక సదుపాయాల పురోగతి



**తిరుపతి, జూన్ 19 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో 12యేళ్ళ ప్రగతి జాతీయభద్రత, మౌలిక సదూపాయాలు కల్పించబడ్డాయని బిజెపి నాయకులు తెలిపారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం 12యేళ్ల ప్రగతి సాధించిన సందర్భంగా తిరుపతి ఆర్టీసి బస్టాండ్‌లో ఎగ్జిబిషన్ ఏర్పాటుచేశారు. ప్రధానమంత్రి మోడీ దేశ పగ్గాలు చేపట్టి 12 సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంగా, దేశం సాధించిన అభివృద్ధి, సంక్షేమం, జాతీయ భద్రత, మౌలిక సదుపాయాల పురోగతిని ప్రజలకు వివరించే ప్రగతి ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేయడంతో సంక్షేమ పథకాలు ప్రజలకు తెలుస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో బిజెవైఎం జిల్లా అధ్యక్షుడు పార్థసారథి, బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దయాకర్‌రెడ్డి, తిరుపతి జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్, టిటిడి బోర్డు సభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డి, బిజెవైఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హరికృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పృథ్వీరెడ్డి, బిజెపి రాష్ట్ర మాజీ కార్యవర్గ సభ్యుడు గుండల గోపీనాథ్‌రెడ్డి, బిజెపి జిల్లా మైనార్టీ మోర్చా అధ్యక్షుడు ఎస్ మస్తాన్, తొండమనాటి సుబ్రహ్మణ్యం రెడ్డి, లోక ప్రభాకర్ నాయుడు, ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పల్లెకాపులకు త్వరలో పట్టాలు పంపిణీ



జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల

**ముత్తుకూరు (నెల్లూరు), జూన్ 19 ప్రభాతవార్త:** నెల్లూరు జిల్లాలోని ముత్తుకూరు మండలంలో వున్న పిడతా పోలూరులో గత 70 సంవత్సరాల నుంచి పంటలు సాగు చేసుకుంటున్న పల్లెకాపులకు త్వరలో పట్టాలు పంపిణీ చేస్తామని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల హామీ ఇచ్చారు. శుక్రవారం నెల్లూరు జిల్లాలో వినూత్నంగా ప్రారంభించిన పల్లె వీక్షణం కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా ముత్తుకూరు మండలం పిడతా పోలూరు గ్రామంలో నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ స్వయం సహాయక సంఘం ద్వారా సహజ ఎరువులను తయారు చేస్తున్న కళ్యాణికి ప్రభుత్వం తరఫునుంచి ఆర్థిక సహాయం చేయనున్నామని కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు.పిడతా పోలూరులోని కొన్ని కాలనీలలో లో విద్యుత్తును అధిగమించి రానున్న రెండు నెలలలో సరైన విద్యుత్తును అందించేలా చర్యలు తీసుకున్నామని కలెక్టర్ స్పష్టం చేశారు. అనంతరం స్థానిక సచివాలయం వద్ద ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. అధికారులు గ్రామంలో గుర్తించిన పలు సమస్యల గురించి జిల్లా కలెక్టర్‌కు వివరించారు. స్పందించిన కలెక్టర్ పలువురు గ్రామస్తులు తెలిపిన గ్రామ సమస్యలను సత్వరమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. అనంతరం పలువురు లబ్ధిదారులయిన పెంచలమ్మ, శీనయ్య తదితరులకు ఇళ్ల పట్టాలను అందజేశారు. వెంకటమ్మకు ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్‌ను అందజేశారు. తొలుత సచివాలయం వద్ద డిఆర్డిఏ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన స్టాల్‌ని తనిఖీ చేసి సంతృప్తిని వ్యక్తం చేశారు. స్వయం సహాయక గ్రూపు సంఘాలకు 4 లక్షల చెక్కు అందజేశారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు పిఎండిఎస్ విత్తనాలను అందజేశారు. అనిమల్ హస్బెండ్రీ శాఖ ద్వారా ఫీడర్ కిట్లను లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారి నాగ అనూష, డిఆర్డిఎపిడి నాగరాజ కుమారి, ఐటీడీఏ పీవో శ్రీనివాసరావు, జిల్లా వైద్యశాఖ అధికారి సుజాత, వ్యవసాయ శాఖ అధికారి సత్యవాణి, ఉద్యానవన శాఖ అధికారి సుబ్బారెడ్డి, ఏపీ ఎస్పీడీసీఎల్ ఎస్ ఈ రాఘవేంద్ర, డీఈవో బాలాజీ రావు, వివిధ శాఖల అధికారులు, మండల రెవెన్యూ అధికారి స్వప్న, మండల పరిషత్ అధికారి నాగమణి తదితరులు పాల్గొన్నారు.

## పోలీసుల దుర్మార్గాలపై పోరాటం ఆపం

● మాజీ మంత్రి అంబటి రాంబాబు

**విజయవాడ, జూన్ 19 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో సంచలనం సృష్టించిన విజయవాడ సాయికృష్ణ మిస్సింగ్ వ్యవహారం, అలాగే క్రాంతికుమార్ అనుమానాస్పద మృతి కేసులపై సిబిఐ చేత సమగ్ర విచారణ జరిపించాలని వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు డిమాండ్ చేశారు. శుక్రవారం తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్‌లో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో సాగుతున్న పోలీసుల దుర్మార్గాలపై తమ పోరాటం ఆగే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. సాయికృష్ణ ఇంటికి వైసీపీ అధినేత జగన్ వెళ్లి పరామర్శించే వరకు ఈ ప్రభుత్వం ఎందుకు స్పందించలేదని ఆయన నిలదీశారు. గత నెల 28వ తేదీనే అడ్వకేట్ కనకదుర్గ పోలీసులకు అధికారికంగా ఫిర్యాదు చేశారు. అయినా సరే బాధ్యులైన పోలీసులపై ఎందుకు కేసు నమోదు చేయలేదు? జగన్ ఆ కుటుంబానికి అండగా నిలబడేందుకు వెళ్తే తప్ప సీఐ మీద కేసు నమోదు చేయరా? అంటే రాష్ట్రంలో లాకప్ డెత్ జరిగిందని ప్రభుత్వం పరోక్షంగా అంగీకరించినట్లే కదా" అని ప్రశ్నించారు. సాయికృష్ణ పిన్ని కనకదుర్గ హైకోర్టులో పిల్ దాఖలు చేసిన తర్వాతే అసలు కథ ప్రారంభమైందని, కేవలం సిఐ నాగరాజును సస్పెండ్ చేసి చేతులు దులుపుకుంటే సరిపోదని మండిపడ్డారు. పేరుపోగు క్రాంతికుమార్ కూడా సదరు సిఐ పెట్టిన థర్డ్ డిగ్రీ టార్చర్ భరించలేకే ఆత్మహత్య చేసుకున్నాడని, ఈ రెండు మరణాల వెనుక సిఐతో పాటు ఇంకా చాలా మంది ఉన్నతాధికారుల హస్తం ఉందని, వారందరినీ ఈ కేసులో నిందితులుగా చేర్చాలని అంబటి రాంబాబు డిమాండ్ చేశారు.

సాయికృష్ణ మృతదేహానికి సంబంధించిన ఫోటోలు, కాళ్లపై ఉన్న గాయాల దృశ్యాలు ఫేక్ అంటూ జనసేన ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ చేస్తున్న ప్రచారాన్ని అంబటి రాంబాబు తీవ్రంగా తప్పుపట్టారు. "అవి ఫేక్ ఫోటోలు అయితే సాయికృష్ణను బతికుండగా చూపించండి. ఒకవేళ నేను చూపించిన ఆధారాలు తప్పు అయితే నాపై లీగల్‌గా కేసు పెట్టుకోండి. సాయికృష్ణ కేసులో తెరవెనుక ఉన్న పాత్రధారులంతా బయటకు రావాలని, అలాగే దళిత యువకుడు క్రాంతికుమార్ కుటుంబానికి కూడా ప్రభుత్వం తక్షణమే న్యాయం చేయాలని అంబటి రాంబాబు డిమాండ్ చేశారు.

## రాహుల్ నాయకత్వంలో దేశ ప్రగతి సాధ్యం

● అలిపిరిలో కొబ్బరికాయలు కొట్టిన కాంగ్రెస్ నేతలు



**తిరుపతి, జూన్ 19 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రతిపక్ష యువ నేత రాహుల్ గాంధీ నాయకత్వంలోని దేశ ప్రగతి, సుస్థిరిత సాధ్యమని కాంగ్రెస్ పార్టీ తిరుపతి అర్బన్ జిల్లా అధ్యక్షుడు గౌడపేర చిట్టిబాబు అన్నారు. శుక్రవారం రాహుల్ గాంధీ జన్మదినాన్ని పురస్కరించుకొని అలిపిరి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొబ్బరికాయలు కొట్టి తమ నేత రాహుల్ గాంధీకి ఆయురారోగ్యాలు ప్రసాదించాలని ప్రజా సమస్యలపై అధికార పార్టీని నిలదీసే శక్తి సామర్థ్యాలు కలగజేయాలని ప్రార్థిస్తూ మొక్కులు తీర్చుకున్నారు. 2029లో ప్రజాభిమానంతో భారతదేశ ప్రధానిగా రాహుల్ దేశ పగ్గాలు చేపడతారని విశ్వాసం వెలిబుచ్చుతూ ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. పిసిసి ఉపాధ్యక్షుడు దొడ్డారెడ్డి రాంభూపాల్ రెడ్డి, పిసిసి మాజీ ప్రధాన కార్యదర్శులు కంభంపాటి మురళీకృష్ణ, సుప్రజ, పార్టీ సీనియర్ నాయకుడు చిత్తూరు శివశంకర్ రాహుల్ గాంధీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు ముసీనా బేగం, ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షుడు శివ బాలాజీ, ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు జ్యోతీశ్వర్ నాయక్, తిరుపతి నగర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శులు ఆమూరి కృష్ణమూర్తి, పాల మండల శివకుమార్, కార్యదర్శులు తవన్ కుమార్, మోహన్, ఉపాధ్యక్షుడు గొడుగుచింత గోపి, కార్యవర్గ సభ్యుడు వాసు తదితరులు పాల్గొన్నారు.

## తిరుమల సమాచారం



### శ్రీవారి సేవలో హైకోర్టు జడ్జి గోపాలకృష్ణారావు

**తిరుమల, జూన్ 19 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గోపాలకృష్ణారావు కుటుంబంతో శుక్రవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు స్వాగతం పలికి స్వామివారి దర్శనం చేయించారు. అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు.



### కర్ణాటక అభివృద్ధికి శ్రీవారి ఆశీస్సులు కోరా

**తిరుమల, జూన్ 19 ప్రభాతవార్త ప్రతినిధి:** కర్ణాటక రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి కలియుగ ప్రత్యక్షదైవం ఏడు కొండల వేంకటేశ్వరస్వామి ఆశీస్సులు కోరానని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి డికె శివకుమార్ తెలిపారు. అందరికీ శుభాలు కలగాలని, స్వామివారి కటాక్షాలతో కర్ణాటక సస్య శ్యామలం కావాలని వేడుకున్నారు. కర్ణాటక సిఎం హోదాలో డికె శివకుమార్ శుక్రవారం వేకువజామున కుటుంబంతో కలసి ఆలయం వద్దకు చేరుకున్నారు. వైకుంఠమ్ 1 క్యూకాంప్లెక్స్ మీదుగా ఆలయ మహద్వారం వద్దకు రాగానే టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, సివిఎస్ఒ మురళీకృష్ణ, అర్చకులు స్వాగతం పలికారు. ఆలయంలోపల తొలుత ధ్వజస్తంభానికి నమస్కరించారు. అనంతరం ఆనందనిలయంలో శ్రీవారి అభిషేకసేవలో పాల్గొన్నారు. ఆలయ వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. అంతకుముందు రేణిగుంట విమానాశ్రయంలో శివకుమార్‌కు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు స్వాగతం పలికారు.

## 'తిరుమల విజన్ -2047' ప్రణాళికాబద్ధంగా అభివృద్ధిపై దృష్టి



**తిరుమల, జూన్ 19 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన హిందూ పుణ్యక్షేత్రం తిరుమలను "మోడల్ టౌన్"గా తీర్చిదిద్దే ప్రక్రియలో భాగంగా ప్రణాళికా బద్ధమైన అభివృద్ధి, పర్యావరణ నిర్వహణ, వారసత్వ పరిరక్షణపై దృష్టి సారించేందుకు "తిరుమల విజన్ -2047"టిటిడి అమలుచేస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లో "స్వర్ణాంధ్ర విజన్-2047"కి అనుగుణంగా పుణ్యక్షేత్రం తిరుమలను అన్ని విధాలా మరింత ఆధ్యాత్మికత ఉట్టిపడేలా తీర్చిదిద్దేందుకు వ్యూహాత్మక ప్రణాళికలు అమలుచేయనున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లావాసి, తిరుపతికి దగ్గరగా ఉన్న చంద్రగిరి నియోజకవర్గం నారావారిపల్లికి చెందిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చిన్నప్పటినుండే ఏడుకొండల వేంకటేశ్వరస్వామి పట్ల భక్తివిశ్వాసాలు కలిగి ఉన్నాడు. అదే విశ్వాసంతో దేవుని దర్శనం కోసం వచ్చే భక్తులకు మరింత ఆధ్యాత్మిక భావన కలిగించేలా తిరుమలను తీర్చిదిద్దాలనే సంకల్పం బలంగా ఉంది. ఇప్పటికే కొండపై గోవిందనామ స్మరణ తప్ప మరొకటి వినిపించకూడదని ఆదేశాలిచ్చారు. అంతేగాక రాజకీయ నాయకులకు ప్రత్యేక ప్రోటోకాల్, హంగు ఆర్భాటం ఉండకూడదని, తిరుమలలో రాజకీయ వ్యాఖ్యలు చేయరాదని ఇప్పటికే స్పష్టంగా తెలిపారు. తిరుమల అభివృద్ధిలో సాంప్రదాయాన్ని, ఆధునికతతో సమతుల్యం చేసుకోవాల్సిన అవసరాన్ని చంద్రబాబు తెలియజేశారు. తిరుమల ఆధ్యాత్మికం, పవిత్రత, సాంస్కృతిక వారసత్వాన్ని గౌరవించి ముందు చూపుతో భక్తులకు సౌకర్యాలు, వసతి, దర్శనాలను మెరుగుపరిచారు.

**విజన్‌డాక్యుమెంట్ -2047 లక్ష్యాలు:** ఆధునిక పట్టణ ప్రణాళిక నిబంధనలను అనుసరించి తిరుమల పవిత్రతను పెంపొందించేందుకు శాశ్వతమైన వ్యూహాలను అమలుచేయడం, ఉత్తమమైన ప్రణాళిక లు, వారసత్వ పరిరక్షణ, పర్యావరణ బాధ్యతలకు ప్రాధాన్యతనివ్వడం, ప్రపంచ వ్యాప్తంగా తిరుమలను రోల్ మోడల్‌గా తీర్చిదిద్దేందుకు టిటిడి ప్రయత్నిస్తోంది.

**ప్రణాళిక లక్ష్యాలు:** తిరుమల విజన్ -2047 ప్రణాళిక లక్ష్యాలను మోడల్ టౌన్‌తో మిళితం చేసి ఒక బృహత్తరమైనభవిష్య ప్రణాళికలను రూపొందించడం, తిరుమలలో రాబోవు తరాల్లో మరింత ఆధ్యాత్మిక, సాంస్కృతిక పవిత్రతను కాపాడటమే ప్రణాళిక లక్ష్యంగా నిర్దేశించారు.

ఇప్పటికే తిరుమల పట్టణ ప్రణాళికపై ప్రత్యేక దృష్టి పెట్టిన టిటిడి విజన్ డాక్యుమెంట్ అవసరాన్ని గుర్తించింది. టిటిడిలో ప్రత్యేకంగా అర్బన్ డెవలప్‌మెంట్ టౌన్ ప్లానింగ్ విభాగాన్ని ఏర్పాటు చేసింది. తిరుమలలో నిర్మితమవుతున్న భవనాలను టౌన్‌ప్లానింగ్ నిబంధనల ప్రకారం నిర్మించేలా చూస్తున్నారు. తిరుమల అభివృద్ధిపై దీర్ఘకాలిక ప్రణాళికలను సిద్ధంచేయడంలో భాగంగా ప్రస్తుత, భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని జోనల్ అభివృద్ధి ప్రణాళికను సవరించడం, తిరుమలలో పవిత్రతను కాపాడుతూ భక్తుల సౌకర్యాలను మెరుగుపరచడానికి వ్యూహాలను రూపొందిస్తున్నారు. వివరణ్మాతక నివేదికలు (డిపిఆర్‌లు), ప్రాముఖ్యత కలిగిన మౌళిక సదుపాయాలపై కార్యాచరణ ప్రణాళికలను తయారుచేయడం జరుగుతోంది.

## పద్మావతి అమ్మ తెప్పోత్సవాలకు ఏర్పాట్లు



**తిరుమల, జూన్ 19 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుచానూరు పద్మావతి అమ్మవారి తెప్పోత్స వాలు ఈనెల 25 నుండి 29 వరకు వైభవం గా నిర్వహించనున్నారు. ఈ ఏర్పాట్లను శుక్రవారం సాయంత్రం ఆలయ డిప్యూటీ ఇఒ పి.హరీంద్రనాథ్‌తో కలసి జెఇఒ డాక్టర్ శరత్ పరిశీలించారు. ఉత్స వాలకు విచ్చేసే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. తెప్పోత్స వాల్లో వినియోగించే తెప్పల ఫిట్‌నెస్‌ను పూర్తిగా పరిశీలించి ట్రయల్ రన్ నిర్వహించాలని సూచించారు. అలాగే విద్యుద్దీపాల కాంతుల తో, పుష్పాల అలంకరణలతో తెప్పలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాలని అధికారు లను ఆదేశించారు. ఉత్స వాల సందర్భంగా టిటిడి హిందూ ధర్మప్రచార పరిషత్, అన్నమా చార్య ప్రాజెక్టు, దాససాహిత్య ప్రాజెక్టుల ఆధ్వర్యంలో ప్రతిరోజూ భక్తి సంగీత కచేరీలు, ఆధ్యాత్మిక ప్రవచనాలు, భజనలు, కోలా టాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించ నున్నట్లు జెఇఒ డాక్టర్ శరత్ తెలిపారు. ఈ కార్యక్రమాలు భక్తులకు ఆధ్యాత్మికానందాన్ని పంచనున్నాయని పేర్కొన్నారు. అధిక సంఖ్యలో పాల్గొని పద్మావతి అమ్మవారి కృపాకటాక్షాలకు పాత్రులు కావాలని ఆయన భక్తులను కోరారు.

## తోతాపురికి రూ.18 చెల్లిస్తేనే రైతుకు గిట్టుబాటు!

**తిరుపతి, జూన్ 19 ప్రభాతవార్త ప్రతినిధి:** తోతాపురి మామిడికి రాష్ట్ర ప్రభుత్వం గత సంవత్సరం లాగే 4 రూపాయలు ప్రోత్సాహకంగా అందజేయడం హర్షదాయకమేనని, ప్రస్తుత పరిస్థితుల్లో రైతన్న ఆదుకునేందుకు ప్రోత్సాహకాన్ని ఆరు రూపాయలకు పెంచాలని ఎపి రైతు సంఘం, మామిడి రైతు సంఘం డిమాండ్ చేశాయి. శుక్రవారం తిరుపతి రైతు సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఎపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏ. రామానాయుడు, మామిడి రైతు సంఘం నాయకుడు డా. టి.జనార్ధన్, తిరుపతి రైతు సంఘం అధ్యక్షుడు జి.మునిరత్నం మాట్లాడుతూ ఈ సంవత్సరం తోతాపురికి 18 రూపాయలు చెల్లిస్తే తప్ప రైతుకు గిట్టుబాటు కాదని పేర్కొన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 40 వేల మంది మామిడి రైతుల సంక్షేమం దృష్ట్యా ప్రభుత్వం జిల్లా యంత్రాంగం మద్దతు ధర కల్పించి అమలు జేసే విషయంలో పటిష్టమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రైతు సంఘం ఉపాధ్యక్షుడు బాలకృష్ణ, రైతుసంఘం చిత్తూరు నేత శివారెడ్డి, తిరుపతి ఆర్గనైజింగ్ కార్యదర్శి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## రౌడీయిజాన్ని అరికట్టాం

● విజయోత్సవ సభలో ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి



విజయోత్స వ సభలో మాట్లాడుతున్న శాసనసభ్యుడు బొజ్జల సుధీర్‌రెడ్డి

**శ్రీకాళహస్తి, జూన్ 19 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తి నియోజకవర్గంలో రౌడీయిజాన్ని అరికట్టడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని శాసన సభ్యుడు బొజ్జల సుదీర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఓ కళ్యాణ మండపంలో కూటమి ప్రభుత్వం రెండేళ్ళ విజయోత్స వ సభను పట్టణ పార్టీ అధ్యక్షుడు జి.విజయకుమార్ నాయుడు సారధ్యంలో ఏర్పాటు చేసారు. ఈ సభకు ముఖ్యఅతిధులుగా జిల్లా పార్టీ అధ్యక్షురాలు పనబాక లక్ష్మీ, బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు కోలా ఆనంద్‌కుమార్, జనసేన ప్రతినిధి శ్రీకాళహస్తీశ్వ రాలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కొట్టెసాయి ప్రసాద్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోనూ, శ్రీకాళహస్తిలో రెండేళ్ళలో చేపట్టిన అభివృద్ధి, సంస్కరణలకు సంబంధించి వివరించారు. తాము అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజలకు శాంతిభద్రతలు అందించాలని కంకణం కట్టుకున్నామన్నారు. ఇది పేదల ప్రభుత్వం పేదల సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తుంది. రెండేళ్ళలో రాష్ట్ర రూపురేఖలు మార్చటానికి ప్రణాళికాబద్ధంగా పనిచేసాం. మరో మూడేళ్ళలో శ్రీకాళహస్తి రూపురేఖలు మారిపోతాయని వివరించారు. కూటమిలోని బిజెపి, జనసేన కలసి పనిచేస్తూ పుణ్యక్షేత్రం పేరు ప్రతిష్టలు ఇనుమడింపజేయుటకు కృషి చేస్తామన్నారు. ఈ విజయ సాధనలో తమ పార్టీల కార్యకర్తల సహకారం ఉందన్నారు.

## యోగాంధ్ర సాధనే లక్ష్యం



**శ్రీకాళహస్తి, జూన్ 19 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తీశ్వరాలయం, మున్సిపాలిటి సంయుక్తంగా నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమాలు శుక్రవారం పట్టణ ప్రజలను ఆకర్షించింది. రెండు శాఖలు ఈ నెల 21 వరకు యోగా సాధన కార్యక్రమాలను తమ కార్యాలయాల్లో నిర్వహిస్తున్నారు. శుక్రవారం శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి ముఖ్యఅతిధిగా హాజరయ్యే కార్యక్రమాలను రాజగోపురం సమీపంలో ఏర్పాటు చేసారు. మున్సిపల్ కమిషనర్ కెవి కృష్ణారెడ్డి, శ్రీకాళహస్తీశ్వరాలయ దేవస్థానం ఇఒ బికె వవెంకటేశు సారధ్యంలో ఏర్పాటు చేసారు. యోగ సాధకులు భారీ ఎత్తున హాజరయ్యారు. ఈ కార్యక్రమాల్లో బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్‌కుమార్, శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కొట్టె సాయిప్రసాద్ మున్సిపల్ దేవస్థానం సిబ్బంది, మెప్మా ప్రతినిధులు సుమారు 300కు పైగా పాల్గొన్నారు.

## మళ్లీ గందరగోళమే!



## సర్వదర్శన టైమ్‌స్లాట్ జారీలో తికమక

**తిరుమల, జూన్ 19 ప్రభాతవార్త ప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామి దర్శనార్థం విచ్చేస్తున్న సామాన్యభక్తులకు మరింత త్వరగా సమయం ప్రకారం దర్శనం చేయించేందుకు టిటిడి ఆఫ్‌లైన్‌లో జారీ చేసే టైమ్‌స్లాట్ టోకెన్లులో మళ్ళీ గందరగోళం నెలకొంది. గత మేనెల 1వ తేదీ నుండి జూన్ 15వరకు వేసవి సెలువులు కొనసాగడం, విపరీతంగా సామాన్యభక్తులు తిరుమలకు తరలిరావడంతో సామాన్యభక్తుల దర్శనాలకే టిటిడి ప్రాధాన్యతనిచ్చింది. ఈ నేపథ్యంలో సిఫార్సు లేఖలు కూడా నిలుపుదలచేసిన విషయం విదితమే. వేసవిసెలవుల విపరీత రద్దీతో ప్రతిరోజూ అర్ధగంట దాటిన తరువాత తిరుపతిలో ఆఫ్‌లైన్‌లో ఎస్ఎస్‌డి టైమ్‌స్లాట్ టోకెన్లు జారీ చేసేవారు.

అయితే వేసవిసెలవులు ముగియడంతో భక్తుల రద్దీ కొనసాగుతున్నా పలువురు భక్తులు ఏ సమయంలో టోకెన్లు ఇస్తారో తెలియక తికమకపడుతున్నారు. కొందరు ఉదయం టోకెన్లు జారీచేసే తిరుపతిలోని శ్రీనివాసం, విష్ణునివాసం, అలిపిరి భూదేవి కాంప్లెక్స్ వద్దకు చేరుకుని పడిగాపులు కాసే పరిస్థితి నెలకొంది. అంతేగాక రాత్రివేళ మరీ టోకెన్ల కోసం మధ్యాహ్నం 2గంటల నుండే బారులు తీరడం జరిగింది. దీంతో టిటిడి అధికారులు ఈ గందరగోళం పరిస్థితులు లేకుండా సాఫీగా దర్శనాల టోకెన్లు జారీకి చర్యలు తీసుకున్నారు. ఇదివరకు లాగా గాక శుక్రవారం నుండి ఆ మూడు ప్రాంతాల్లో అర్ధరాత్రి వేళ గాక పాత విధానంలో మధ్యాహ్నం 2 గంటల నుండి 4 గంటల మధ్య టైమ్‌స్లాట్ టోకెన్లు జారీచేస్తున్నారు. వారంలో నాలుగురోజులు 8వేల టోకెన్లు, వారాంతంలో 10వేల టోకెన్లు వరకు జారీచేస్తుంటారు.

ఈటోకన్లు ఇవ్వడం ప్రారంభించడంతో గందరగోళంతో తెలియక భక్తులు అధికశాతం సాయంత్రం కౌంటర్ల వద్దకు రావడం జరిగింది. ఈ విషయాన్ని టిటిడి ముందుగా ప్రకటించక పోవడంతో భక్తులు అసహనం చెందారు.

## అంతర్‌రాష్ట్ర దొంగలముఠా అరెస్టు

● రూ.24 లక్షల విలువైన ఆభరణాలు స్వాధీనం



**బంగారుపాళ్యం, జూన్ 19 ప్రభాతవార్త:** బంగారుపాళ్యం పరిసర ప్రాంతాల్లో వరుస ఇంటి దొంగతనాలకు పాల్పడి భారీగా నగలుతో పాటు నగదును దోచుకున్న అంతర్‌రాష్ట్ర దొంగల ముఠాను బంగారుపాళ్యం పోలీసులు శనివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇటీవల బంగారుపాళ్యం, పలమనేరు పరిసరాల్లో పెద్దఎత్తున ఇళ్లల్లో దొంగతనాలు జరిగాయి. ఈ మేరకు బంగారుపాళ్యం పోలీసుస్టేషన్‌లో ఇళ్ళ దొంగతనాలపై పలు కేసులు నమోదయ్యారు. ఈ మేరకు కేసులు నమోదు చేసిన బంగారుపాళ్యం పోలీసులు ఎస్పీ తుషార్ డూడి ఆదేశాల మేరకు దర్యాప్తు రంగంలోకి దిగారు. సర్కిల్ ఇన్స్‌పెక్టర్ శ్రీనివాసరావు పర్యవేక్షణలో పోలీసులు బృందాలుగా ఏర్పడి దర్యాప్తు ప్రారంభించారు. ఈ క్రమంలో బంగారుపాళ్యం పాలేరు వంతెన సమీపంలో ఎస్ఐ ప్రసాద్ సిబ్బందితో కలసి శుక్రవారం తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానస్పదంగా సంచరిస్తూ పారిపోవడానికి ప్రయత్నించిన ముగ్గురు నిందితులను గుర్తించి అదుపులోకి తీసుకుని విచారించారు. ఈ మేరకు ఈ విచారణలో పట్టుబడిన ముగ్గురు నిందితులు తమిళనాడు రాష్టంకు చెందిన అంతర్‌రాష్ట్ర దొంగలని, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్‌లో పగటిపూట తాళం వేసి వున్న ఇళ్ళను లక్ష్యంగా చేసుకుని తాము వరుస దొంగతనాలకు పాల్పడుతున్నట్లు అంగీకరించారు. ఈ కేసుకు సంబంధించి ప్రధాన నిందితుడైన తమిళనాడు వానియంబాడికి చెందిన డ్రైవర్ ఆర్.గాడ్విన్‌మోసెస్(33), డ్రైవర్ ఎస్.మురుగన్(37), వి.విగ్నేష్(26)లను పోలీసులు అరెస్టు చేశారు. వీరి నుండి సుమారు 24 లక్షల రూపాయల విలువైన 181.5 గ్రాముల బంగారు అభరణాలు, రూ.80 వేల విలువైన 307 గ్రాముల వెండి ఆభరణాలు, రూ.2.5 లక్షల విలువైన ఒక కారు, రూ.50 వేల విలువైన ఒక స్కూటీని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు గాడ్విన్‌మోసెస్‌పై తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో అనేక దొంగతనాల కేసులు నమోదై పెండింగ్‌లో వున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ కేసు చేధించడంలో ప్రతిభ కనబరచిన బంగారుపాళ్యం పోలీస్ స్టేషన్ అధికారులు, సిబ్బందిని ఎస్పీ తుషార్ డూడి అభినందించారు.

## సాయికృష్ణ మృతిపై ఎన్‌హెచ్‌ఆర్‌సికి ఫిర్యాదు



**విజయవాడ, జూన్ 19 ప్రభాతవార్త ప్రతినిధి:** విజయవాడలో చోటుచేసుకున్న గడే సాయికృష్ణ అనుమానాస్పద మరణం, పి. క్రాంతికుమార్ ఆత్మహత్య ఘటనలపై జాతీయ మానవ హక్కుల కమిషన్ తక్షణం జోక్యం చేసుకుని స్వతంత్ర, నిష్పాక్షిక విచారణ చేపట్టాలని తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి, గుమ్మా తనూజా రాణిలు కోరారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం ఎన్‌హెచ్‌ఆర్‌సీ చైర్‌పర్సన్‌కు ఫిర్యాదు చేశారు. సాయికృష్ణ మరణం కస్టడీ హింస అనుమానాలకు తావిస్తున్నదని, పోలీసు కస్టడీలో తమ బిడ్డ హింసకు గురయ్యాడని కుటుంబ సభ్యులు చెప్పడం చూస్తుంటే ఈ అంశం తీవ్ర ఆందోళన కలిగిస్తుందని ఎంపీ పేర్కొన్నారు. ఈ ఘటనకు సంబంధించిన అరెస్ట్, నిర్బంధం, వైద్య పరీక్షలు, సీసీటీవీ దృశ్యాలు, పోస్టుమార్టం నివేదికలు తదితర అన్ని ఆధారాలను పరిశీలించి పూర్తి స్థాయి విచారణ జరపాలని కోరారు. అలాగే విజయవాడకు చెందిన పి.క్రాంతి కుమార్ మరణానికి ముందు విడుదలైన వీడియోలో కృష్ణలంక సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు తనపై నిరంతరం వేధింపులకు పాల్పడ్డారని ఆరోపించిన విషయాన్ని ఎంపీ ఎన్‌హెచ్‌ఆర్‌సీ దృష్టికి తీసుకెళ్లారు. ఈ వీడియోతో పాటు మొబైల్ ఫోన్, కాల్‌డేటా రికార్డులు, ఇతర డిజిటల్ ఆధారాలను భద్రపరిచి ఫోరెన్సిక్ పరీక్షలు నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. బాధిత కుటుంబాలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవడంతో పాటు మానవ హక్కుల ఉల్లంఘనలకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన ఎన్‌హెచ్‌ఆర్‌సీని కోరారు.

## సత్ఫలితాల దిశగా పోలీసుల చర్యలు

●మాదకద్రవ్యాల వినియోగంపై టెస్టలల్లో నెగెటివ్ ఫలితాలు



**తిరుపతి, జూన్ 19 ప్రభాతవార్త:** తిరుపతిజిల్లాను మాదకద్రవ్యాల రహితంగా తీర్చిదిద్దడంతో బాటు గంజాయి అనే పదం వినిపించకుండా తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలనిస్తున్నాయి. ఇందులో భాగంగా మాదకద్రవ్యాల వినియోగించారా అనే కోణంలో శుక్రవారం విద్యార్థులకు, యువతకు చేపట్టిన తనిఖీల్లో పూర్తిగా 300మందికి నెగెటివ్ ఫలితాలు రావడంతో విద్యాసంస్థల్లో అవగాహన సదస్సులు మంచిగా ఉన్నాయని తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు తెలిపారు. రాష్ట్ర డిజిపి హరీష్ కుమార్ గుప్తా ఆదేశాలతో తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు పర్యవేక్షణలో జిల్లా వ్యాప్తంగా గంజాయి ఇతర మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రత్యేక చర్యలు కొనసాగుతున్నాయి. శుక్రవారం మధ్యాహ్నం తిరుపతి డిఎస్పీ భక్తవత్సలం ఆధ్వర్యంలో యువతను మత్తు పదార్థాల బారిన పడకుండా కాపాడడం, విద్యార్థుల్లో అవగాహన పెంపొందించడం లక్ష్యంగా నెహ్రూ మునిసిపల్ హైస్కూల్‌లో మెగా గంజాయి నిర్ధారణ పరీక్షల కార్యక్రమాన్ని నిర్వహించారు. తిరుపతి సబ్ డివిజన్ పరిధిలోని ఈస్ట్, వెస్ట్, అలిపిరి, ఎస్వీయూ పోలీస్ స్టేషన్ల సిబ్బంది సమన్వయంతో మొత్తం 300 మంది విద్యార్థులకు బయోచెక్ కిట్ల ద్వారా గంజాయి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఈస్ట్ పోలీస్ స్టేషన్ పరిధిలో 84 మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించగా, అందరి ఫలితాలు నెగెటివ్‌గా నమోదయ్యాయి. అలిపిరి పోలీస్ స్టేషన్ పరిధిలో 93 మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించగా, ఇద్దరు విద్యార్థులు పాజిటివ్‌గా గుర్తించబడ్డారు. వెస్ట్ పోలీస్ స్టేషన్ పరిధిలో 87 మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించగా, అందరి ఫలితాలు నెగెటివ్‌గా నమోదయ్యాయి. ఎస్వీయూ పోలీస్ స్టేషన్ పరిధిలో 36 మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించగా, అందరి ఫలితాలు నెగెటివ్‌గా నమోదయ్యాయి.మత్తు పదార్థాల వినియోగానికి అలవాటు పడిన వ్యక్తులకు ప్రత్యేక కౌన్సిలింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుపతి ఈస్ట్ సబ్ డివిజన్ పోలీసులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచిస్తూ వారితో ప్రత్యేక ప్రమాణం చేయించారు. రెండోసారి మాదకద్రవ్యాల వినియోగం అక్రమ కార్యకలాపాల్లో పాల్గొంటే కఠిన చర్యలు తప్పవుఅని హెచ్చరించారు.

ప్రజల భాగస్వామ్యం, తల్లిదండ్రులు, విద్యాసంస్థలు పోలీస్ శాఖ సమిష్టి కృషితోనే డ్రగ్స్ ఫ్రీ తిరుపతి జిల్లా లక్ష్యాన్ని సాధించగలమని ఎస్పీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి డిఎస్పీ భక్తవత్సలం, సిఐలు రామ్ కిషోర్ (అలిపిరి), రామకృష్ణ (వెస్ట్), శ్రీనివాసులు (ఈస్ట్), ఈగల్

# చంద్రబాబు దేశరాజకీయాల్లో విశిష్ట నాయకుడు

## గన్నవరంలో రాందేవ్‌బాబాకు ఘనస్వాగతం



**గన్నవరం, జూన్ 19 ప్రభాతవార్త:** రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దేశ రాజకీయాల్లో విశిష్ట నాయకుడని, ఆయన నిజాయతీ, కృషి , దూరదృష్టి దేశానికి ఆదర్శమని ప్రముఖ యోగాగురువు రాందేవ్ బాబా కొనియాడారు. ఈనెల 21వతేదీ అమరావతిలో జరిగే అంతర్జాతీయ యోగా కార్యక్రమంలో పాల్గొనేందుకు శుక్రవారం విమానంలో గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్న రాందేవ్ బాబా మీడియాతో మాట్లాడుతూ దేశ రాజకీయాల్లో చంద్రబాబు హిమాలయ పర్వతం అంతటి గొప్ప నాయకుడని చంద్రబాబుపై ప్రశంసల వర్షం కురిపించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పట్ల తనకు ప్రత్యేకమైన అభిమానం, ప్రేమ ఉన్నాయని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌కు రావటం ఆనందంగా ఉందని ఈరాష్ట్రం ప్రకృతి రిత్యా, సంస్కృతి పరంగానూ, ఎంతో ఆధ్యాత్మికత కలిగిన రాష్ట్రంగా అభివర్ణించారు. యోగా ద్వారా ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని పేర్కొన్న ఆయన కరో యోగా- రహో నిరోగ్ అనే సందేశాన్ని ప్రజలకు అందించారు. యోగా ప్రతిఒక్కరి జీవితంలో భాగం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం ఆయన రోడ్డు మార్గాన గుంటూరు తరలి వెళ్ళారు.

**విమానాశ్రయంలో ఘనస్వాగతం:** అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా అమరావతిలో జరుగనున్న యోగా కార్యక్రమంలో పాల్గొనేందుకు గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్న యోగా గురువు రాందేవ్ బాబాకు గన్నవరం విమానాశ్రయంలో పలువురు అధికారులు ఘనస్వాగతం పలికారు.

శుక్రవారం సాయంత్రం ఆయన డెహ్రాడూన్ నుండి ప్రత్యేక విమానంలో గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్నారు. ప్రభుత్వ సలహాదారు మంతెన సత్యన్నారాయణ రాజు, రాష్ట్ర వైద్యఆరోగ్య శాఖ జాయింట్ సెక్రటరీ గోపాలకృష్ణ రోణంకి, సెకండరీ హెల్త్ డైరెక్టర్ కె.వి.ఎన్. చక్రధరబాబు, కృష్ణాజిల్లా కలెక్టర్ డి.కె. బాలాజీ, ఎస్పీ విద్యాసాగర్ నాయుడు, గుడివాడ ఆర్డీఓ బాలసుబ్రమణ్యం తదితరులు విమానాశ్రయంలో రాందేవ్ బాబాకు పుష్పగుచ్చాలు అందించి స్వాగతం పలికారు.

# ప్రతి ఒక్కరి జీవితంలో యోగా భాగం కావాలి



**విజయవాడ, జూన్ 19 ప్రభాతవార్త:** ప్రతి ఒక్కరి జీవితంలోనూ యోగా భాగం కావాలని ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశా పేర్కొన్నారు. యోగాంధ్ర 2026 కార్యక్రమంలో భాగంగా విజయవాడ బిఆర్‌టిఎస్ రోడ్డులో శుక్రవారం ప్రభుత్వ ఉద్యోగుల థీమ్ యోగా జరిగింది. ఈకార్యక్రమంలో కలెక్టర్ లక్ష్మీశా, ఏపిఎన్‌జీఓ రాష్ట్ర అధ్యక్షులు ఏ.విద్యాసాగర్ వివిధ ప్రభుత్వశాఖల ఉద్యోగులతో కలిసి యోగసాధన చేసారు. 45 నిముషాల పాటు సరళ యోగా ప్రోటోకాల్ ప్రకారం యోగా ఆసనాలు వేసారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని వర్గాల జీవితాల్లోనూ యోగాను భాగం చేసేందుకు నిత్యయోగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లావ్యాప్తంగా ప్రతిగ్రామంలోనూ యోగా శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. ఉద్యోగులతో కలిసి యోగసాధన చేయటం ఆనందంగా ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. ఏపిఎన్‌జీఓ రాష్ట్ర అధ్యక్షులు విద్యాసాగర్ మాట్లాడుతూ యోగా శారీరక వ్యాయామం మాత్రమే కాకుండా మానసిక, భావోద్వేగ, ఆధ్యాత్మిక, వికాసానికి దోహదపడే సమగ్ర జీవన విధానంగా పేర్కొన్నారు. ఉద్యోగులు నిత్యం యోగసాధన చేయటం ద్వారా ఒత్తిడిని అధిగమించవచ్చన్నారు. ఈనెల 21వతేదీ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా కోటిమందితో యోగా కార్యక్రమం నిర్వహణకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసిందని, ఇందులో ప్రభుత్వ ఉద్యోగులు పెద్దఎత్తున పాల్గొంటున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏపిఎన్‌జీఓ ప్రధాన కార్యదర్శి డి.వి.రమణ, తదితరులు పాల్గొన్నారు.

## మహిళా కానిస్టేబుల్ వేధింపులు ఎపిఎస్‌పి జవాన్ ఆత్మహత్య

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, జూన్ 19 ప్రభాతవార్త:** తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో ఏపీఎస్పీ కానిస్టేబుల్ ఆత్మహత్య కలకలం రేపింది. గోదావరిపై రోడ్ కమ్ రైల్ బ్రిడ్జి దూకుతున్నట్టు తెలిపిన కానిస్టేబుల్ చంద్రమళ్ళ వంశీ నిన్న అర్థరాత్రి 1గంట కు తండ్రికి ఫోన్ చేశారు. ఆపై ఫోన్ స్విచ్ఛాఫ్ రావడంతో వంశీ బంధువులు,పోలీసులు బ్రిడ్జిపై వెతికారు.కానిస్టేబుల్ బైక్, చెప్పులు గుర్తించి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కానిస్టేబుల్ మృతదేహం కోసం గోదావరిలో వెతుకుతున్నారు. ఎస్డీఆర్ఎఫ్, పోలీస్ బృందాలు బోట్లలో తిరుగుతూ ముమ్మరంగా గాలిస్తున్నారు. రాజానగరం మండలం శ్రీరాంపురానికి చెందిన కాకినాడ ఏపీఎస్పీ 3వ బెటాలియన్‌లో విధులు నిర్వర్తిస్తున్నాడు. కానిస్టేబుల్ చంద్రమళ్ల వంశీ ప్రస్తుతం సెలవుల్లో ఉన్నారు. తన కుమారుణ్ని మహిళా కానిస్టేబుల్ వేధించి నట్లు అతడి తండ్రి చెబుతున్నారు. ఆ వేధింపుల వల్లే ఆత్మహత్య చేసుకుంటున్నట్లు కుమారుడు ఫోన్‌లో చెప్పినట్లు సమాచారం. అయితే తండ్రి చెప్పినట్లు వంశీ ఆత్మహత్య చేసుకున్నాడా లేక మరేదైనా జరిగిందా అన్నది తేలాల్సి వుంది.

## కూతుర్లను చంపి తండ్రి ఆత్మహత్య

ప్రకాశం జిల్లా అగ్రహారంలో విషాదం

**చీమకుర్తి, జూన్ 19 ప్రభాతవార్త:** ముగ్గురు కూతుర్ల పాలిట ఓ తండ్రి కాలయముడయ్యాడు. ముగ్గురు కూతుర్లను చంపి, తాను ఉరిపోసుకొని చనిపోయాడు. ప్రకాశం జిల్లా చీమకుర్తి మండలం కాండూరు వారి అగ్రహారంలో శుక్రవారం ఈ ఘోర విషాదం చోటుచేసుకుంది. మృతులు తండ్రి ఎకుల సుధాకర్ (35), కుమార్తెలు గోచిత (13), పూజిత (11), లోకిత శ్రీ(8)గా గుర్తించారు.

ప్రాథమికంగా అందిన సమాచారం ప్రకారం ఏకుల సుధాకర్ తన కుమార్తెలు ముగ్గురిపై విష ప్రయోగం చేసి, మరణించారని నిర్ధారించుకున్న తర్వాత సమీప పొలంలోకి వెళ్లి ఒక చెట్టుకు ఉరిపోసుకొని మరణించాడని పోలీసులు చెబుతున్నారు.

చీమకుర్తిలోని ఓ గ్రానైట్ క్వారీలో డ్రైవర్గా పనిచేస్తున్న సుధాకర్ తన భార్యతో మూడేళ్లుగా విడిపోయి ఉంటున్నారు. వారి ఇరువురిమధ్య కోర్టులో కేసు కూడా నడుస్తున్నట్టు సమాచారం తెలుస్తోంది. ఈ నేపథ్యంలో కుటుంబ కలహాలు మనసులో పెట్టుకొని, తన కుమార్తెలు ముగ్గురిని చంపి తాను కూడా చనిపోయినట్లుగా స్థానికుల అభిప్రాయపడుతున్నారు.

ఒంగోలు డిఎస్పి రాయపాటి శ్రీనివాసరావు ఈ విషయమై మాట్లాడుతూ కేసు దర్యాప్తు చేస్తున్నామని, పోస్టుమార్టం నివేదిక వచ్చిన తర్వాత అసలైన వాస్తవాలు వెలుగు చూస్తాయని అంటున్నారు. ఒంగోలు సీఐ దాసరి ప్రసాద్, తాసిల్దార్ ఆర్ బ్రహ్మయ్యలు సంఘటన స్థానిక వెళ్లి పరిస్థితిని అంచనా వేస్తున్నారు.

ఒకే కుటుంబంలో నలుగురు మరణించడంతో కాండూరి వారి అగ్రహారం శోకసంద్రమైంది. ఈ ప్రాంతంలో సంచలనం రేకెత్తించింది.



## ఎపిఎల్‌లో భీమవరం బుల్స్ బుల్లెట్ విక్టరీ

● రేవంత్ రెడ్డి శతకంతో విజయవాడకు షాక్ ● విజయవాడ సన్ షైనర్స్ భారీ స్కోరు వృథా

● 126 పరుగుల విధ్వంసక ఇన్నింగ్స్‌తో ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా రేవంత్ రెడ్డి



**కడప (స్పోర్ట్స్), జూన్ 19 ప్రభాతవార్త:** ఏపీఎల్-2026 సీజన్-5లో భాగంగా కడప వైఎస్సార్ రాజారెడ్డి స్టేడియం వేదికగా జరుగుతున్న టోర్నీలో మూడో రోజు తొలి మ్యాచ్ ఉత్కంఠగా సాగింది. భీమవరం బుల్స్, విజయవాడ సన్‌షైనర్స్ జట్ల మధ్య జరిగిన పోరులో భీమవరం బుల్స్ అద్భుత విజయాన్ని అందుకుంది. టాస్ గెలిచిన భీమవరం బుల్స్ తొలుత బౌలింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్‌కు దిగిన విజయవాడ సన్‌షైనర్స్ జట్టు ఓపెనర్లు శుభారంభం అందించారు. 10 ఓవర్లకు ఒక వికెట్ నష్టంతో 124 పరుగులు చేసిన విజయవాడ జట్టు భారీ స్కోరు దిశగా సాగింది. ఓపెనర్ అశ్విన్ హెబ్బార్ 29 బంతుల్లో 73 పరుగులతో (11 ఫోర్లు, 3 సిక్సర్లు) మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. జహీర్ అబ్బాస్ 25 బంతుల్లో 48 పరుగులు, హర్షవర్ధన్ 23 బంతుల్లో 33 పరుగులతో రాణించారు. దీంతో విజయవాడ సన్‌షైనర్స్ 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 212 పరుగుల భారీ లక్ష్యాన్ని భీమవరం ముందు ఉంచింది. భీమవరం బౌలర్లలో పీవీఎస్ఎన్ రాజు 3 వికెట్లు పడగొట్టగా, సీహెచ్ రవితేజ, బి. యశ్వంత్ చెరో రెండు వికెట్లు సాధించారు.

212 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భీమవరం బుల్స్‌కు ఆరంభంలోనే ఎదురుదెబ్బ తగిలింది. ఓపెనర్ హేమంత్ రెడ్డి త్వరగా పెవిలియన్ చేరినా మరో ఓపెనర్ కే. రేవంత్ రెడ్డి బ్యాట్‌తో విధ్వంసం సృష్టించాడు. 61 బంతుల్లో 126 పరుగులతో అద్భుత శతకం నమోదు చేసి బౌండరీల వర్షం కురిపించాడు. మరోవైపు మిడిల్ ఆర్డర్ బ్యాటర్ రవికిరణ్ 24 బంతుల్లో 46 పరుగులు (3 ఫోర్లు, 4 సిక్సర్లు) చేసి జట్టుకు అండగా నిలిచాడు. వీరిద్దరి దూకుడుతో భీమవరం బుల్స్ 17.3 ఓవర్లలోనే 3 వికెట్ల నష్టానికి 218 పరుగులు చేసి ఘన విజయం సాధించింది. విజయవాడ సన్‌షైనర్స్ భారీ స్కోరు సాధించినప్పటికీ భీమవరం బ్యాటర్ల దూకుడుకు నిలువలేకపోయింది. అద్భుత శతకంతో జట్టును గెలిపించిన కే. రేవంత్ రెడ్డికి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది. మ్యాచ్ ఆసాంతం ప్రేక్షకులను శహరీ బ్యాండ్ అందరిని అలరించింది.

# కూటమి విజయోత్సవ సభ సక్సెస్

● జెసి ప్రభాకర్ రెడ్డి హల్‌చల్ ● సభ నిర్వహణలో అస్తవ్యస్తం

**అనంతపురం, జులై 19 ప్రభాతవార్త బ్యూరో:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లయిన సందర్భంగా అనంతపురంలో శుక్రవారం నిర్వహించిన విజయోత్సవ సభ సక్సెస్ అయింది. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలి వచ్చారు. తెలుగుదేశం, జనసేన, బిజెపి నాయకులు హాజరయ్యారు. తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యేలు పోటీపడి టిడిపి కార్యకర్తలు అభిమానులు తరలించారు. తాడపత్రి మాజీ మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి పెద్ద ఎత్తున వాహనాలతో టిడిపి కార్యకర్తలు అభిమానులను సభకు తీసుకురావడమే కాకుండా ముందుగా వచ్చి తాడపత్రి ప్రాంత వాసులు కూర్చుండే విధంగాచేశారు. ఉరవకొండ, కళ్యాణదుర్గం, రాయదుర్గం తదితర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున కార్యకర్తలు, నాయకులు విజయోత్సవ సభకు వచ్చినప్పటికీ వెనకవైపు కూర్చోవాల్సి వచ్చింది. సభా వేదిక చిన్నది కావడంతో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కార్యకర్తలు, అభిమానులు సభ వెలుపలే రోడ్ల పైన ఉండిపోవాల్సి వచ్చింది. సభాస్థలంలో కూర్చోనీకి స్థలం లేక రోడ్లలో నిలబడి అనేక అవస్థలకు గురయ్యారు. కనీసం సభలో తమ నేతల మాట్లాడిన ప్రసంగాలు వినేందుకు కూడా సరిగా అవకాశాలు లేక టిడిపి కార్యకర్తలు ఇబ్బంది పడ్డారు. పల్లెల నుంచి కష్టపడి ఇక్కడికి వస్తే ఏటికి వద్ద సరైన సౌకర్యాలు కల్పించలేదని పరుగులు టిడిపి కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేశారు. వాహనాలను కూడా సరిగా అనుమతించకుండా పోలీసులు కూడా కొన్నిచోట్ల ఇబ్బంది పెట్టినట్లు టిడిపి కార్యకర్తలు అభిప్రాయపడ్డారు. ఎక్కడైనా విశాలమైన వేదికను ఏర్పాటు చేసి ఉంటే బాగుండేదని, సభ నిర్వహణ పక్క ప్రణాళిక ప్రకారం లేదని అభిప్రాయపడిన వారు ఉన్నారు. ఇదిలా ఉండగా అనంతపురం టిడిపి జిల్లా అధ్యక్షుడు పూల నాగరాజు అధ్యక్షతన కక్కనపల్లి రోడ్ లో రాజశేఖర్ రెడ్డి కన్వెన్షన్ హాల్లో శుక్రవారం జరిగిన ఈ విజయోత్సవ సభలో జిల్లా ఇన్చార్జి మంత్రి టీజీ భరత్, మంత్రి పయ్యావుల కేశవ్, రాష్ట్ర ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, తాడపత్రి మాజీ మున్సిపల్ చైర్మన్ జేసి ప్రభాకర్ రెడ్డి,ఎమ్మెల్యేలు సురేంద్రబాబు, గుమ్మనూరు జయరాం, దగ్గుబాటి ప్రసాద్, బండారి శ్రావణి, జనసేన జిల్లా అధ్యక్షులు టిసి వరుణ్, బిజెపి నేత సంధి రెడ్డి శ్రీనివాసులు, తదితర టిడిపి, జనసేన, బిజెపి జిల్లా నాయకులు, వివిధ కార్పొరేషన్ చైర్మన్లు, డైరెక్టర్లు పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ ఆనంద్ తోపాటు వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ అమలు చేస్తున్న పథకాల వివరిస్తూ వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు స్టాల్స్ ఏర్పాటు చేశారు. సభ మొదట్లో వివిధ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు చేసిన చేసిన సాంస్కృతి కార్యక్రమాలు అదుర్స్ అనిపించాయి. విద్యార్థులు చేసిన వివిధ నృత్య రూపకాలు, యోగా కార్యక్రమాలు ఆద్యంతం ఆకట్టుకున్నాయి. జనం మధ్యలో జేసీ ప్రభాకర్ రెడ్డి. స్థానిక నీలం రాజశేఖర్ రెడ్డి కన్వెన్షన్ హాల్లో జరిగిన కూటమి ప్రభుత్వ విజయోత్సవ సభలో తాడపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి తన ప్రత్యేకతను చాటుకున్నాడు. సభ ప్రారంభం కాకముందే తాడపత్రి ప్రాంతం నుంచి కార్యకర్తలు, అభిమానులతో పెద్ద ఎత్తున తరలివచ్చి సభలో జనం మధ్యలో కూర్చున్నారు. సభ ప్రారంభంలో వేదిక వేదిక పైన చిన్నారులు డాన్స్ చేస్తుంటే జేసీ ప్రభాకర్ ని కూడా జనం మధ్య కూర్చుని ఆహా భావాలు ప్రదర్శించారు. దీంతో కెమెరాలన్నీ అటువైపు తిరిగాయి. సభ లో కార్యకర్తలు అభిమానులు కేరింతలు కొట్టారు.. ఈ సమయంలో టిడిపి జిల్లా అధ్యక్షులు పూల నాగరాజు, ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి చొరవ తీసుకొని జనం మధ్యలోకి వెళ్లి జేసీ ప్రభాకర్ రెడ్డికి నచ్చజెప్పి వేదిక ముందుకు తీసుకొచ్చారు. ముఖ్యులంతా వేదికపైకి వచ్చి సభ ప్రారంభమైనప్పటికీ మళ్లీ జెసి ప్రభాకర్ రెడ్డి వేదిక పైకి రాకుండా ఉండిపోవడంతో జిల్లా ఇంచార్జ్ మంత్రి టీజీ భరత్ కిందికి వెళ్లి యూసీ ప్రభాకర్ రెడ్డిని వేదిక పైకి తీసుకొచ్చారు. ఆ తర్వాత సజావుగా సాగింది.. ఈనెల 24 నుంచి 40 రోజులు పాటు జిల్లా వ్యాప్తంగా సీఎం చంద్రబాబు నాయుడు నేతృత్వంలో కూటమి ప్రభుత్వ రెండేళ్ల కాలంలో సాధించిన విజయాలను ప్రజలకు తెలియజెప్పాలని సభలో నేతలు పిలుపునిచ్చారు.



జనం మధ్యలో కూర్చున్న తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే జెసి ప్రభాకర్ రెడ్డి

## సమాచార శాఖ జెడిగా వెంకటేశ్వర ప్రసాద్



**విజయవాడ, జూన్ 19 ప్రభాతవార్త ప్రతినిధి:** సమాచార పౌర సంబంధాల శాఖ విజయవాడ కమిషనరేట్‌లో శుక్రవారం జాయింట్ డైరెక్టర్‌గా ముమ్మడి వెంకటేశ్వర ప్రసాద్ అధికార బాధ్యతలు స్వీకరించారు. అనంతరం వెలగపూడి రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర సమాచార పౌరసంబంధాల శాఖ సంచాలకులు కె.ఎస్. విశ్వనాథన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా సంచాలకులు కె.ఎస్. విశ్వనాథన్ ముమ్మడి వెంకటేశ్వర ప్రసాద్‌కు శుభాకాంక్షలు తెలియజేసి, నూతన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి, సంచాలకులు కె.ఎస్.విశ్వనాథన్ మార్గనిర్దేశంలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, ప్రజా సంక్షేమ పథకాలను ప్రజలకు విస్తృతంగా చేరవేసేందుకు వివిధ ప్రసార మాధ్యమాల ద్వారా ప్రచార కార్యక్రమాలు నిర్వహించేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

## మాజీ మంత్రి అమర్‌నాథ్‌కు మహిళా కమిషన్ నోటీసులు

**విజయవాడ, జూన్ 19 ప్రభాతవార్త ప్రతినిధి:** వైఎస్సార్సీపీ నేత గుడివాడ అమర్‌నాథ్‌కు మహిళా కమిషన్ నోటీసులు జారీ చేసింది. హోంమంత్రిపై చేసిన అనుచిత వ్యాఖ్యలపై గుడివాడ అమర్‌నాథ్‌పై సుమోటోగా కేస నమోదయ్యింది. ఈ నెల 24న కమిషన్ ఎదుట హాజరుకావాలని నోటీసులో పేర్కొన్నారు. తమ ఎదుట హాజరై వివరణ ఇచ్చి, ఆధారాలు సమర్పించాలని, గడువులోగా స్పందించకుంటే వీడియోల ఆధారంగా చర్యలు ఉంటాయని కమిషన్ తెలిపింది. హోంమంత్రి అనితపై మాజీ మంత్రి చేసిన అనుచిత వ్యాఖ్యలపై ఇప్పటికే పలు ప్రాంతాలనుంచి మహిళా కమీషన్‌కు ఫిర్యాదులు అందాయి. కమీషన్ చైర్మన్ సైతం అనితపై గుడివాడ అమర్‌నాథ్ చేసిన అనుచిత విమర్శలను ఖండించారు.

## రైతాంగ సమస్యలపై 30న చలో విజయవాడ

● సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు హరినాథ్ రెడ్డి పిలుపు



**తిరుపతి, జూన్ 19 ప్రభాతవార్త ప్రతినిధి:** రైతాంగ సమస్యలపై ఈ నెల 30 వ తేదీ రైతులు చేపట్టిన చలో విజయవాడ కార్యక్రమానికి పార్టీ, ప్రజాసంఘాల నాయకులు వేలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలి అని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పి. హరినాథ్ రెడ్డి పిలుపునిచ్చారు. సిపిఐ తిరుపతి జిల్లా సమితి సమావేశం శుక్రవారం ఉదయం చిన్నం కాలయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి మంత్రి అతిథిగా హాజరైన పి.హరినాథ్ రెడ్డి మాట్లాడుతూ రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వాలు విఫలమైందన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఏ .రామానాయుడు మాట్లాడుతూ ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మామిడికి గిట్టుబాటు ధర లేక వేలాది మంది రైతులు తీవ్రంగా నష్టపోయారని అన్నారు. రైతు సంఘం ఉద్యమం అనంతరం ప్రభుత్వం దిగివచ్చి టన్నుకు 4వేలు ఇస్తామని ప్రకటించడం ప్రార్థిస్తున్నామని పేర్కొన్నారు. అదేవిధంగా ఇదివరకే మామిడి పంట దిగుబడిని తీసివేసిన రైతులను కూడా ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ తిరుపతి జిల్లా కార్యదర్శి పి మురళి, జిల్లా కార్యవర్గ సభ్యులు, సమితి సభ్యులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ ప్రైవేటీకరణను అడ్డుకుంటాం: జెఎసి




**తిరుపతి (రవాణ), జూన్ 19 ప్రభాతవార్త:** ఏపీఎస్ఆర్టీసీలో విద్యుత్ బస్సుల నిర్వహణను ప్రైవేట్ ఆపరేటర్లకు అప్పగించే ప్రభుత్వ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని ఆర్టీసీ ఉద్యోగ సంఘాల జేఏసీ డిమాండ్ చేసింది. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు చేపడతామని జేఏసీ రాష్ట్ర కన్వీనర్లు వై.శ్రీనివాసరావు, జి.వి.నరసయ్య హెచ్చరించారు.శుక్రవారం తిరుపతిలో నిర్వహించిన ఉద్యమ సన్నాహక సదస్సులో వారు మాట్లాడుతూ, విద్యుత్ బస్సులను ప్రభుత్వం సొంతంగా కొనుగోలు చేసి ఆర్టీసీ సిబ్బందితోనే నడపాలని కోరారు. మూసివేసిన నెల్లూరు2, గుంటూరు2, విద్యాధరపురం డిపోలను తిరిగి ప్రారంభించాలని, మంగళం డిపోను ఖాళీ చేయించే నిర్ణయాన్ని నిలిపివేయాలని డిమాండ్ చేశారు.ఆర్టీసీలో 12 వేలకుపైగా ఖాళీలు ఉన్నాయని, వెంటనే 10 వేల మంది సిబ్బందిని నియమించాలని కోరారు. అలాగే పెండింగ్‌లో ఉన్న డీఏ, 11వ పీఆర్సీ బకాయిలను విడుదల చేసి, ఐఆర్ ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ప్రభుత్వం స్పందించకపోతే ఈ నెల 23, 24 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా అన్ని డిపోలు, యూనిట్లలో ఉద్యోగులు ఎర్ర బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరై గేట్ మీటింగులు, ధర్నాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ నెల 28న విజయవాడలో రాష్ట్ర స్థాయి అత్యవసర సమావేశం నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

## ఎర్రచందనం స్మగ్లర్‌కు ఐదేళ్ల జైలు శిక్ష

**తిరుపతి, జూన్ 19 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన స్మగ్లర్‌కు ఐదేళ్ల జైలు శిక్ష, రూ.6 లక్షలు జరిమానా విధిస్తూ ఆర్ఎస్ఎస్ ఎడిజె కోర్టు న్యాయమూర్తి నరసింహమూర్తి తీర్పు నిచ్చారు. 2019 కేసులో ఈ ముద్దాయి తిరుపతి రేంజ్ పరిధిలోని పెరుమాళ్లపల్లి బీటు, టీఎన్ పాళెం సెక్షన్ లో అరెస్టయ్యాడు. తమిళనాడు తిరువన్నామలై జిల్లా పోలూరు తాలూకా మాటకనూరు గ్రామానికి చెందిన రామన్ దొరైరాజ్. ఇతని పై నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి నిందితుడికి ఐదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.6లక్షల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

# దమ్ముంటే రా.. బాక్సింగ్ రింగ్‌లో తేల్చుకుందాం




**ముంబై, జూన్ 19:** ఐపీఎల్‌లో స్లాప్ గేమ్ ఉదంతం జరిగి 18 ఏళ్లవుతున్నా వల్లారడం లేదు. దమ్ముంటే బాక్సింగ్ రింగ్‌లో తేల్చుకుందామంటూ హర్భజన్‌కు శ్రీశాంత్ సవాల్ విసరడం మరోసారి హాట్ టాపిక్‌గా మారింది. 2008 ఐపీఎల్‌లో శ్రీశాంత్‌ను హర్భజన్ చెంపదెబ్బ కొట్టడం, గ్రౌండ్‌లోనే శ్రీశాంత్ బోటాబోటా కళ్ల నుండి నీరు కార్చడం అప్పట్లో సంచలనంగా మారింది. ఒక్క చెంపదెబ్బకు అప్పట్లో హర్భజన్ కోట్లలోనే మూల్యం చెల్లించుకోవాల్సి వచ్చింది. 18 ఏళ్ల తర్వాత ఈ వివాదం మరో సారి తీవ్ర రూపం దాల్చింది.

2008 ఐపీఎల్ సీజన్ సందర్భంగా జరిగిన ఈ ఘర్షణను గుర్తుచేసేలా హర్భజన్ సింగ్ ఇటీవల ఒక వాణిజ్య ప్రకటన షూట్ చేయడమే వివాదానికి కారణమైంది. పాత గాయాలు మర్చిపోయారని భావిస్తున్న తరుణంలో భజ్జీ చేసిన ఈ యాడ్ శ్రీశాంత్‌కు తీవ్ర ఆగ్రహం తెప్పించింది. ఓ ఇంటర్వ్యూలో గతంలో వారిద్దరూ బాక్సింగ్ గ్లోవ్స్ ధరించి దిగిన ఒక పాత ఫోటోను చూపిస్తూ శ్రీశాంత్ తీవ్రంగా స్పందించాడు. యాక్టింగ్‌లు, కమర్షియల్ యాడ్స్ ఆపి, ధైర్యముంటే తనతో బాక్సింగ్ రింగ్‌లో పోటీ పడాలని భజ్జీకి సవాల్ చేశాడు .తాను రింగ్‌లో నీ కోసం వేచి చూస్తుంటానని శ్రీశాంత్ తీవ్ర వ్యాఖ్యలు చేయడం హాట్ టాపిక్‌గా మారింది.

# ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో ఆటగాళ్ల ముష్టిఘాతాలు



**వాంకోవర్, జూన్ 18:** ఫుట్‌బాల్ గ్రౌండ్ బాక్సింగ్ రింగ్‌గా మారింది. ఆటగాళ్లు ఒకరిపై ఒకరు ముష్టిఘాతాలకు దిగారు. ఇది సాకర్ వరల్డ్ కప్‌లో చేటుచేసుకుంది. వాంకోవర్‌లో జరిగిన కెనడా, ఖతార్ మ్యాచ్‌లో ఇరు జట్ల ఆటగాళ్లు తన్నుకోవడం హాట్ టాఫిక్‌గా మారింది.మ్యాచ్ ముగియగానే కెనడా ఆటగాళ్లు ఖతార్ జట్టుపైపై దూసుకొచ్చారు. ఆటగాళ్లు ఒకరిపై ఒకరు దాడి చేసుకునేందుకు యత్నించారు. ఈ క్రమంలో మైదానంలోకి వచ్చిన భద్రతా సిబ్బంది... ఇరుజట్లను వేరు చేసి అక్కడినుంచి పంపించేశారు. ఈ సమయంలో మైదానంలో గందరగోళం నెలకొంది. దీనికి సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది.

మ్యాచ్ అనంతరం కెనడా హెడ్ కోచ్ జెస్సీ మార్ష్, ఖతార్ మేనేజర్ జులెన్ లోపెటెగీతో కరచాలనం చేస్తుండగా వాళ్లిద్దరి మధ్య గొడవ మొదలైంది. జులెన్‌తో కెనడా కోచ్ దురుసుగా ప్రవర్తించడం ఖతార్ ఆటగాళ్లకు ఆగ్రహం తెప్పించింది. అంతకుముందు మ్యాచ్‌లో బంతిని పాస్ అందించే దానికి ఇస్మాయిల్ కోనె ప్రయత్నిస్తున్న సమయంలో ఖతార్ డిఫెండర్ అస్సిమ్ మదిబో కావాలనే ప్రమాదకరంగా అడ్డుకున్నాడు. దీంతో ఇస్మాయిల్‌కు కాలు ఫ్రాక్చర్ కావడంతో స్ట్రెచర్‌పై తీసుకెళ్లాల్సి వచ్చింది. ఇది కెనడా ఆటగాళ్ల కోపానికి కారణమైంది.



# విజయంతో నాకౌట్‌కు మెక్సికో

**గ్వాడలజారా, జూన్ 19:** ఫిఫా ప్రపంచకప్‌లో మెక్సికో వరుసగా రెండో విజయం నమోదు చేసింది. గ్రూప్-ఏ లో దక్షిణ కొరియాపై ఏకైక గోల్‌తో నెగ్గింది. 50వ నిమిషంలో గోల్ సాధించిన రోమో మెక్సికోకు గెలుపందించాడు. ఈ విజయంతో నాకౌట్‌కు అర్హత సాధించిన తొలి జట్టుగా మెక్సికో నిలిచింది. రెండు పటిష్టమైన జట్ల మధ్య పోరు అభిమానులకు కిక్ ఇచ్చింది. తొలి అర్థభాగం హోరాహోరీగా సాగింది. బంతిని ఎక్కువగా మెక్సికో నియంత్రణలో కొనసాగింది. మరోవైపు దక్షిణ కొరియా వ్యూహాత్మకంగా ఆడింది. దీంతో తొలి భాగంలో ఏ జట్టు కూడా గోల్ సాధించలేకపోయారు.

ఇక రెండో అర్థభాగం ప్రారంభమైన ఐదు నిమిషాలకే తొలి గోల్ నమోదైంది. మెక్సికో ప్లేయర్ రోమో అదిరే షాట్‌తో బంతిని నెట్స్‌లోకి పంపించాడు. మెక్సికో తొలి గోల్ సాధించడంతో స్టేడియం ఒక్కసారిగా హోరెత్తింది. ఆ తర్వాత మ్యాచ్ రసవత్తరంగానే సాగింది. గోల్స్ సమం చేయడానికి కొరియా చేసిన ప్రయత్నాలను మెక్సికో డిఫెండర్లు వమ్ముచేశారు. 75వ నిమిషంలో మెక్సికో ప్లేయర్ రౌల్ జిమెనెజ్ దాదాపు గోల్ చేసినంత పని చేశాడు. దీన్ని కిమ్ అద్భుతంగా అడ్డుకున్నాడు. మ్యాచ్ మరో మూడు నిమిషాల్లో ముగుస్తుందనగా... వో గునుంగ్ యంగ్, హ్వాన్‌జున్‌లు బంతిని రెండుసార్లు గోల్ వైపునకు పంపించారు. దీనిని సమర్థంగా అడ్డుకున్న మెక్సికో విజయం ఖరారు చేసుకుంది.

దక్షిణ కొరియా ఎంత బలమైందో తమకు ముందే తెలుసని, ఆ జట్టు మమ్మల్ని ఒత్తిడిలోకి నెట్టడంతో పాటు అన్నలు ఛాన్సులు ఇవ్వదేదని మెక్సికో కోచ్ జేవియర్ అగ్యురె అన్నారు. విరిరికి, ఏదో ఒక చిన్న పొరపాటే ఫలితాన్ని నిర్ణయిస్తుందని అనిపించింది. అది గొప్ప మ్యాచ్ ఏమీ కాదు, పైగా

# బ్రెజిల్ స్టెప్స్‌కు హైతీ సవాల్



**ఫిలడెల్ఫియా, జూన్ 19:** ఫిఫా ప్రపంచకప్ గ్రూప్-సిలో ఐదుసార్లు ప్రపంచ చాంపియన్ బ్రెజిల్ మరోపోరుకు సిద్ధమైంది. తొలి పోరులో మొరాకోతో 1-1తో డ్రా ముగించి నిరాశపరిచిన సాంబా జట్టు... ఈ సారి అండర్ డాగ్ హైతీ కీలక మ్యాచ్‌లో తలపడనుంది. ఈ మ్యాచ్ భారత కాలమానం ప్రకారం శనివారం తెల్లవారుజామున ప్రారంభమవుతుంది. ఈ మ్యాచ్‌లో బ్రెజిల్‌కు గెలుపు తప్పనిసరి. లేదంటే నాకౌట్ అవకాశాలు క్లిష్టంగా మారతాయి. మరోవైపు స్కాట్లాండ్ చేతిలో ఓడిన హైతీ... సంచలనం సృష్టించాలని ఆశిస్తోంది.

**ఒత్తిడంతా సాంబాపైనే**

ఈ మ్యాచ్‌లో బ్రెజిల్ స్పష్టమైన ఫేవరెట్ అయినా ఒత్తిడి కూడా అదే స్థాయిలో ఉంటుంది. కార్లో అన్సెలోట్టి ట్రెయిన్డ్ టీమ్ తొలి మ్యాచ్‌లో ఆశించిన స్థాయిలో రాణించలేకపోయారు. మొరాకోపై డ్రాతో విమర్శలు ఎదుర్కొంటున్న బ్రెజిల్ ఈ మ్యాచ్‌లో దూకుడైన ఆటతీరుతో పూర్తి మూడు పాయింట్లు సాధించాలని లక్ష్యంగా పెట్టుకుంది. జట్టులో వినీషియస్, రఫిన్హా వంటి స్టార్ ఆటగాళ్లు కీలకంగా మారనున్నారు. అన్సెలోట్టి కొన్ని వ్యూహాత్మక మార్పులు చేసే అవకాశం ఉందని సంకేతాలు ఇచ్చారు.

**హైతీ లక్ష్యం సంచలనం**

1974 తర్వాత ప్రపంచకప్‌కు అర్హత సాధించిన హైతీ...తొలి మ్యాచ్‌లో స్కాట్లాండ్‌పై ఓడినా పోరాట పటిమతో భేష్ అనిపించుకుంది. తొలి మ్యాచ్‌లో బ్రెజిల్ ఆటలో కనిపించిన లోపాలను హైతీ సద్వినియోగం చేసుకుంటే మ్యాచ్ ఆసక్తికరంగా మారే అవకాశం ఉంది. బ్రెజిల్ వంటి దిగ్గజ జట్టుతో ఆడటం తమకు గొప్ప అవకాశమని హైతీ కోచ్ సెబాస్టియన్ మిగ్నే పేర్కొన్నారు. ఒత్తిడి అంతా బ్రెజిల్ పైనే ఉంటుందని, తాము స్వేచ్ఛగా ఆడతామని చెప్పారు.

**హెడ్ టు హెడ్ :** ఇప్పటివరకు బ్రెజిల్, హైతీ రెండుసార్లు తలపడగా, రెండింటిలోనూ సాంబా టీమ్ ఘన విజయం సాధించింది. 2004లో 6-0తో, 2016లో 7-1 తేడాతో హైతీని ఓడించింది. మొత్తం 13 గోల్స్ చేసిన బ్రెజిల్, కేవలం ఒక గోల్ మాత్రమే ఇచ్చుకుంది.



# మకావ్ ఓపెన్ సెమీస్‌లో అష్మిత

**మకావ్(చైనా), జూన్ 19:** భారత షట్లర్ అష్మిత చాలిహా మకావ్ ఓపెన్ బ్యాడ్మింటన్ వరల్డ్ టూర్ సూపర్300 టోర్నీలో జోరు కొనసాగుతోంది. మహిళల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో అష్మిత 21-16, 21-18తో కేవలం 37 నిమిషాల్లోనే కిమ్ మిన్ సున్(కొరియా)పై గెలుపొందింది. సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. తొలి గేమ్ ఆరంభంలో అష్మిత, కిమ్ పోటాపోటీగా తలపడి పాయింట్లు రాబట్టారు. దీంతో14-14వరకు సమవుజ్జీగా నిలిచారు. ఈదశలో జోరు చూపిన అష్మిత వరుసగా 4 పాయింట్లు సాధించి ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. నెట్‌గేమ్‌తో ప్రత్యర్థిని ఉక్కిరిబిక్కిరి చేస్తూ అష్మిత తొలి గేమ్‌ను 21-16తో నెగ్గి శుభారంభం చేసింది. రెండో సెట్ లో కిమ్ ఆరంభంలో ఆధిక్యం చాటింది. మిడ్ గేమ్‌లో పుంజుకుని అష్మిత 11-5తో ఆధిక్యం చాటినా.. కిమ్ వరుస పాయింట్లతో 18-16 లీడ్ సాధించింది. ఈ దశలో ఎడమచేతి భారత షట్లర్... ప్రత్యర్థిని ఒత్తిడికి గురిచేస్తూ వరుసగా అయిదు పాయింట్లు సాధించి గేమ్‌ను, మ్యాచ్‌ను ముగించింది. కాగా ఎనిమిదో సీడ్ అనమోల్ ఖర్బ్ సవాల్ క్వార్టర్ ఫైనల్లో ముగిసింది.14-21, 21-15, 21-13తో నాలుగో సీడ్ హాన్ క్విన్ గ్జి(చైనా) చేతిలో ఓడింది.

# టిజి20 లీగ్ ఆపాలంటూ హైకోర్టుకెక్కిన క్రికెటర్లు

**హైదరాబాద్, జూన్ 19(వార్త క్రీడా ప్రతినిధి):** తెలంగాణ టీ20 లీగ్ ఆరంభానికి సమయం దగ్గరపడుతుండగా, మరోవైపు ఈ లీగ్‌ను వెంటనే ఆపాలని తెలంగాణ క్రికెటర్లు హైకోర్టును ఆశ్రయించారు. హెచ్‌సీఏ నిర్వహిస్తున్న టీజీ 20 లీగ్‌కు చట్టబద్ధత లేదని పిటిషన్ దాఖలు చేశారు. టీజీ 20 లీగ్ వెంటనే ఆపాలని కోర్టును అభ్యర్థించారు. క్రికెటర్ అంబటి రాయుడు, టీజీ 20లీగ్ గవర్నింగ్ కౌన్సిల్ తమను మోసం చేసిందని క్రీడాకారులు పిటిషన్‌లో పేర్కొన్నారు.మరోవైపు హెచ్‌సీఏ నిర్వహిస్తున్న టీజీ20 లీగ్‌కు బీసీసీఐ నుంచి ఎలాంటి అధికారిక అనుమతులు లేవని, ఇది పూర్తిగా రాజ్యాంగ విరుద్ధంగా జరుగుతున్న టోర్నీఅని తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ ధరమ్ గురువారెడ్డి లేఖ విడుదల చేశారు. టోర్నీ యాజమాన్య హక్కుల వెనక పెద్ద ఎత్తున గోల్‌మాల్ జరిగిందని ఆరోపించారు. కాగా టీజీ 20 లీగ్ తొలి సీజన్ మ్యాచ్‌లు జూన్21 నుంచి ఉప్పల్ స్టేడియంలో జరగనున్నాయి. 8జట్లు తలపడనున్నాయి. ప్రతి జట్టు మిగతా జట్లతో ఒక్కో మ్యాచ్ ఆడనుంది.



# జాతీయ ఐస్ హాకీకి ఎంపికైన ఆర్యన్ కర్రా

**హైదరాబాద్, జూన్ 19(వార్త క్రీడా ప్రతినిధి):** ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్ వేదికగా జరిగే 15వ జాతీయ ఐస్ హాకీ ఛాంపియన్‌షిప్‌లో తెలంగాణకు ఆర్యన్ కర్రా ప్రాతినిధ్యం వహిస్తాడు. ఈమేకు తెలంగాణ ఐస్ హాకీ అసోయేషన్ తెలిపింది. ఈ పోటీలు జూలై 1 నుంచి ఎనిమిది రోజుల పాటు జరుగుతాయి.అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్న ఆర్యన్ రాకతో తెలంగాణ జట్టు మరింత బలోపేతం కానుంది. గతంలో ఇటలీలోని రోకారాసోలో జరిగిన వరల్డ్ ఇన్‌లైన్ హాకీ చాంపియన్‌షిప్‌లో భారత జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు. 2018 ఆసియా రోలర్ స్కేటింగ్ చాంపియన్‌షిప్‌లో భారత్‌కు బ్రాంజ్ మెడల్ అందించాడు. 61వ నేషనల్ రోలర్ స్కేటింగ్ చాంపియన్‌షిప్ లో తెలంగాణ కెప్టెన్‌గా జట్టును ముందుండి నడిపించాడు.




# వారాంతంలో మార్కెట్ల భారీ పతనం

**ముంబయి, జూన్ 19:** భారత స్టాక్ మార్కెట్లు శుక్రవారం భారీగా నష్టపోయాయి. వరుసగా ఐదు సెషన్లలో లాభాలు పొందిన స్టాక్ మార్కెట్ శుక్రవారం నష్టాల బాటలో నడిచింది. సెన్సెక్స్, నిఫ్టీ నష్టాల్లో ముగిశాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి బీఎస్‌ఈ సెన్సెక్స్ 607.08 నష్టపోయి 76,802.90 పాయింట్ల వద్ద ముగిసింది. ఎన్ఎస్‌ఈ నిఫ్టీ50 కూడా 155 పాయింట్లు నష్టపోయి 24,013 పాయింట్ల వద్ద ముగిసింది. ఒక దశలో బీఎస్‌ఈ సెన్సెక్స్ 940.26 పాయింట్లు నష్టపోయి 76,469.72 కనిష్టానికి చేరింది. గ్లోబల్ ఐటీ దిగ్గజ కంపెనీ యాక్సెంచర్ ప్రకటించిన త్రైమాసిక ఫలితాలు నిరాశాజనకంగా ఉండటం, గతంలో ప్రకటించిన 5 శాతం రెవెన్యూ వృద్ధి అంచనాలను 4 శాతం తగ్గించడం మార్కెట్‌లో ఐటీ షేర్ల పతనానికి దారితీసింది. యాక్సెంచర్ ప్రకటనతో దేశీయ ఐటీ షేర్లు భారీగా నష్టపోయాయి.నిఫ్టీ ఐటీ ఇండెక్స్ 3.65 శాతం పతనమైంది. అమెరికా మార్కెట్లో యాక్సెంచర్ షేర్లు18శాతం పతనమయ్యాయి.భారతీయ ఐటీ కంపెనీలకు సంబంధించి ఇన్ఫోసిస్ 6.5 శాతం, టీసీఎస్ 3.06శాతం, టెక్ మహీంద్రా 2.3 శాతం, హెచ్‌సీఎల్ టెక్నాలజీ 2.23 శాతం, మహీంద్రా అండ్ మహీంద్రా 1.81 శాతం, విప్రో 1.28 శాతం నష్టపోయాయి. బీఎస్ఈలో ఎటర్నల్, పవర్ గ్రిడ్, భారతి ఎయిర్‌టెల్, టైటాన్, సన్‌ఫార్మా, ఎన్టీపీసీ, ఐటీసీ, ట్రెంట్, ఎల్ అండ్ టీ షేర్లు లాభాలు పొందాయి. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, మహీంద్రా అండ్ మహీంద్రా, రిలయన్స్ ఇండస్ట్రీస్, హిందుస్తాన్ యునీలీవర్ సంస్థలు నష్టపోయాయి. డాలర్‌తో రూపాయి మారకం విలువ 7 పైసలు పెరిగి, 94.33వద్ద కొనసాగింది. మరోవైపు అంతర్జాతీయంగా చమురు ధరలు తగ్గుముఖం పడుతున్నాయి. అమెరికా, ఇరాన్ మధ్య ఒప్పందం కుదరడం, హార్ముజ్ జలసంధి పూర్తిస్థాయిలో అందుబాటులోకి రావడంతో చమురు ధరలు ఒకటిశాతం పైగా పతనమయ్యాయి. బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ ధర 78.33 డాలర్లుగా, డబ్ల్యూటీఐ (వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియట్) క్రూడాయిల్ ధర కూడా ఒకటి శాతం పైగా తగ్గి 75.88 డాలర్ల వద్ద కొనసాగింది.

# హర్ముజ్ రాకపోకలతో దిగివచ్చిన బ్రెంట్‌క్రూడ్

**టెహ్రాన్, వాషింగ్టన్, జూన్ 19:** అమెరికా, ఇరాన్ మధ్య కుదిరిన తాత్కాలిక శాంతి ఒప్పందంతో అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు ఈరోజు భారీగా తగ్గుముఖం పట్టాయి.హర్ముజ్ జలసంధి గుండా ఆయిల్ ట్యాంకర్ల రాకపోకలు తిరిగి ప్రారంభం కావడంతో మార్కెట్‌లోకి సరఫరా పెరగనుందన్న అంచనాలతో ధరలు దిగివచ్చాయి. బ్యారెల్ బ్రెంట్ క్రూడ్ ఫ్యూచర్స్ ధర 54 సెంట్లు తగ్గి 78.31డాలర్లవద్ద ట్రేడ్ అవ్వగా,యూఎస్ వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియట్ (డబ్ల్యూటీఐ) క్రూడ్ ఆయిల్ ధర 46 సెంట్లు తగ్గి 76.14 డాలర్లకు చేరింది. ముందురోజు ఈ రెండు సూచీలు మార్చి ప్రారంభం తర్వాత అత్యంత కనిష్ఠ స్థాయిని తాకాయి.

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌తో శాంతి ఒప్పందంపై సంతకం చేసిన కొన్ని గంటల్లోనే, సౌదీ అరేబియాకు చెందిన మూడు ట్యాంకర్లు సహా పలు నౌకలు హర్ముజ్ జలసంధిని దాటాయి.ఈ మూడు ట్యాంకర్లలోనే దాదాపు 6 మిలియన్ బ్యారెళ్ల ముడి చమురు ఉంది. మధ్యప్రాచ్య గల్ఫ్‌లో నిలిచిపోయిన 85 మిలియన్ బ్యారెళ్లకు పైగా చమురు రాబోయే రోజుల్లో ప్రపంచ మార్కెట్లలోకి వచ్చే అవకాశం ఉంది. దీనికి తోడు ఇరాన్ చమురుపై అమెరికా ఆంక్షలను ఎత్తివేయనుండటంతో సరఫరా మరింత పెరగనుంది. పశ్చిమాసియాలోని ఇతర దేశాలు కూడా ఎగుమతులను పునఃప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నాయి. యుద్ధ సమయంలో విధించిన అన్ని ఫోర్స్ మేజర్ నోటీసులను తక్షణమే ఎత్తివేసినట్లు కువైట్ పెట్రోలియం కార్పొరేషన్ నిన్న ప్రకటించింది. తమ ఆయిల్‌ఫీల్డ్‌లు ఉత్పత్తికి సిద్ధంగా ఉన్నాయని, సాధారణ ఉత్పత్తి స్థాయికి క్రమంగా చేరుకుంటామని ఇరాక్ చమురు శాఖ మంత్రి బాసిమ్ మహమ్మద్ తెలిపారు. హర్ముజ్ జలసంధి గుండా ట్యాంకర్ల రద్దీ పూర్తిగా సాధారణ స్థితికి చేరుకుందని నిర్ధారించుకునే వరకు ట్రేడర్లు వేచి చూసే ధోరణిలో ఉన్నారని




## బ్యారెల్ ధరలు 78.31 డాలర్లే

మార్కెట్ నిపుణులు అంటున్నారు. నౌకల రాకపోకలు నిలకడగా కొనసాగితేనే ధరలు మరింత తగ్గే అవకాశం ఉందని కేసీఎం చీఫ్‌మార్కెట్ అనలిస్ట్ టిమ్ వాటరర్ అభిప్రాయపడ్డారు. యుద్ధానికి ముందు ప్రపంచంలోని చమురు, ఎల్ఎన్‌జీ ఐదోవంతు ఈజలసంధి గుండానే రవాణా అయ్యేది.




## జియో ఐపిఒకోసం సెబీకి ముసాయిదా దాఖలు

# చరిత్రలోనే రెండో అతిపెద్ద ఐపిఒకు బాటలు

**ముంబయి, జూన్ 19:** భారతీయ స్టాక్ మార్కెట్ చరిత్రలోనే అతిపెద్ద ఐపీఓ రాబోతోంది. డిజిటల్, టెలికాం దిగ్గజం జియో ప్లాట్‌ఫామ్స్ ఐపీఓకు వెళ్లేందుకు బోర్డు ఆమోదం తెలిపిందని, దీనికి సంబంధించిన ముసాయిదా పత్రాలను ఈ రోజే సెబీకి సమర్పించబోతున్నట్లు రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీ ప్రకటించారు.రిలయన్స్ 49వ వార్షిక సర్వసభ్య సమావేశంలో ఆయనే స్వయంగా ఈ విషయాన్ని వెల్లడించారు. దివంగత ధీరూభాయ్ అంబానీ ఆశయాలను తాను ముందుకు తీసుకెళ్లినట్లే ఇప్పుడు తన వారసులు ఆకాశ్, ఈశా,అనంత్ అంబానీలు ఈ జియో ఐపీఓ ప్రక్రియను ముందుండి నడిపిస్తున్నారని తెలిపారు. భవిష్యత్తులో సరికొత్త వృద్ధి అవకాశాలకు వారు నాయకత్వం వహిస్తారని పేర్కొన్నారు. గ్లోబల్ స్థాయిలో సాంకేతిక కంపెనీలను భారత్ నిర్మించగలదని ఈ జియో లిస్టింగ్ ప్రపంచానికి నిరూపిస్తుందన్నారు.

పదేళ్ల క్రితం భారత్‌లో వాయిస్ కాల్స్, డేటా ధరలు అధికంగా, స్పీడ్ చాలా తక్కువగా ఉండేవని ముకేశ్ గుర్తుచేశారు. దేశంలో డిజిటల్ అసమానతలను తొలగించాలనే లక్ష్యంతోనే జియో ప్రయాణం మొదలైందని తెలిపారు. వాయిస్ కాల్స్‌ను పూర్తిగా ఉచితం చేసి హైస్పీడ్ డేటాను సామాన్యుడికి అందుబాటులోకి తెచ్చామన్నారు. ప్రతి భారతీయుడికి డిజిటల్ లైఫ్‌ను సాధ్యం చేసిన జియో ఇప్పుడు తన తదుపరి పెద్ద మిషన్‌కు సిద్ధమవుతోందని స్పష్టం చేశారు. ఈ జియో ఐపీఓ భారతదేశ చరిత్రలోనే అతిపెద్ద ఐపీఓగా నిలవబోతోంది. నివేదికల ప్రకారం ఈ ఐపీఓ విలువ సుమారు రూ.33,600 కోట్లుగా ఉండే అవకాశం ఉంది.

ప్రముఖ ఇన్వెస్ట్ మెంట్ బ్యాంక్ జెఫ్రీస్ అంచనా ప్రకారం రిలయన్స్ జియో మొత్తం మార్కెట్ విలువ దాదాపు రూ.15,12,000 కోట్లుగా ఉంది. భారత్‌లో ఇప్పటివరకు జరిగిన ఐపీఓల్లో హ్యుందాయ్ మోటార్ ఇండియా ఐపీఓ అతిపెద్దది. దీని విలువ రూ. 27,870 కోట్లు. ఇప్పుడు రాబోతున్న జియో ఐపీఓ ఆ రికార్డును అధిగమించనుంది.ప్రస్తుతం జియో ప్లాట్‌ఫామ్స్ 52.40 కోట్ల మంది ఖాతాదారులతో దేశంలోనే అతిపెద్ద డిజిటల్ ప్లాట్‌ఫామ్‌గా రికార్డు సృష్టించింది. ఇందులో కేవలం జియో 5జీ నెట్‌వర్క్‌ను వాడుతున్న వారి సంఖ్య 26.80 కోట్లుగా ఉంది. అలాగే వీరి సరికొత్త హోమ్ బ్రాడ్‌బ్యాండ్ సర్వీస్ అయిన జియో ఎయిర్ ఫైబర్ ఇప్పటికే 1.30 కోట్ల ఇళ్లకు కనెక్ట్ అయి ఉంది.

# 10 బిలియన్ డాలర్లు తగ్గిన ఫారెక్స్ ఖజానా



**ముంబయి, జూన్19:** భారత ఫారెక్స్ నిల్వలు 9.985 బిలియన్ డాలర్లు తగ్గి 671.625 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. ఈనెల 12తో ముగిసిన వారంలో ఫారెక్స్ వివరాలను భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) శుక్రవారం వెల్లడించింది. బంగారం నిల్వల విలువలో భారీ తగ్గుదల ఇందుకు ప్రధాన కారణంగా నిలిచింది.అంతకుము ందు వారంలో దేశ విదేశీ మారక నిల్వలు 711 మిలియన్ డాలర్లు తగ్గి 681.610 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి.ఆర్‌బీఐ విడుదల చేసిన గణాంకాల ప్రకారం, జూన్ 12తో ముగిసిన వారంలో విదేశీ కరెన్సీ ఆస్తులు 846 మిలియన్ డాలర్లు పెరిగి 544.290 బిలియన్ డాలర్లకు చేరాయి. విదేశీ మారక నిల్వల్లో ఇది ప్రధాన భాగం.డాలర్ విలువలో లెక్కించే విదేశీ కరెన్సీ ఆస్తుల్లో యూరో, పౌండ్, యెన్ వంటి అమెరికాతర కరెన్సీల విలువ పెరుగుదల లేదా తగ్గుదల ప్రభావం కూడా ప్రతిబింబిస్తుందని ఆర్‌బీఐ తెలిపింది. బంగారం నిల్వల విలువ 10.754 బిలియన్ డాలర్లు తగ్గి 103.821 బిలియన్ డాలర్లకు చేరింది. ఈ తగ్గుదల మొత్తం విదేశీ మారక నిల్వలపై గణనీయమైన ప్రభావం చూపింది. అదేవిధంగా, ప్రత్యేక డ్రాయింగ్ హక్కులు 66 మిలియన్ డాలర్లు తగ్గి 18.699 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి.అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ ఐఎంఎఫ్ వద్ద భారత రిజర్వ్ స్థాయి కూడా 11 మిలియన్ డాలర్లు తగ్గి 4.815 బిలియన్ డాలర్లకు చేరినట్లు ఆర్‌బీఐ గణాంకాలు వెల్లడించాయి. దేశ విదేశీ మారక నిల్వల్లో బంగారం విలువ తగ్గుదల ప్రభావం స్పష్టంగా కనిపిస్తున్నప్పటికీ, విదేశీ కరెన్సీ ఆస్తుల పెరుగుదల కొంతమేర ఉపశమనం కలిగించిందని ఆర్బీఐ అంచనావేసింది.

# 1650 ఉపగ్రహాలతో జియో శాటిలైట్ ఇంటర్నెట్

**న్యూఢిల్లీ, జూన్ 18:** దేశ టెలికం రంగంలో సంచనాలతో దాదాపు గుత్తాధిపత్యం సాధించిన రిలయన్స్ జియో ఇప్పుడు శాటిలైట్ ఇంటర్నెట్‌పైనా కన్నేసింది. సుమారు 1,650 ఉపగ్రహాలతో నేరుగా నింగి నుంచే ఇంటర్నెట్, ఇతర టెలికం సేవలను అందించేందుకు సిద్ధమవుతోంది. ఇందు కోసం సుమారు రూ. లక్షన్నర కోట్లు వ్యయం చేయనుంది. అనుమతులపై కేంద్రప్రభుత్వం ఇప్పటికే సానుకూలత వ్యక్తం చేసింది. జియో శాటిలైట్ ఇంటర్నెట్ అందుబాటులోకి వస్తే భారత డిజిటల్ సార్వభౌమత్వం పెరుగుతుందని, విదేశీ వ్యవస్థలపై ఆధారపడటం తగ్గుతుందని నిపుణులు చెబుతున్నారు. అదే సమయంలో ప్రపంచవ్యాప్తంగా శాటిలైట్ ఇంటర్నెట్ రంగంలో ఉన్న పెద్ద సంస్థలకు జియో గట్టిపోటీ ఇచ్చే అవకాశం ఉంది.

లియో కక్ష్యలో ఉపగ్రహాలతో భూమి ఉపరితలం నుంచి సుమారు 400 కిలోమీటర్ల నుంచి 650 కిలోమీటర్ల ఎత్తు (లోఎర్త్ ఆర్బిట్ లియో)లోకి ఉపగ్రహాలను పంపి వాటి సాయంతో నేరుగా ఇంటర్నెట్‌ను అందిస్తారు. ఇందుకోసం ప్రత్యేకమైన పరికరాలనుగానీ, ఫోన్లను గానీ వినియోగించాల్సి ఉంటుంది. శాటిలైట్ ఇంటర్నెట్‌తో నగరాలు, గ్రామీణ ప్రాంతాలనే కాదు కొండలు,గుట్టలు, పర్వతాలు, అడవులు, మారుమూల ప్రాంతాలకూ ఇంటర్నెట్, టెలికం సర్వీసులు అందుతాయి. ఎలాన్ మస్క్‌కు చెందిన స్టార్‌లింక్ సంస్థ ఈ రంగంలో అగ్రగామిగా ఉంది. స్టార్‌లింక్ సుమారు 10వేల ఉపగ్రహాలతో ప్రపంచవ్యాప్తంగా సేవలందిస్తోంది. తర్వాతి స్థానంలో ఉన్న అమెజాన్ లియో ఇప్పటికే వెయ్యికిపైగా ఉపగ్రహాలతో సేవలందిస్తోంది. ఇక మనదేశానికి చెందిన భారతీ గ్రూప్(ఎయిర్‌టెల్ మాతృసంస్థ) వాటాలున్న యూరోప్ సంస్థ యూటెల్‌సాట్ వన్‌వెబ్ జాయింట్ వెంచర్ కూడా ఇప్పటికే సుమారు 600 ఉపగ్రహాలను ప్రయోగించి రేసులో ఉంది. అయితే జియో వీటన్నింటికీ భిన్నంగా శాటిలైట్ ఇంటర్నెట్‌నూ అనుసంధానించి.. సమగ్ర టెలికం ఇంటర్నెట్ వ్యవస్థగా నిలవనుంది.





# ఎన్ఎస్ఈ కోలోకేషన్ కేసు సెటిల్‌మెంట్‌కు సత్వర పరిష్కారం

**ముంబయి, జూన్ 19:** నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ కోలోకేషన్ కేసు సెటిల్‌మెంట్‌కు సెబీ అంతర్గతంగా ఆమోదం తెలిపిందని, ఈ వ్యవహారం త్వరలోనే పరిష్కారమయ్యే అవకాశం ఉందని సెబీ ఛైర్‌పర్సన్ తుహిన్‌కాంతపాండే శుక్రవారం వెల్లడించారు. ఎన్ఎస్ఈ సెటిల్‌మెంట్‌కు అంతర్గతంగా ఆమోదం లభించింది. ఈ అంశం త్వరలోనే పరిష్కారమవుతుందని పాండే తెలిపారు. దాదాపు దశాబ్ద కాలంగా ఎదురుచూస్తున్న ఐపిఒ కోసం ఎన్ఎస్ఈ ఇటీవల డ్రాఫ్ట్ రెడ్ హెరింగ్ ప్రాస్పెక్టస్ దాఖలు చేసిన నేపథ్యంలో ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. స్టాక్ ఎక్స్ఛేంజ్ లిస్టింగ్ ప్రక్రియ మరో కీలక దశకు చేరుకుంది. డీఆర్‌హెచ్‌పీలో ఎన్ఎస్ఈ, కోలోకేషన్ కేసుకు సంబంధించి సెబీతో ప్రతిపాదిత సెటిల్‌మెంట్ కోసం రూ.1,391 కోట్ల ప్రొవిజన్ ఏర్పాటు చేసినట్లు తెలిపింది. సవరించిన సెటిల్‌మెంట్ మొత్తంగా రూ.1,491 కోట్ల ప్రతిపాదనను సమర్పించామని, దీనికి తుది నియంత్రణ అనుమతి కోసం ఎదురుచూస్తున్నామని పేర్కొంది. ఈ తాజా పరిణామం వల్ల ఎన్ఎస్ఈ పబ్లిక్ లిస్టింగ్‌కు చాలా కాలంగా అడ్డంకిగా ఉన్న ప్రధాన సమస్యల్లో ఒకటి త్వరలోనే పరిష్కారమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఎన్ఎస్ఈ లిస్టింగ్ దాదాపు పదేళ్లుగా కొనసాగుతోంది. సంస్థ తొలిసారిగా 2016లో ఐపీఓ ముసాయిదా పత్రాలను దాఖలు చేసినప్పటికీ, కోలోకేషన్ వివాదం వెలుగులోకి రావడంతో నియంత్రణ సంస్థల పరిశీలన ప్రారంభమై నిలిచిపోయింది.ఆ తర్వాత కోలోకేషన్ కేసుకు సంబంధించిన సెటిల్‌మెంట్ దరఖాస్తులు సహా పలుపెండింగ్ అంశాలను పరిష్కరించేందుకు ఎన్ఎస్ఈ చర్యలు చేపట్టింది.2024లో షేర్‌హోల్డర్లు 4:1 బోనస్ ఇష్యూకు ఆమోదం తెలపడంతో ఐపీఓ ప్రక్రియ మళ్లీ వేగం పుంజుకుంది. అనంతరం 2026 జనవరిలో సెబీ లిస్టింగ్‌కు సుముఖత తెలపగా, ఫిబ్రవరిలో ఐపీఓకు అధికారిక అనుమతి మంజూరు చేసింది.నియంత్రణ సంస్థల సమీక్ష అనంతరం సంస్థ ధరల శ్రేణి, సబ్‌స్క్రిప్షన్ తేదీలు ప్రకటించి, స్టాక్ మార్కెట్‌లో లిస్టింగ్‌కు సిద్ధమయ్యే అవకాశం ఉంది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., Renigunta Road, 3rd Mile Stone, Tirupati-517507 Ph. No. 2238770, Fax:: 08772238790, RNI No.64860/9 Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act.

ఫ్యాషన్ ఫ్యాషన్

# బొమ్మలతో బడికి ఖుషీ.. ఖుషీ !










పిల్లలంటేనే బొమ్మలంటే చెవి కోసుకుంటారు. అవిచేతి కందితే వదలనే వదలరు వాటిని అక్కడే వదిలి వెళ్లాలన్నా వారికి మనస్కరించదు. ఒకవేళ బొమ్మలున్న బ్యాగ్ దొరికిందంటే వాటిని భుజన వేసుకుని స్కూలు కెళ్లొచ్చేస్తారు. కుక్కపిల్ల, సింహం, డైనోసార్ బొమ్మలకు నచ్చిన పేరు పెట్టుకుని పిల్లలు వాటితో ఆడుకుంటుంటారు.తీరా ప్లే స్కూల్‌కు బయలుదేరేటప్పుడు ఆ బొమ్మను వదల్లేరు. తమతోపాటు బడికి తీసుకెళ్లాలని మొండికేస్తారు. అలాంటివారి కోసమే ఈ యూనిమల్ విండో బ్యాక్ ప్యాక్. దీనికి ఓ వైపు స్ట్రాప్స్, రెండోవైపు మూడు నాలుగు బొమ్మలుంచేలా చిన్నన గదుల్లాంటి రంధ్రాలుంటాయి. నచ్చిన బొమ్మలను వీటిలో ఉంచితే చాలు. అవి కూడా తమతోనే ఉన్నాయనే భావన పిల్లల్లో ఉంటుంది. అలాగే ఆకాశం, నక్షత్రాలు, రాకెట్, అంతరిక్షం, వ్యోమగామిలాంటి డిజైన్లతో బ్యాక్‌ప్యాక్‌లొస్తున్నాయి. పిల్లల్లో ఉత్సాహాన్ని నింపడమే కాదు. ఇవి సృజనాత్మకతనూ పెంచుతాయి.

### అన్నీ అందులోనే ...

ఈ బ్యాక్ ప్యాక్‌కు చిన్నారులకు నచ్చే కుందేలు, కుక్కపిల్ల వంటి బొమ్మలను స్ట్రాప్‌తో అటాచ్ చేసే సౌకర్యం ఉంటుంది. దీంతోపాటు నీలి ఆకాశం, నక్షత్రాలు, ఇల్లు, తోట అంటూ పలురకాల ఊలు బొమ్మలూ బ్యాగుకు అతికించి ఉంటాయి. అలాగే డెనిమ్, శాటిన్ క్లాత్స్‌తో తయారవుతున్న కొన్ని బ్యాగులకు ఓవైపు బొమ్మను ఫిక్స్ చేయొచ్చు. దీనికోసం బెల్ట్‌లా స్ట్రాప్స్‌తో లేదా అరలాంటిది అటాచ్డ్‌గా ఉంటుంది. ఇందులో నచ్చిన బొమ్మను స్టఫ్ చేస్తే కదలకుండా కూర్చుంటుంది. ఉత్సాహంగా పరుగులు పెట్టి చటుక్కున కనిపించని పిల్లలను కనుసన్నల్లో ఉండేలా చేసే బ్యాగులు ఇప్పుడొస్తున్నాయి. చిన్నారి తగిలించుకున్న ఈ బ్యాగుకు వెనకవైపు అటాచ్డ్‌గా ఓ బెల్ట్ లేదా వైర్ ఉంటుంది. దీని రెండోకొనను పెద్దవాళ్లు తమ చేతికి తొడుక్కుంటే సరిపోతుంది. □

# ఇంట్లోనే 'బారామాసి' మధుర ఫల నివాసం !



**సీజన్ ఏదైనా, కాలం ఏదైనా మీ ఇంటికొచ్చే అతిథి, అభ్యాగతులకు, మధుర ఫలాలు తినిపించాలనుకుంటున్నారా? అయితే ఏడాది పొడవునా కాపుకాసే మామిడి రకాలపై దృష్టి ఉంచండి. పెంచడమ తెలికే సంరక్షణా మీదే.**

ప్రస్తుతం నాటిన ఏడాదికే కాపు మొదలై ఏడాది పొడవునా మామిడి ఫలాలను అందిస్తూ కాపుకాసే 'బారామాసి' మామిడి రకాలను పెంచేందుకు ఎంతో మంది మొగ్గు చూపుతున్నారు. బాల్కనీలు, డాబాలపై చిన్న కుండీల్లో సైతం ఇవి సులభంగా పెరుగుతూ, ఏడాది పొడవునా ఫలసాయాన్ని ఇస్తుండటంతో వీటికి ఆదరణ విశేషంగా పెరుగుతోంది. ఎక్కడో తోటల్లో పండే మధుర ఫలం ఇప్పుడు మన ఇంట్లో మన పెరట్లోనే పండుతుంది. సాధారణ బంగినపల్లి వంటి మామిడి ఫలాలకు తోటలే మంచి వాతావరణాన్నిస్తాయి. కానీ అతిఖరీదైన 'బారామాసి' అనే నిరం తరం కాపు కాసే మామిడి రకం మన ఇంట్లోనే పెంచుకునేందుకు వీలైనదిగా బాహ్య ప్రపంచానికి అందుబాటులోకి వచ్చింది. 'బారామాసి' అంటే హిందీలో పన్నెండు నెలలు అని అర్థం. ఏడాదిలో పలుమార్లు పూత పూసి కాయలు కాస్తాయి. ముఖ్యంగా అంటుకట్టిన హైబ్రిడ్ మొక్కలు పొట్టిగా ఉండి, కుండీల్లో పెంచడానికి అనువుగా ఉంటాయి. సాంప్రదాయ మామిడి రకాలు నాటిన తర్వాత ఫలసాయం ఇవ్వడానికి సుమారు 4 నుండి 5 ఏళ్ల సమయం పడితే, ఈ బారామాసి రకాలు కేవలం 9 నుండి 12 నెలల్లోనే పంటను చేతికి అందిస్తాయి. ప్రస్తుతం కాటిమెన్ (థాయ్‌లాండ్ రకం), ఎరుపు రంగుతో ఆకట్టుకునే హాంగ్ సియాంగ్ (రెడ్ డ్రాగన్), చీడపీడలను సమర్థవంతంగా తట్టుకునే దేశీయ రకమైన 'సదాబహార్' వంటివి విశేష ప్రాచుర్యం పొందాయి. ఈ మొక్కలు ఆరోగ్యంగా పెరగడానికి నీరు నిల్వ ఉండని సారవంతమైన మట్టి, ప్రతిరోజూ కనీసం 6 నుంచి 8 గంటల పాటు ప్రత్యక్ష సూర్యరశ్మి, తీవ్రమైన చలి నుంచి రక్షణ అవసరం. 20 డిగ్రీల నుంచి 38 డిగ్రీల మధ్య ఉండే ఉష్ణోగ్రతలు వీటికి అత్యంత అనుకూలం. ఈ 'బారామాసి' పండ్లు కమ్మని తీపి, స్వల్పమైన పులుపు కలయికతో ఎంతో రుచికరంగా ఉంటాయి. పీచు లేకుండా, ఆకర్షణీయమైన బంగారు పసుపు రంగు గుజ్జుతో ఉండే ఈ పండ్లు వినియోగదారులు బాగా ఇష్టపడుతున్నారు. తమ బాల్కనీలు, మిద్దె తోటల్లోనే మధుర రసాలు పెంచుకోగలగడం మహత్తర అవకాశం! □

ఆరోగ్య భాగ్యం

# రుమాటిక్ ఫీవర్

**ఇది దేహ రక్షణ వ్యవస్థకు** సంక్రమించే అనారోగ్యాలలో అతి ముఖ్యమైనదీ. దీన్నే కీళ్లవాత జ్వరం, ఆటోఇమ్యూన్‌డిసీజ్ అని అంటారు. ఇది శరీరంలో కనెక్టివ్ కణజాలం వున్న కీళ్ళు, చర్మం, గుండె, రక్తనాళాలు, నర్వస్ సిస్టమ్, మెదడును ఎఫెక్ట్ చేసే కాంప్లెక్స్ డిసీజ్. దీన్ని 5వ శతాబ్దంలో హిపోక్రాటిస్ గుర్తించడమైనది. ఇది 5-15 సంవత్సరాల పిల్లల్లో కన్పించే కీళ్ళవాత జ్వరం. ప్రతి సంవత్సరం 325,000 మంది పిల్లల్లో సంభవిస్తుంది. ప్రస్తుతం 33.4 మిలియన్ మందికి రుమాటిక్ గుండె జబ్బులున్నాయి. స్ట్రెప్టోకాకస్ గ్రూప్‌కి చెందిన బాక్టీరియల్ ఇన్ఫెక్షన్ (జిఎఎస్) వల్ల పిల్లల్లో స్ట్రెప్ త్రోట్ (గొంతు నొప్పి), స్కార్లెట్ ఫీవర్, ఇంపైటెగో, సెల్యులైటిస్ వంటి చర్మవ్యాధులు వస్తాయి. దీన్నే స్ట్రెప్ బాక్టీరియా అంటారు. గొంతులో, చర్మంలో వచ్చే స్ట్రెప్టోకాకస్ బాక్టీరియా ఇన్ఫెక్షన్‌కు సరిగా చికిత్స చేయకపోవడం వల్ల, అసలు చికిత్స చేయించుకోక పోవడం వల్ల పిల్లలకి దాపురించే ఉపనరదవ వ్యాధే రుమాటిక్ ఫీవర్. ఇది 1% బాక్టీరియల్ ఇన్ఫెక్షన్ వల్ల వచ్చే కాంప్లికేషన్. ఇది స్ట్రెప్ బాక్టీరియా ఆటో ఇమ్యూన్ రియాక్షన్ ఇది ఒక వ్యక్తి యొక్క రోగ నిరోధక ప్రతిస్పందన కారణంగా ఉంటుంది. ఇది పెద్దవారిలోరాదు. ఇది అంటూ వ్యాధి కాదు.కాని స్కార్లెట్ ఫీవర్ గొంతునొప్పి అంటు వ్యాధులు ఇవి దగ్గడం, తుమ్మడం వల్ల, శ్వాస ద్వారా, రోగికి సన్నిహితంగా ఉన్నప్పుడు వస్తుంది.

**వ్యాధి లక్షణాలు :** ఇన్ఫెక్షన్ సోకిన 1-5 వారాల తర్వాత వ్యాది లక్షణాలు కన్పిస్తాయి. 100-163 ఎఫ్ వరకు ఉన్నట్టుండి జ్వరం వస్తుంది. మోకాళ్ళు, మడమలు, మోచేయి, మణికట్టు వంటి పెద్ద కీళ్ళు ఎర్రగా వాచి, ముట్టుకున్న నొప్పిగా, వెచ్చగా ఉంటాయి. ఏ పాటి తాకిడి కూడా భరించలేరు. ఒక కీలు వాచి, దాని వాపు తగ్గిపోయి రెండవ కీలులో బాధ మొదలవుతుంది. దీన్నే ఫ్లిట్టింగ్ ఆర్థ్రయిటిస్ అంటారు. దద్దుర్లు, నిస్సత్తువ, అలసట, ముక్కు నుండి రక్తం కావడం, మోకాలు, మోచేతులు, వెన్నముక ప్రాంతంలోని చర్మం క్రింద చిన్న చిన్న నొప్పి లేనట్టి బుడిపెలుంటాయి.

తలనొప్పి, ఎర్రగా ఉబ్బి నట్లుండే టాన్సిల్స్ వాపు ఉంటుంది. అంగిలిపై ఎర్రటి రాష్ ఉంటుంది. మెడలోని లింఫ్ గ్రంధుల వాపు, వికారం, కడుపునొప్పి, వాంతులు, ఆకలి లేక పోవడం, బరువు తగ్గడం, కాళ్ళు, ముఖంలో అసంకల్పిత కదలికలు, జర్క్స్ ఉంటాయి. దీన్నే స్వీడన్‌హామ్ కొరియా అని అంటారు. కొంత మందిలో ఉన్నట్టుండి నవ్వడం, ఏడ్వడం వంటి బిహేవియర్ ప్రాబ్లమ్స్ ఉంటాయి. ఈ లక్షణాలు ఎకునకవగా అక్యూట్ రూమాటిక్ ఫీవర్‌లో ఉంటాయి. ఛాతీలో నొప్పి, పడుకున్న శ్వాస తీసుకోలేకపోవడం, అబ్‌నార్మల్ హార్ట్ బీట్స్, అబ్‌నార్మల్ రిథమ్స్, గుండె దడ, మర్‌మర్స్, గుండె కవాటలోపాలుంటాయి. రుమాటిక్ గుండె జబ్బులు. రుమాటిక్ ఫీవర్ ఒకసారి కాని , కంటిన్యూగాక 5-10 సంవత్సరాలు వచ్చినపుడు గుండె, రక్తనాళాలు దెబ్బతినడం 25-40 సంవత్సరాలున్న పెద్ద వారిలో కన్పించడం వల్ల దీన్ని రూమాటిక్ హార్ట్ డిసీజ్ అని అంటారు. □



డాక్టర్ కె.ఉమాదేవి
తిరుపతి

# అసలైన భక్తి

ధర్మనిష్ఠ, దానధర్మాలు, అతిథి సత్కారాలకు పెట్టింది పేరుగా జీవించేవాడో భక్తుడు. ఓ రోజు రాత్రి కుటుంబసభ్యులు, పనివారు కూడా నిద్రపోయాక తలుపు చప్పుడైంది. అతడెళ్లి తలుపు తీస్తే ఓ వృద్ధుడు- అన్నం తిని వారమైంది అన్నాడు దీనంగా. హృదయం ద్రవించి, అయ్యా! భగవంతుడి తరఫున నా ఆతిథ్యం స్వీకరించి, అనుగ్రహించు అన్నాడు. వృద్ధుడు భిక్ష ఆరగించి 'అన్నం పెట్టిన మీకు కృతజ్ఞతలు. కానీ భగవంతుడి ప్రస్తావన ఎందుకు మధ్యలో? ఆయనపై నాకు నమ్మకం లేదు అన్నాడు. అది విని భక్తుడు నిశ్చేష్టుడయ్యాడు. పరమాత్మ ఉనికిని ప్రశ్నిస్తాడేంటని బాధపడ్డాడు. వృద్ధుడు అంతటితో ఆగకుండా కనిపిం చని ఆ దేవుణ్ణి నమ్మడం వృథా! అంటూ ఎద్దేవా చేశాడు. దాంతో భక్తుడు ఆగ్రహించి..అతడి ముందున్న పళ్లెం లాక్కుని బయటకు గెంటేశాడు. ఆ రాత్రి కళలో దైవం కనిపించి ఆకలి తీరకుండానే ఆ వృద్ధుణ్ణి గెంటేశావేం నాయనా? అన్నాడు. అది విన్న పరమాత్మ 'నాయనా! ఏళ్ల తరబడి అతను నా ఉనికిని సందేహిస్తూ, నిందిస్తున్నా.. భరిస్తూనే ఉన్నాను. అతడి అవసరాలు తీరుస్తూనే ఉన్నాను. నాస్తికుల్నీ ఆదరించే స్వామి అవ్యాజ ప్రేమ ఆ భక్తుణ్ణి ముగ్ధుణ్ణి చేసింది. □

# కూరగాయలు పాడవకుండా !



అప్పటికప్పుడు తాజాగా కూరగాయల్ని కోసుకొచ్చి వండే రోజులు కావివి. కనీసం మార్కెట్ నుంచి కూడా ఏ రోజుకారోజు తెచ్చుకోలేం. అందుకే, వారానికోసారి మార్కెట్ నుంచి కొనుక్కురావడం, ఒక రోజు ముందే కట్ చేసుకుని బాక్సుల్లో సర్దుకోవడం వంటి పనులు ఇప్పుడు అందరి జీవితాల్లోనూ ఓ భాగం అయిపోయాయి. ఇంతవరకూ బాగానే ఉన్నా భద్రపరచడమే ఓ పెద్ద సవాల్. వీటిని ముక్కల్లా కత్తిరించి స్టోర్ చేసినా, నేరుగా కూరగాయల్ని ఫ్రిజ్‌లో పెట్టాలనుకున్నా తేమ లేకుండా చూసుకోవడం చాలా ముఖ్యం. లేదంటే వాటిల్లో నీరూరి పాడయిపోతుంటాయి. మీకూ ఇలాంటి అనుభవముందా అయితే ఈ సారి ఇందుకోసం డ్రెయిన్ స్టోరేజ్ బాక్సుల్ని ఎంచుకోండి. రకరకాల పరిమాణాల్లో తొరుకుతున్నాయి. ఈ బాక్సుల్లో ఉండే జాలీ నుంచి నీళ్లు అడుగుకి చేరడం వల్ల కూరగాయలూ, పండ్లూ ఏ మాత్రం పాడవ్వవు. □

# #NN5 హ్యూమరస్ క్రియేటివ్ పోస్టర్ ద్వారా అనౌన్స్‌మెంట్

రైజింగ్ యంగ్ స్టార్ నార్నే నితిన్ 'మ్యాడ్', 'ఆయ్', 'మ్యాడ్ స్క్వేర్' వంటి వరుస విజయాల తర్వాత తన కెరీర్‌లో కొత్త అధ్యాయాన్ని ప్రారంభించడానికి సిద్ధమవుతున్నారు. 'జూనియర్' చిత్రంతో దర్శకుడిగా పరిచయమైన రాధా కృష్ణతో సరికొత్త రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్ కోసం జతకట్టారు. వివి5 చిత్రాన్ని ప్రతిష్టాత్మక కేవీఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై వెంకట్ కె నారాయణ నిర్మిస్తున్నారు. నార్నే నితిన్ పుట్టినరోజు సందర్భంగా విడుదల చేసిన అనౌన్స్‌మెంట్ పోస్టర్ వినూత్నంగా ఆకట్టుకుంటోంది. ఇన్‌స్టాగ్రామ్ పోస్టు తరహాలో డిజైన్ చేసిన ఈ పోస్టర్ యూత్‌ఫుల్ రొమాంటిక్ వైబ్‌ను అందిస్తోంది. నీలాకాశం నేపథ్యంగా ఓ భవనం అంచున టీషర్ట్, జీన్స్, స్నీకర్స్‌లో కూల్‌గా కూర్చున్న నార్నే నితిన్ కనిపిస్తుండగా, ఎరుపు రంగు డ్రెస్‌లో ఉన్న ఓ యువతి పోస్టులోని హార్ట్ ఐకాన్‌ను ట్యాప్ చేయబోతున్నట్లు చూపించారు."ఆకాశంలో ఉంటుంది మూన్... నువ్వే నా లైఫ్‌కి క్వీన్..." అనే ఫన్నీ లైన్‌తో పాటు వేలాది లైక్స్, కామెంట్స్, ట్రెండీ హ్యాష్‌ట్యాగ్స్ పోస్టర్‌కు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అంతేకాకుండా నార్నే నితిన్ బావ, యంగ్ టైగర్ ఎన్టీఆర్ ఈ పోస్టును లైక్ చేసినట్లు చూపించడం అభిమానులను మరింత ఆకట్టుకుంటోంది. ప్రేమ, హాస్యం, భావోద్వేగాల సమ్మేళనంగా రూపొందనున్న ఈ చిత్రం ప్రేక్షకులకు పూర్తి స్థాయి వినోదాన్ని అందించబోతోంది. ఈ చిత్రానికి రామ మారుతి ఎం సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, నిరంజన్ దేవరమానే ఎడిటింగ్ నిర్వహిస్తున్నారు. శివ కామేశ్ డి ఆర్ట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. శరణ్య పొట్ల, అజయ్ గద్దె ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్స్‌గా వ్యవహరిస్తున్నారు.




# 400 కోట్ల క్లబ్‌లో చేరిన 'పెద్ది'



'పెద్ది'లో నేటి నుంచి 5 నిమిషాల 56 సెకన్ల కొత్త సన్ని వేశాలు జోడింపు 400 కోట్ల క్లబ్ లో చేరిన పెద్ది. మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ సెన్సేషనల్ బ్లాక్‌బస్టర్ 'పెద్ది ప్రపంచవ్యాప్తంగా 400 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లను సాధించి విజయవంతంగా రన్ అవుతోంది. రెండు వారాలుగా థియేటర్లలో ప్రభంజనం సృష్టిస్తూ పలు రికార్డులను తిరగరాస్తున్న ఈ చిత్రం, ఇప్పుడు మూడో వారంలోకి మరింత బలంగా అడుగుపెట్టేందుకు సిద్ధమైంది. ఈ నేపథ్యంలో చిత్ర బృందం సినిమాకు కొత్త సన్ని వేశాలను జోడిస్తున్నట్లు అధికారికంగా ప్రకటించింది. నేటి నుంచి ప్రేక్షకులు అదనంగా 5 నిమిషాల 56 సెకన్ల నిడివి గల కొత్త ఫుటేజ్‌ను థియేటర్లలో చూడబోతున్నారు. కొత్త సన్నివేశాలు రిపీట్ ఆడియన్స్ మరింత అలరించనున్నాయి.అంతే కాకుండా, ఈ చిత్రం గురువారం నుంచి రెగ్యులర్ టికెట్ ధరలతో అందుబాటులోకి రానుంది. టికెట్ ధరల తగ్గింపు ఫ్యామిలీ ఆడియన్స్‌ను మరింతగా ఆకర్షించే అవకాశం ఉందని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి.

తెర

# 300కె ప్రీ సేల్స్‌తో సమంత 'మా ఇంటి బంగారం'




ట్రాలాలా పిక్చర్స్ బ్యానర్ మీద సమంత, రాజ్ నిడిమోరు, హిమాంక్ దువ్వూరు సంయుక్తంగా నిర్మించిన సినిమా 'మా ఇంటి బంగారం' సమంత ప్రధాన పాత్రలో నటించిన ఈ చిత్రానికి నందినీ రెడ్డి దర్శకత్వం వహించారు. ఈ మూవీ మన తెలుగు రాష్ట్రాలతో పాటు మా ఇంటి బంగారం మూవీ ఓవర్సీస్ మార్కెట్లలో మంచి బజ్ క్రియేట్ చేస్తోంది. ఇప్పటికే ఈ సినిమా ఓవర్సీస్ ప్రీసేల్స్‌లో 300Кే దాటేయటం విశేషం. టికెట్ బుకింగ్స్ కూడా వేగంగా కొనసాగుతున్నాయి. టికెట్ బుకింగ్స్ పరంగా మా ఇంటి బంగారం సినిమాకు వస్తోన్న రెస్పాన్స్, ట్రెండ్ చూస్తుంటే ఈ సినిమా బాక్సాఫీస్ దగ్గర మంచి ఓపెనింగ్ సాధించేలా కనిపిస్తోంది. ప్రస్తుతం ఉన్న బజ్..అడ్వాన్స్ బుకింగ్స్‌ను దృష్టిలో పెట్టుకుని చూస్తే ఈ సినిమా ఓవర్సీస్‌లో ప్రతిష్టాత్మకమైన 1 మిలియన్ క్లబ్‌లో చేరే అవకాశాలు ఉన్నాయని ఇండస్ట్రీ వర్గాలు భావిస్తున్నాయి. సరసమైన టికెట్ ధరలు కూడా డిమాండ్‌ను మరింత పెంచాయి. దీంతో ఓపెనింగ్ వీకెండ్‌లో సినిమా చూసే కుటుంబ ప్రేక్షకులకు ఇది బెస్ట్ ఆప్షన్‌గా మారింది. యాక్షన్‌తో పాటు ఫ్యామిలీ ఎంటర్‌టైన్‌మెంట్‌ను కలగలిసిన సినిమా కావటమే అతి పెద్ద బలంగా మారింది. ముఖ్యంగా యాక్షన్ సన్నివేశాల్లో సమంత పవర్‌ఫుల్ స్క్రీన్ ప్రెజెన్స్ ప్రేక్షకుల్లో భారీ ఆసక్తిని రేకెత్తిస్తోంది.అడ్వాన్స్ బుకింగ్స్ అన్ని మార్కెట్లలో కూడా బలంగా కొనసాగు తున్నాయి. ఇది ఈ ప్రాజెక్ట్‌పై ప్రేక్షకుల్లో ఉన్న నమ్మకాన్ని స్పష్టంగా చూపిస్తోంది. సమంత భారీ ఫ్యాన్ ఫాలోయింగ్‌తో పాటు, డైరెక్టర్ నందినీ రెడ్డితో ఆమెకున్న సక్సెస్‌ఫుల్ కాంబో క్రేజ్ కూడా ఈ సినిమాకు మరింత బలం చేకూరుస్తోంది. సమంత ప్రధాన పాత్రలో నటించిన ఈ చిత్రంలో ఇంకా శ్రీనివాస్ గవిరెడ్డి, మంజూష, దిగంత్, గుల్షన్ దేవయ్య, శ్రీముఖి, గౌతమి,ఆనంద్, లక్ష్మి ్మ తదితరులు కీలక పాత్రల్లో నటించారు.

# 'ది ఇండియా స్టోరీ' అఫీషియల్ పోస్టర్ రిలీజ్




జీ స్టూడియోస్ సమర్పణలో, ఎంఐజీ ప్రొడక్షన్ స్టూడియోస్ సహకారంతో తెరకెక్కుతున్న 'ది ఇండియా స్టోరీ' చిత్రానికి సంబంధించిన తొలి అధికారిక పోస్టర్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఈ పోస్టర్‌లో కాజల్ అగర్వాల్ ఓ న్యాయ వాదిగా, శ్రేయస్ తల్పడే ఆందోళనలో ఉన్న తండ్రిగా కనిపిస్తున్నారు. అలాగే శ్రేయస్ కుమార్తె పాత్రలో కనిపిస్తున్న చిన్నారి ద్వారా, లక్షలాది కుటుంబాలను ప్రభావితం చేస్తున్న ఒక తీవ్రమైన సమస్య వెనుక ఉన్న మానవీయ కోణాన్ని పోస్టర్ బలంగా ఆవిష్కరించింది. ముంబై హైకోర్టు నేపథ్యంతో రూపొందించిన ఈ పోస్టర్‌లో, సాక్షుల బోనులో ఉంచిన పురుగుమందు సిలిండర్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆహార కల్తీ అనే అత్యంత కీలకమైన సమస్యపై సాగే కోర్ట్‌రూమ్ డ్రామాకు ఇది సంకేతంగా కనిపిస్తోంది.ఈ చిత్రానికి చెట్టన్ డీకే దర్శకత్వం వహించగా, సాగర్ బి. షిండే కథ, స్క్రీన్‌ప్లే అందించి నిర్మిస్తున్నారు. జూలై 24, 2026న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా హిందీ, తెలుగు, తమిళ భాషల్లో విడుదల కానుంది. భారతదేశంలో ప్రజారోగ్యా నికి సంబంధించిన అత్యంత కీలకమైన, తరచూ నిర్లక్ష్యానికి గురయ్యే ఆహార కల్తీ సమస్యను ఈ చిత్రం ప్రధానాం శం. సాధారణ ప్రజలు ప్రతిరోజూ వినియోగించే ఆహార పదార్థాల వెనుక దాగి ఉన్న ప్రమాదా లను వెలుగులోకి తీసుకురావడంతో పాటు, సమాజంలో అవగాహన పెంచే ప్రయత్నం చేయనుంది. దర్శకుడు చెట్టన్ డీకే మాట్లాడుతూ, ఆహార కల్తీ కారణంగా కుటుంబ సభ్యులు, కావాల్సిన వారిని కోల్పోయిన ప్రతి భారతీయుడి కథే 'ది ఇండియా స్టోరీ'. మన సమాజంలో అత్యంత నిర్లక్ష్యానికి గురవుతున్న ప్పటికీ అత్యంత తీవ్రమైన సమస్యల్లో ఆహార కల్తీ ఒకటి. ఇది మనందరి రోజువారీ జీవితాలను ప్రభావితం చేసే అంశం.

# 'బాలన్ ది బాయ్' మర్చిపోలేని ఫీల్: నాగచైతన్య



పాన్ ఇండియా స్థాయిలో "బాలన్ ది బాయ్" సినిమా పలువురు సెలబ్రిటీల ప్రశంసలు దక్కించు కుంటోంది. ప్రముఖ దర్శకుడు ప్రియదర్శన్ ఇలాంటి సినిమా గత రెండేళ్లలో రాలేదని అభినందిం చగా..ఇప్పుడు హీరో నాగ చైతన్య 'బాలన్ ది బాయ్' సినిమాను అప్రిషియేట్ చేశారు. ఈ సినిమా చూస్తున్నంతసేపు ఆ మూవీ ఫీల్ లోనే ఉండ పోయానని, 'బాలన్ ది బాయ్' సినిమా మర్చిపోలేని అనుభూతికి గురిచేసిందని అన్నారు. నాగచైతన్య ప్రశంసలతో మూవీ లవర్స్‌లో ఈ సినిమాపై మరింతగా అంచనాలు పెరుగు తున్నాయి. 'బాలన్ ది బాయ్' సినిమా చూసిన తర్వాత నాగచైతన్య స్పందిస్తూ ఈ సినిమా సరికొత్త కథ, ఆశ్చర్యపరిచే కథనం, చూపు తిప్పుకోలేని చిత్రీకరణతో ఆకట్టుకుంది. ప్రతి సీన్ ఊహకు అందకుండా సాగుతూ ఆశ్చర్య పరిచింది. ఎండ్ టైటిల్స్ తర్వాత కూడా నేను అదే ఫీల్‌లో ఉండిపోయాను. ఈ సినిమా ఇచ్చిన అనుభూతి నుంచి బయటకురాలేకపోయా. జితూ మాధవన్ స్క్రిప్ట్ ఇంప్రెస్ చేసింది. ఆయన 'మంజుమ్మెల్ బాయ్స్', 'ఆవేశం' సినిమాల్లాగే ఈ చిత్రాన్ని కూడా తెలుగు ఆడియెన్స్ ఆదరిస్తారు. అన్నారు.గ్రాండియర్ ఫిలిం మేకింగ్‌కు మారుపేరైన కేవీఎన్ ప్రొడక్షన్స్, తెస్పియన్ ఫిలింస్ సంయుక్తంగా 'బాలన్ ది బాయ్' సినిమాను నిర్మిస్తున్నాయి. ఈ చిత్రానికి 'ఆవేశం' ఫేమ్ డైరెక్టర్ జితూ మాధవన్ అందించిన స్క్రిప్ట్ తో "మంజుమ్మెల్ బాయ్స్' చిత్ర దర్శకుడు చిదంబరం దర్శకత్వం వహి స్తున్నారు. వెంకట్ కె నారాయణ, శైలజా దేశాయి ఫెన్ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. ఈ సినిమా ఈ నెల 19న హిందీతో పాటు మలయాళం, తెలుగు, కన్నడ, తమిళంలో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. 'బాలన్ ది బాయ్' సినిమాను రెండు తెలుగు రాష్ట్రాల్లో అన్నపూర్ణ స్టూడియోస్ సంస్థ డిస్ట్రిబ్యూట్ చేస్తోంది.

# 'మారెమ్మ' జూలైలో విడుదల



మాస్ మహారాజా రవితేజ సోదరుడి తనయుడు, నటుడు రఘు కుమారుడు మాధవ్ విలేజ్ యాక్షన్‌డ్రామా 'మారెమ్మ' తో హీరోగా బిగ్ స్క్రీన్ పై అడుగు పెడుతున్నారు. ఈ చిత్రంతో మంచాల నాగరాజు దర్శకుడిగా పరిచయమవు తున్నారు. మయూర్ రెడ్డి బండారు మోక్ష ఆర్ట్స్ బ్యానర్‌పై ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.'మారెమ్మ' ఫస్ట్ లుక్ పోస్టర్, టీజర్, ఫస్ట్ సింగిల్ 'బావ బావ' సాంగ్‌కి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది.తాజాగా రిలీజ్ టైం పై అప్డేట్ ఇచ్చారు. ఈ చిత్రం 2026 జూలై లో రిలీజ్ కానుంది.ఈసారి బోనాల జాతర థియేటర్లలో దుమ్ములేప బోతున్నాయ్ అంటూ మేకర్స్ రిలీజ్ చేసిన పోస్టర్ డివైన్ వైబ్ తో అందరినీ ఆకట్టుకుంది.ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ ప్రశాంత్ అంకిరెడ్డి అందించగా, సంగీతాన్ని ప్రశాంత్ ఆర్ విహారి సమకూర్చారు. ఎడిటర్‌గా దేవ్ రాథోడ్, ఆర్ట్ డైరెక్టర్‌గా రాజ్‌కుమార్ మురుగేసన్ పని చేస్తున్నారు.

# క్షయరహిత తెలంగాణ లక్ష్యంగా కృషి

## 2,492 గ్రామాల్లో క్షయ వ్యాధి నిర్మూలనకు హెల్త్ స్క్రీనింగ్

### కేంద్రమంత్రి విడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి దామోదర రాజనర్సింహ



**హైదరాబాద్, జూన్ 19, ప్రభాతవార్త:** క్షయ రహిత రాష్ట్ర మే లక్ష్యంగా కృషిచేస్తున్నట్టు వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. రాష్ట్రంలోని 2492 గ్రామాల్లో క్షయ వ్యాధి నిర్మూలనకు హెల్త్ స్క్రీనింగ్‌ను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. క్షయ వ్యాధి బాధితులకు ప్రభుత్వం అండగా ఉందని, నవజాత శిశు మరణాలను తగ్గించడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టినట్టు తెలిపారు. దేశంలో క్షయ, మాతశిశు సంరక్షణ, నివారణ కార్య క్రమాలపై అన్ని రాష్ట్రాల వైద్య, ఆరోగ్య శాఖ మంత్రులతో కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జగత్ ప్రకాష్ నడ్డా శుక్రవారం విడియో కాన్ఫరెన్స్‌ను నిర్వ హించారు. విడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ రాజీవ్ ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ కార్యాలయం సమావేశమందిరం నుండి పాల్గొన్నా రు. క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలను తెలంగాణ రాష్ట్రం లో 2,492 గ్రామాల్లో హెల్త్ స్క్రీనింగ్ లను నిర్వ హిస్తున్నామని మంత్రి రాజనర్సింహ వెల్లడించారు. క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షల్లో వ్యాధి నిర్ధారణ అయిన వారికి చికిత్సతోపాటు పౌష్టికాహారం అందించేందుకు ప్రతి నెల వెయ్యి రూపాయలు నిక్షయ పోషణ యోజన పథకం కింద అందించాలని కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా తెలిపారు. రాష్ట్రంలో పౌష్టికాహారం కోసం ఫుడ్‌బాస్కెట్‌లను దాతలను అందిస్తున్నామన్నారు. క్షయ వ్యాధి రహిత తెలంగాణ రాష్ట్రంగా తీర్చిదిద్దు తున్నామన్నారు. తెలంగాణ రాష్ట్రంలో మాతా శిశు సంరక్షణ కార్యక్రమాలలో భాగంగా మాతృమరణాలను, నవజాత శిశు మరణాలను తగ్గించాలనే లక్ష్యంతో చర్యలు చేపట్టామన్నారు. ఆర్‌బిఎస్‌కె బృందాల ద్వారా 18 సంవత్సరాల లోపు వయస్సు ఉన్న పిల్లలకు హెల్త్ స్క్రీనింగ్ నిర్వహిస్తు న్నామని కేంద్ర మంత్రి నడ్డకి మంత్రి దామోదర రాజనర్సింహ వివరించారు. మాతా శిశు సంరక్షణ కార్యక్రమాలలో భాగంగా హైరిస్క్ ప్రెగ్నె న్సీలను ముందే గుర్తించి గర్భిణీ స్త్రీలకు బర్త్ ప్లానింగ్ కోసం కావాల్సిన సదుపాయాలను అన్ని ప్రభుత్వ ఆసు పత్రులలో అందుబాటులో ఉంచామని మంత్రి దామో దర రాజనర్సింహ వెల్లడించారు. రాష్ట్రంలో యాంటీ నాటల్ చెకప్(ఎఎన్‌సి)లను విధిగా 4సార్లు నిర్వ హిస్తు న్నామన్నారు. జన్యుపరమైన రుగ్మతలు (సికిల్ సెల్, తలసేమియా) ముందుగానే గుర్తించడానికి హెల్త్ చెకప్ చేస్తున్నామని మంత్రి వీడియో కాన్ఫరెన్స్‌లో తెలి య జేశారు. ప్రెగ్నెన్సీ సమయంలో వచ్చే హైపర్ టెన్షన్, డయాబెటిస్, థైరాయిడ్ లాంటి వాటిని గుర్తించడానికి హెల్త్ స్క్రీనింగ్, హెల్త్‌చెకప్, ట్రీట్మెంట్ చేస్తున్నా మ న్నారు. నవజాత శిశు మరణాలను తగ్గించాలనే లక్ష్యంగా కృషి చేస్తున్నామని మంత్రి స్పష్టం చేశారు. వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా జెడ్ చొంగ్తు, ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్

# నీట్ రీఎగ్జామ్ అభ్యర్థులకు ఆర్టీసీ ఉచిత బస్సుప్రయాణం

### తగినన్ని బస్సుల ఏర్పాటు: సంస్థ ఎండి నాగిరెడ్డి

**హైదరాబాద్, జూన్ 19, ప్రభాతవార్త:** ఈనెల 21న జరగనున్న నీట్ రీఎగ్జామ్ అభ్యర్థులకు టీజీఎస్ ఆర్టీసీ ఉచిత బస్సు ప్రయాణ సదుపాయంకల్పించింది. సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకోవడానికి తగినన్ని బస్సుల ఏర్పాటు చేస్తున్నట్టు సంస్థ వీసీ అండ్ ఎండీ నాగిరెడ్డి తెలిపారు. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాల మేరకు ఈ నెల 21వ తేదీన దేశవ్యాప్తంగా నిర్వహించబోయే నీట్ రీఎగ్జామ్‌కు హాజరయ్యే అభ్యర్థులకు టీజీఎస్‌ఆర్టీసీ ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పిస్తున్నట్లు సంస్థ వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ వై. నాగిరెడ్డి స్పష్టం చేశారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు తమ హాల్ టికెట్‌ను చూపించి, తమ ఇళ్ల నుండి పరీక్షా కేంద్రాల వరకు, తిరిగి ఇంటికి చేరుకోవడానికి ఉచితంగా రాకపోకలు సాగించవచ్చని ఆయన తెలిపారు. ఈ ప్రత్యేక ఉచిత ప్రయాణ సదుపాయం సంస్థకు చెందిన ఏసీ సర్వీసులు మినహాయించి అన్ని బస్సులలో అందుబాటులో ఉంటుందని ఆయన వివరించారు. పరీక్షకు దాదాపు 73 వేల మంది అభ్యర్థులు హాజరవుతున్న నేపథ్యంలో, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పరీక్షా కేంద్రాల మార్గాలలో తగినన్ని బస్సులను నడిపేందుకు ముందస్తుగా ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. 21వ తేది మొదటి సర్వీసు నుంచి అర్ధరాత్రి (12గంటలు) వరకు ఈ సదుపాయాన్ని అభ్యర్థులు వినియోగించుకోవచ్చని, ఏదైనా ఆటంకాలు ఎదురైనట్లయితే, టీజీఎస్‌ఆర్టీసీ కాల్ సెంటర్ నెంబర్లు 040-2345 0033, 6815 3333లలో సంప్రదించాలన్నారు. లాంటి ఒత్తిడి లేకుండా పరీక్షకు సకాలంలో చేరుకోవడానికి అభ్యర్థులు ప్లాన్ చేసుకోవాలని సూచిస్తూ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులందరికీ సంస్థ ఎండీ నాగిరెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.

## నేడు ఆర్‌జిపిఆర్ సంఘటన్ ఆధ్వర్యంలో సత్యాగ్రహ దీక్ష

**హైదరాబాద్, జూన్ 19, ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వంతో కుమ్మక్కై తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ రాజ్య సభ నామినేష న్‌ను తిరస్కరించిన ఎన్నికల సంఘం తీరుకు నిరసనగా రాజీవ్‌గాంధీ పంచాయతీరాజ్ సంఘటన్ ఆధ్వర్యంలో శనివారం గాంధీభవన్‌లో సత్యా గ్రహ నిర్వహిస్తున్నారు. ఈ దీక్ష కు ముఖ్య అతిథులుగా టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, రాజీవ్‌గాంధీ పంచాయతీరాజ్ సంఘటన్ ఆల్ ఇండి యా చైర్మన్ సునీల్‌పన్వర్, ఎఐసిసి కార్యదర్శి సచిన్ సావంత్ హాజరవు తున్నారు. ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించే ఈ సత్యాగ్రహ దీక్షలో పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని రాజీవ్‌గాంధీ పంచాయతీరాజ్ సంఘటన్ తెలంగాణ చైర్మన్ రాచమల్ల సిద్దేశ్వర్ కోరారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య

## ఇంజినీరింగ్ కౌన్సెలింగ్‌లో ఫీజులు వసూలు చేయొద్దు: సిఎంకు ఆర్.కృష్ణయ్య లేఖ

**హైదరాబాద్ (చిక్కడపల్లి), జూన్ 19, ప్రభాతవార్త :** ఇంజినీరింగ్ కౌన్సెలింగ్‌లో విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేయకూడదని, 18 యేళ్లుగా అమల వుతున్న ఫీజు రీయింబర్స్‌మెంట్ విధానాన్నే కొనసాగించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. ఇంజినీరింగ్ కౌన్సెలింగ్ విధానంపై ప్రభుత్వం నుంచి స్పష్టత లేకపోవడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు గందరగోళానికి గురవుతున్నారని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం ఇటీవల తెచ్చిన జీవో నంబర్ 89 వల్ల తీవ్ర అయోమయం నెలకొందని, దీనివల్ల కాలేజీ యాజమాన్యాలు ఫీజులు కట్టాలని విద్యార్థులపై ఒత్తిడి తెచ్చే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఫీజులు కట్టకపోతే రెవెన్యూ రికవరీ యాక్ట్ కింద అరెస్టు చేస్తామని భయపెట్టడం వల్ల విద్యార్థులు చదువుపై ఆసక్తి కోల్పోతున్నారని పేర్కొన్నారు. సమస్యపై ప్రభుత్వం నిరక్ష ్యం వహిస్తే భవిష్యత్తులో భారీ మూల్యం చెల్లించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

## మొదటిరోజు ఇంజినీరింగ్ కౌన్సెలింగ్‌కు 42,045 మంది దరఖాస్తు

### 22 నుంచి సర్టిఫికెట్ వెరిఫికేషన్

**హైదరాబాద్, జూన్ 19, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల్లో 2026-27 విద్యా సంవత్సరంలో ఇంజనీరింగ్ మొదటి సంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహించే ఎప్ సెట్-2026 కౌన్సెలింగ్‌లో భాగంగా శుక్రవారం ప్రారంభమైన ఇంజనీరింగ్ కౌన్సెలింగ్‌కి మొదటి రోజు 42,405 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఈ నెల 28 వరకు స్లాట్‌బుక్ చేసుకోవడానికి అవకాశం ఉన్నట్టు సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 28 వరకు ఆన్‌లైన్‌లో కౌన్సెలింగ్ కోసం ఫీజు చెల్లించి స్లాట్ బుక్‌చేసుకోవాలి. ఈ నెల 22 నుంచి 29 వరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను నిర్వహిస్తారు. ఈ నెల 25 నుంచి జులై 1 వరకు విద్యార్థులు వెబ్ ఆప్షన్లు ఇవ్వడానికి అవకాశం కల్పించారు.జూలై 4న మాక్ సీట్ అలకేషన్‌ను చేస్తారు. జులై 5 నుంచి 7 వరకు మాక్ సీట్ అలకేషన్‌లో మోడిఫికేషన్‌కు అవకాశం కల్పించారు.

## రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి

### మరో ముగ్గురికి గాయాలు



**పెద్దవూర, జూన్ 19, ప్రభాతవార్త :** మండల పరిధిలోని రామన్నగూడెం ముత్యాలమ్మ దేవాలయం సమీపంలో ఎదురెదురుగా వస్తున్న రెండుకార్లు ఢీకొనడంతో ఘోర ప్రమాదం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని పల్నాడు జిల్లా ముప్పాళ్ల మండలం కొంకవారి పాలేనికి చెందిన కాకర్ల తోమాసయ్య(59), చిన్న కుమారుడు కాకర్ల ప్రకాష్ రావు (35), హైదరాబాద్ నుండి గురువారంసాయంత్రం హయత్‌నగర్‌కు చెందిన ఎరకల ప్రవీణ్ కారును కిరాయికి మాట్లాడుకుని హైదరాబాద్ నుండి నాగార్జునసాగర్‌లోని సాగర్‌మాత గుడికి బయలుదేరారు. పెద్దవూర మీదుగా నాగార్జునసాగర్‌వైపు వెళ్తూ రాత్రి 10.00 గంటలకు పెద్దవూర మండలం లోని రామన్నగూడెం తండా శివారులోకి వచ్చేసరికి, అదే సమయంలో నాగార్జునసాగర్ నుండి పెద్దవూర వెళ్తున్న మారుతి సుజుకి కారును డ్రైవర్ గొర్రె రామకృష్ణ అతివేగంగా ఆజాగ్రత్తగా, రాంగ్ రూట్లో నడుపుకుంటూ వెళ్లి తొమాసయ్య, ప్రకాష్‌రావు ప్రయాణిస్తున్న కారును ఎదురుగా ఢీకొట్టాడు. దాంతో తొమాసయ్య, ప్రకాష్‌రావు ఘటనాస్థలంలోనే చనిపోయారని పోలీ సులు తెలిపారు. వీరితోపాటు హనుమకొండకు చెందన రావుల సాయి కుమార్‌కూడా తీవ్రంగా గాయపడి ఘటనాస్థలంలోనే చనిపోయారని పోలీసులు తెలిపారు. హైదరాబాద్ నుంచి వస్తున్న కారులోని డ్రైవర్ ప్రవీణ్ కు, మరో ప్రయాణికుడు కొర్రసాయికి, మరొకరికి గాయాలయ్యాయి. మృతదేహాలను, గాయపడిన వారిని నాగార్జునసాగర్ ఆస్పత్రికి తరలించి శీను నాయక్ ఆధ్వర్యంలో ఎస్ఐ గోపాలరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

# ఉన్నత విద్యలో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలవాలి

### కొత్త కోర్సులను అన్ని వర్సిటీల్లో అమలు చేయాలి: గవర్నర్ శివప్రతాప్‌శుక్లా

**హైదరాబాద్, జూన్ 19, ప్రభాతవార్త:** ఉన్నత విద్యలో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిల వాలని, తెలంగాణ ఉన్నత విద్యా మండలి ప్రవేశ పెట్టిన భవిష్యత్ అవసరాలకు అనుగుణమైన కోర్సులను 2026-27 విద్యా సంవత్సరం నుంచి అన్ని రాష్ట్ర విశ్వవిద్యాలయాల్లో అమలు చేయాలని రాష్ట్ర గవర్నర్, విశ్వవిద్యాలయాల ఛాన్సలర్ శివ ప్రతాప్ శుక్లా ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని లోక్ భవన్‌లో తెలంగాణ ఉన్నత విద్యా మండలి (టీజీసీహెచ్‌ఈ) చైర్మన్ ప్రొఫెసర్ వి. బాలకిష్టా రెడ్డిని ప్రత్యేకంగా ఆహ్వానించి, ఆయనతో సమావేశమై, ఉన్నత విద్యా మండలి ప్రతిపాదించిన వినూత్న విద్యా కార్యక్రమాలను ప్రవేశపెట్టడం, అమలు అంశాలపై సవివరంగా సమీక్ష నిర్వహించారు.

2026-27 విద్యా సంవత్సరం నుంచి ఈ కార్యక్రమాలను రాష్ట్రంలోని అన్ని రాష్ట్ర విశ్వవిద్యాలయాల్లో అమలు చేయడానికి అవసరమైన చర్యలు చేపట్టాలని గవర్నర్ టీజీసీహెచ్‌ఈని ఆదేశించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ వి. బాలకిష్టా రెడ్డి ఏరోస్పేస్, డిఫెన్స్, మారిటైమ్, ఫిన్‌టెక్, క్లైమేట్ గవర్నెన్స్, లైఫ్ సైన్సెస్, ఫుడ్ టెక్నాలజీ తదితర అభివృద్ధి చెందుతున్న వ్యూహాత్మక ప్రాధాన్యత కలిగిన రంగాలలో టీజీసీహెచ్‌ఈ ప్రవేశపెట్టిన నూతన కోర్సుల గురించి గవర్నర్‌కు వివరించారు. జాతీయ విద్యా విధానం-2020తో పాటు అంతర్జాతీయ ఉత్తమ ప్రమాణాలకు అనుగుణంగా ఈ కార్యక్రమాలను రూపొందించినట్లు తెలిపారు. జాతీయ ప్రాధాన్యతలు, పరిశ్రమల అవసరాలు, భవిష్యత్ ఉపాధి అవకాశాలను దృష్టిలో ఉంచుకొని ఈ కోర్సులను రూపొందించినట్లు తెలిపారు. ఉపాధి ఆధారిత, భవిష్యత్ అవసరాలకు అనుగుణమైన కోర్సులను ప్రవేశపెట్టడం పట్ల ఛాన్సలర్ ఎస్‌పి శుక్లా హర్షం వ్యక్తం చేశారు. వేగంగా మారుతున్న ప్రపంచ అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలతో కూడిన మానవ వనరులను తీర్చిదిద్దడంలో ఈ కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని అభిప్రాయపడ్డారు. ఉన్నత విద్యలో వినూత్నతకు ప్రాధాన్యతనిస్తున్న తెలంగాణ దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలవాలని గవర్నర్ ఆకాంక్షి ంచారు. 2026-27 విద్యా సంవత్సరంనుంచే ఈ కోర్సులను సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు పరిశ్రమలు, పరిశోధనా సంస్థలు ఇతర భాగస్వామ్య సంస్థలతో మరింత సమన్వయం పెంపొందించి ఈ కార్యక్రమాలను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలని సూచించారు.

# క్రీడామౌలిక సదుపాయాల అభివృద్ధికి సిఎం రేవంత్, గవర్నర్ శివప్రతాప్‌శుక్లా శ్రీకారం



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 19:** ఎల్‌బి స్టేడియం ప్రాంగణంలోనే శుక్రవారం సాయంత్రం గవర్నర్ శివప్రతాప్‌శుక్లాతో కలిసి రూ.50.73 కోట్లతో రాష్ట్రంలో క్రీడా మౌలిక సదు పాయాల అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శ్రీకారం చుట్టారు. రూ.36.65 కోట్లతో రాష్ట్రం లోని వివిధ జిల్లాల్లో మినీ స్టేడియంల నిర్మాణం, క్రీడా మోలిక సదుపాయాల అభివృద్ధికి సిఎం శంకుస్థాపన చేశారు. రూ.14.08 కోట్లతో గచ్చిబౌలి, ఎల్బీ స్టేడియం లలో బాల బాలికల క్రీడా శిక్షణకు వివిధ అకాడమీలను సిఎం ప్రారం భించారు. శంకు స్థాపనల వివరాలు: రూ. 10 కోట్లతో రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియో జకవర్గంలోని కొందుర్గ్ మండల కేంద్రంలో మినీ స్టేడియం నిర్మాణం రూ.10 కోట్లతో సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని డా., బీఆర్ అంబేద్కర్ స్టేడియం ఆధునీకరణ రూ.4 కోట్లతో నారా యణపేట్ జిల్లా నర్వ మండల కేంద్రంలో మినీ స్టేడియం నిర్మాణంరూ.4 కోట్లతో వనపర్తి జిల్లా ఆత్మకూర్ పట్టణంలో మల్టీ పర్పస్ స్టేడియం, కబడ్డీ, వాలీబాల్, ఖోఖో కోర్ట్స్ నిర్మాణం, క్రికెట్ గ్రౌండ్, వాకింగ్ ట్రాక్ అభివృద్ధి.రూ.3.50 కోట్లతో కామారెడ్డి జిల్లా గాంధారి మండల కేంద్రంలో మినీ స్టేడియం నిర్మాణం రూ.2.65 కోట్లతో మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గ కేంద్రంలో మినీ స్టేడియం నిర్మాణంరూ.2.50 కోట్లతో నారాయణపేట్ జిల్లా మక్తల్ మండలం ఉట్కూరులో వాలీబాల్ కబడ్డీ కోర్ట్స్ నిర్మాణం. ప్రారంభోత్సవాల వివరాలు:రూ.5.70 కోట్లతో బాలికల కోసం గచ్చిబౌలి స్టేడియంలో ఏర్పాటు చేసిన నీనీతి తి.నీనీ తెలంగాణ టాలెంట్ అకాడమీ ప్రారంభం రూ.5.70 కోట్లతో బాలుర కోసం గచ్చిబౌలి స్టేడియంలో ఏర్పాటు చేసిన నీనీతి తి.నీనీ తెలంగాణ టాలెంట్ అకాడమీ ప్రారంభం రూ.35.95 లక్షలతో బాలికల కోసం గచ్చిబౌలి స్టేడియంలో ఏర్పాటు చేసిన అథ్లెటిక్స్ అకాడమీ ప్రారంభం రూ.35.94 లక్షలతో బాలుర కోసం గచ్చిబౌలి స్టేడియంలో ఏర్పాటు చేసిన అథ్లెటిక్స్ అకాడమీ ప్రారంభం రూ.44.50 లక్షలతో బాలికల కోసం గచ్చిబౌలి స్టేడియంలో ఏర్పాటు చేసిన హాకీ అకాడమీ ప్రారంభం రూ.44.50 లక్షలతో బాలుర కోసం గచ్చిబౌలి స్టేడియంలో ఏర్పాటు చేసిన హాకీ అకాడమీ ప్రారంభం రూ.58.50 లక్షలతో బాలుర కోసం ఎల్బీ స్టేడియంలో ఏర్పాటు చేసిన ఫుట్ బాల్ అకాడమీ ప్రారంభం రూ.49 లక్షలతో బాలుర కోసం ఎల్బీ స్టేడియంలో ఏర్పాటు చేసిన హ్యాండ్ బాల్ అకాడమీ ప్రారంభం చేశారు.

# నైతికతలేని బిజెపి సింగరేణిపై చిల్లర రాజకీయాలు మానుకోవాలి

### ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్

**హైదరాబాద్, జూన్ 19, ప్రభాతవార్త:** సింగరేణి పైన చిల్లర రాజక ీయాలు మానుకోవాలనీ,సింగరేణిపైన మాట్లాడే నైతిక అర్హత బిజెపికి లేదనీ ప్రభుత్వ విప్‌అద్దంకి దయాకర్ అన్నారు. శుక్రవారం సిఎల్‌పిలో ఆయన మాట్లాడుతూ బొగ్గు బ్లాక్ లను ప్రైవేటు పరం చేయాలని నిర్ణయించిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి నాయకత్వంలో పనిచేస్తున్న బిజెపి సింగరేణికి ఎలా వెళ్ళుతుందనీ, సింగరేణిలో పర్యటించే హక్కు బిజెపి కి లేదనీ అన్నారు. కార్మికుల పొట్టను కొట్టే పాలసీలు చేసి మళ్లీ అక్కడకు పోయేందుకు యత్నిస్తున్న బిజెపి ఎంత దౌర్భాగ్య స్థితిలో ఉందో దీని వల్ల అర్థమోతోందనీ అన్నారు. సింగరేణి పైన బిజెపి బిఆర్ఎస్ కలిసి కుట్రలు చేస్తున్నాయనీ ఆరోపించారు. రాజకీయ రహస్య మిత్రులు ఇద్దరు సింగరేణి చుట్టు రాజకీయాలు చేస్తున్నారనీ అన్నారు. బొగ్గు గనులను ప్రైవేటీకరణ చేస్తున్న విధానంపైన బిజెపి సమాధానం చెప్పాలనీ కోరారు.. సింగరేణి ని ప్రైవేటీకరణ కు బిజెపి ప్రభుత్వ ప్రయత్నాలపైన కిషన్ రెడ్డి కార్మికులకు ఏం చెబుతారని అడిగారు. బొగ్గ గనుల ను ప్రైవేటీకరణ చేస్తున్న బిజెపికి బొగ్గుల నిల్వలపైన మాట్లాడే అర్హత ఎలా ఉంటుందనీ అన్నారు.సింగరేణి ప్రైవేటికరణను అడ్డుకున్నది కాంగ్రెస్ పార్టీ అని చెప్పారు. సింగరేణిని ఆదుకుంటున్నది కాంగ్రెస్ పార్టీ అని అన్నారు. సింగరేణి కార్మికులకు బోనస్ ఇచ్చింది కాంగ్రెస్ పార్టీ అని చెప్పారు.సింగరేణి భక్షకులను కార్మికులు నమ్మరనీమీలాంటి వాళ్లను కార్మికులు నమ్ముతారనుకోవడం పిచ్చి భ్రమ అని ఆయన అన్నారు. అందుకే చిల్లర రాజకీయాలు మానోకోండని సలహా ఇచ్చారు.

# ఫాస్ట్‌ఫుడ్ గోదాంపై హెచ్-ఫాస్ట్ బృందం దాడి

### కల్తీ ఆహార పదార్థాలు స్వాధీనం

**హైదరాబాద్ (చార్మినార్), జూన్ 19, ప్రభాతవార్త :** ఆహార కల్తీ, సురక్షిత ఆహార పద్ధతులపై నిరం తర నిఘాలో భాగంగా హైదరాబాద్ ఫుడ్ అడ ల్ట్రేషన్ సర్వేలైన్స్ టీమ్, ఫుడ్‌సేఫ్టీ ఎఫ్ఎస్ఒతో కలిసి చార్మినార్ సమీపం లోని హుస్సేనీఆలం పోలీ స్‌స్టేషన్ పరిధిలో అక్ర మంగా నిర్వహిస్తున్న ఓ ఫాస్ట్‌ఫుడ్ గోదాంపై ఆకస్మిక దాడి నిర్వహిం చింది. చార్మినార్ సమీపం లోని పంచమొహల్లా న్యూలాడ్ బజార్‌లో ఉన్న మెసర్స్ అల్‌అక్బర్ ఫాస్ట్ ఫుడ్ అండ్ గోడౌన్ ప్రాం గా ణాన్ని తనిఖీ చేసింది.



ఫాస్ట్‌ఫుడ్ తయారీ ప్రాంతంలో అపరిశుభ్రమైన వాతావరణం

ఈ తనిఖీల్లో ప్రజల ఆరోగ్యానికి తీవ్రముప్పు కలిగించేలా అత్యంత అప రిశుభ్రమైన, ప్రమాదకరమైన ఆహారాన్ని తయారుచేయటం, నిల్వ చేయటాన్ని హెచ్-ఫాస్ట్ బృందం గుర్తించింది. 110 కిలోల తయారు చేసిన ఫ్రైడ్‌చికెన్, 6 టిన్నుల వంటనూనె, కృత్రిమ ఆహార రసాయన రంగులను స్వాధీనం చేసుకున్నారు. ఫుడ్‌సెఫ్టీ యాక్ట్ అండ్ స్టాండర్డ్స్ యాక్టు ప్రకారం 2006 ప్రకారం హుస్సేనీఆలం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇద్దరిని అదుపులోకి తీసుకుని హుస్సేనీఆలం పోలీసులకు అప్పగించారు.

# పాలిసెట్ తుది విడతలో 25,111 సీట్ల కేటాయింపు

### సీటు పొందిన విద్యార్థులు 23లోగా కాలేజీల్లో చేరాలి

**హైదరాబాద్, జూన్ 19, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నిక్ కాలేజీల్లో ఫైనల్ ఫేజ్ సీట్ల కేటాయింపు చేశారు. తుది విడతలో రాష్ట్రంలో ఉన్న సీట్లలో 25,111 సీట్లను కేటాయించినట్టు సాంకేతిక విద్య శాఖ కమిషనర్ శ్రీదేవసేన శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాలీసెట్‌లో 81,307 మంది అర్హత సాధించగా.. వారిలో ఫైనల్ ఫేజ్‌లో 15,515 మంది సీట్ల కోసం వెబ్ ఆప్షన్లను ఇచ్చారు. మొత్తం 2,96,336 ఆప్షన్లను విద్యార్థులిచ్చారు. వెబ్ ఆప్షన్లు ఇచ్చిన వారిలో 25,111 మంది సీట్ల కేటాయింపు చేశారు. 112 ప్రభుత్వ, పాలిటెక్నిక్ కాలేజీల్లో 33,535 సీట్లు 2026-27 విద్యా సంవత్సరానికి అందుబాటులో ఉన్నాయి. 59 ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీల్లో 18,538 సీట్లు ఉండగా వాటిలో 17,001 సీట్లను కేటాయించారు. మరో 1537 సీట్లు ఖాళీగా ఉన్నాయి. మొత్త సీట్లలో 92 శాతం సీట్లను తుది విడతలో కేటాయించారు. 53 ప్రైవేటు పాలిటెక్నిక్ కాలేజీల్లో 14,997 సీట్లు ఉండగా వాటిలో 8110 సీట్లను కేటాయించారు. మరో 6887 సీట్లు ఖాళీగా ఉన్నాయి. మొత్తం సీట్లలో 54 శాతం సీట్లు తుది విడతలో కేటాయించారు. మొత్తం సీట్లలో 75 శాతం సీట్లను కేటాయించారు. 2132 ఈడబ్ల్యూఎస్ కోటా సీట్లను కేటాయించారు. సీట్లు పొందిన విద్యార్థులు వెంటనే ఫీజు చెల్లించి సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలని, 23 తేదిల్లో ఆయా కాలేజీల్లో నేరుగా చేరాలని సూచించారు.

# 'సర్' ప్రక్రియ జీవించే హక్కును కాలరాస్తోంది

### రాష్ట్ర సదస్సులో రాజకీయ పార్టీల నేతలు

**హైదరాబాద్, జూన్ 19, ప్రభాతవార్త:** స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియ ప్రజలు జీవించే హక్కును హరించేదిగా ఉందని సీపీఐ నిర్వహించిన రాష్ట్ర సదస్సులో రాజకీయ పార్టీల నేతలు అభిప్రాయపడ్డారు. ఎస్ఐఆర్‌కి వ్యతిరేకంగా సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ ఆధ్వర్యంలో శుక్రవారం పార్టీ రాష్ట్ర కార్యాలయం మఖ్దూం భవన్ జరి గింది. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావు అధ్యక్షతన జరిగిన రౌండ్‌సమావేశంలో టిపిసిసి అధ్యక్షులు బి.మహేశ్ కుమార్‌గౌడ్, ఎంపి మల్లు రవి, టిజెఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎం.కోదండరామ్, ప్రొఫెసర్ జి.హరగోపాల్, సిపిఐ(ఎం) రాష్ట్ర నాయకులు అబ్బాస్, సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు చలపతి, సిపిఐ(ఎంఎల్) మాస్ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు హన్మేష్, ఎస్‌యుసిఐ రాష్ట్ర కార్యదర్శి మురహరి, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈ.టి.నరసింహ పాల్గొన్నారు. గ్రామసభ లేదా వార్డు కమిటీలలో ముసాయిదా ఓటర్ల జాబితాను వెల్లడించడం, ఓటు హక్కు నిర్ధారణకు గ్రామ సభలు, వార్డు కమిటీలను అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోవడం, ప్రజల వద్ద అందుబాటులో ఉన్నదృవీకరణ పత్రాలను ఆమోదించడం, అలాగే ఓటు హక్కును, పౌరసత్వానికి ముడి పెట్టరాదని తీర్మానాలను రౌండ్ టేబుల్ సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది.స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(ఎస్ఐఆర్) అనే ప్రక్రియ ప్రజాస్వామ్యబద్ధంగా జరగాల్సిన పద్ధతి అని, కానీ ప్రస్తుతం ఓట్లు తొలగించే కార్యక్రమంగా మారిందని టిపిసిసి అధ్యక్షులు బి.మహేశ్ కుమార్ గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దుర్మార్గాన్ని కమ్యూనిస్టులు, కాంగ్రెస్, లౌకికవాద శక్తులన్నీ కలిసికట్టుగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. ఓటు అనేది ప్రజాస్వామ్యంలో ఒక బ్రహ్మాస్త్రమని, ఆలాంటి ప్రతి ఒక్కరి ఓటును భద్రపరిచి జతచేయడమే ఎస్ఐఆర్ ముఖ్య ఉద్దేశం కావాల్సి ఉండగా, లౌకికవాద పార్టీలకు ఓటు వేస్తారనే అనుమానం ఉన్న ప్రతి ఒక్కరి ఓటు తొలగించే ప్రక్రియగామారిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో 2002లో లింగ్డో నేతృత్వంలో హైదరాబాద్ ఎస్ఐఆర్ జరిగినప్పటికీ, నాటికి నేటికీ చాలా తేడా ఉందన్నారు. ఓట్ల తొలగింపు వల్ల ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, పేద ప్రజలు తీవ్రంగా నష్టపోతు న్నారని, కూలీ పనులు చేసుకునే వారు ఓటు హక్కు కోసం కార్యాలయాల చుట్టూ తిరగడం కష్టంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో బూత్ లెవెల్ ఏజెంట్ (బిఎల్ఏ) వ్యవస్థ చాలా ప్రాధాన్యమైందని, ఓటర్ల జాబితాను కాపాడుకోవడంలో వీరి పాత్ర కీలకమని తెలిపారు. కాంగ్రెస్ తరుపున తెలంగాణలోని 119 నియోజకవర్గాల్లో ఇప్పటికే 108 నియోజకవర్గాల్లో బిఎల్ఏ శిక్షణ పూర్తి చేశామని వెల్లడించారు. కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ ప్రజాస్వామ్యానికి ఓటు అనేది ప్రాణ వాయువు లాంటిదన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు హక్కును కాపాడేందుకు ఎంత వరకైనా ఉద్యమాలకు సిద్ధమని ప్రకటించారు. రాష్ట్రంలో దాదాపు 80 లక్షల మంది ఓటర్ల వివరాలు నిర్ధారణ కాలేదంటూ పత్రికల్లో వస్తున్న వార్తలు తీవ్రంగా కలవరపెడుతున్నాయన్నారు. ఓటు హక్కు నిరూపణకుగాను కేంద్ర ఎన్నికల సంఘం విడుదల చేసిన ధ్రువీకరణ పత్రాలపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ఓటర్ల హక్కులను కాపాడేందుకు అఖిలపక్షం ఆధ్వర్యంలో ఎన్నికల కమిషన్‌కు వినతిపత్రం అందజేయడంతో పాటు అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించేలా ఒత్తిడి తెచ్చేందుకు పెద్ద ఎత్తున నిరసనలు, ఉద్యమాలకు సంసిద్దం అవుదామని ఆయన పిలుపునిచ్చారు. ఎన్నికల కమిషన్ ప్రవేశపెట్టిన ఓటర్ల సవరణ ప్రక్రియలో జరుగుతున్న అవకతవకలను అడ్డుకోవడానికి ప్రజల్లో చైతన్యం తీసుకురావడం ద్వారానే అడ్డుకట్ట వేయగలుగుతామని, ఇందుకు అన్ని పార్టీలు కలిసి రాజకీయంగా చేపట్టాల్సిన వ్యూహాలకు పదును పెట్టాలని కాంగ్రెస్ ఎంపి మల్లు రవి అన్నారు. ఈనెల 25 నుంచి ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రారంభం కానున్న నేపథ్యంలో నిరంతరం సమావేశాలు ఏర్పాటు చేసి ప్రజల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. తెలంగాణ జనసమితి రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ ఎం.కోదండరామ్




మాట్లాడుతూ ఓటు హక్కు కోల్పోవడం అంటే కేవలం ఓటు వేసే అవకాశం పోవడం మాత్రమే కాదని, ఇది భవిష్యత్తులో పౌరసత్వాన్ని కూడా కోల్పోయే ప్రమాదానికి దారితీయవచ్చని హెచ్చరించారు. ముఖ్యం గా దళితులు, ఆదివాసీలు ప్రతి పేద వర్గానికి పెద్ద సమస్యగా మారనుందన్నారు. ప్రస్తుత రాజకీయ పరిణామాల్లో భాగంగా ఓటర్ల జాబితా నుండి పేర్ల తొలగింపు ప్రక్రియకు సమాజంలో ప్రశ్నించే గొంతులను, మేధావులను అర్బన్ నక్సల్స్‌గా ముద్ర వేయడం వెనుక ఒక నిర్దిష్టమైన రాజకీయ భావజాలం దాగి ఉందని ప్రొఫెసర్ జి.హరగోపాల్ ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణలోని నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్ వంటి మైనారిటీలు ఎక్కువగా ఉన్న జిల్లాల్లో ఓట్ల తొలగింపు ప్రక్రియపై అధికార పక్షాలు ప్రత్యేక శ్రద్ధ పెడుతున్నాయని, దీనిని తిప్పికొట్టడానికి వామపక్షాలు, ఇతర ప్రజాస్వామ్య శక్తులు క్షేత్రస్థాయిలో పనిచేయాలని పిలుపునిచ్చారు.